

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 165

సోమవారం 5-9-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మన పోరాటం సరిపోలేదు

ఆసియా కప్ సూపర్–4 మ్యాచ్‌లో పాక్ చేతిలో భారత్ ఓటమి - 12లో



ఐపీవోలు లాభాల తోట కాదు

రాబడుల పంట పండుతుందన్న గ్యారెంటీ లేదు.. - 13లో



భయ ద్వేషాల వ్యాప్తి

ప్రధాని మోదీ సర్వత్రా భయోత్పాతాన్ని, విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

వివరాలు 6లో



కశ్మీర్‌కు హోదాతో కొత్త పార్టీ

తాను పెట్టబోయే కొత్త పార్టీ ఎజెండాలో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఉంటుందని గులాం నబీ ఆజాద్ ప్రకటించారు.

వివరాలు 6లో



మెగసెసె అవార్డు తిరస్కరణ

ప్రతిష్టాత్మక రామన్ మెగసెసె అవార్డును కేరళ మాజీ ఆరోగ్య శాఖ మంత్రి కేకే శైలజ తిరస్కరించారు.

వివరాలు 6లో



కుర్ర గ్రహం చిక్కింది

భూమికి 385 కాంతి సంవత్సరాల దూరంలోని ఓ కుర్ర గ్రహాన్ని జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తన కెమెరా కంటితో బంధించింది.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

'కార్గో'పై మారిటైమ్ బోర్డు దృష్టి



రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌ల నుంచి కార్గో రవాణాను ఆకర్షించే విధంగా రోడ్‌షోలను నిర్వహించనుంది.

వివరాలు 3లో ▸


నాలుగు తరాలు ఉపాధ్యాయ వృత్తిలోనే..!



తూర్పు గోదావరి జిల్లా ఇంజరంలో ఓలేటి కుటుంబం నాలుగు తరాలుగా ఉపాధ్యాయ వృత్తిలోనే కొనసాగుతోంది. గ్రామానికి చెందిన ఓలేటి బంగారేశ్వరశర్మ గురుకుల వ్యవస్థ పరంపరలో తన ఇంటి అరుగు మీదే పాఠాలు బోధించేవారు. ఆయన కుమారులు,మనుమలు ఉపాధ్యాయులే.

వివరాలు 14లో ▸

నేడు గురుపూజోత్సవం



మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం గురుపూజోత్సవాన్ని నిర్వహించనుంది. విజయవాడ లోని 'ఎ' కన్వెన్షన్‌లో జరగనున్న కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొని 176 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందించనున్నారు.

వివరాలు 2లో ▸

వేగంగా.. ఉదారంగా..

గోదావరి వరదల్లో శరవేగంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం

లక్షకుపైగా కుటుంబాలకు రూ.12.22 కోట్లతో నిత్యావసరాల పంపిణీ

- మృతి చెందిన ఏడుగురి కుటుంబాలకు రూ.28 లక్షల పరిహారం చెల్లింపు.. బాధితుల తరలింపు కోసం 2 వేల బోట్లు
- వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రూ.5.17 కోట్ల ఖర్చు
- 94 వేల కుటుంబాలకు తక్షణ సాయంగా నగదు పంపిణీ
- గుడిసెలు దెబ్బతిన్న 14,731 కుటుంబాలకు రూ.10 వేల చొప్పున రూ.14.73 కోట్ల సాయం
- పశువుల పాకలు కూలిపోయిన రైతులకు రూ.2,100 చొప్పున 10 మందికి రూ.21 వేలు అందజేత
- గతంలో ఎన్నడూ లేనివిధంగా బాధిత కుటుంబాలకు భరోసా
- వరద వచ్చినప్పటి నుంచి తగ్గేవరకు అన్ని విధాలా ఆసరా
- శరవేగంగా పంట నష్టం అంచనా
- ఎప్పుడూ లేనివిధంగా అదే సీజన్‌లో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపునకు కసరత్తు



(ఫైల్)

సాక్షి, అమరావతి: ఇటీవల గోదావరిని వరదలు రెండుసార్లు ముంచెత్తినా రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన స్పందించి సహాయక చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణనష్టాన్ని భారీగా తగ్గించగలిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా వరద బాధితులకు ఆపన్న హస్తం అందించి అందరి మన్ననలు అందుకుంది. వరద హెచ్చరికలు జారీ అయిన మరుక్షణం నుంచే అప్రమత్తమై పక్కాగా సహాయక చర్యలు ప్రారంభించింది. ముంపు బాధితుల్ని పునరావాస కేంద్రాలకు తరలించడం నుంచి తిరిగి ఇంటికి వెళ్లే వరకు బాధ్యతగా అన్ని సౌకర్యాలు కల్పించింది. ఈ సంవత్సరం జులై, ఆగస్టు నెలల్లో రెండుసార్లు గోదావరి మహోగ్ర రూపం దాల్చింది. అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపింది. సీఎం జగన్ సూచనలతో అధికార యంత్రాంగం లక్షలాది మందిని ఆదుకుంది. గతంలో విపత్తులు వచ్చినా వెంటనే ఆర్థిక సాయం అందిన దాఖలాల్లేవు. పరిహారం కోసం నెలలు, సంవత్సరాలు ఎదురుచూసేవారు. చంద్రబాబు హయాంలో తిత్లీ తుపాను పరిహారం కోసం ఏడాదిపాటు ఎదురుచూడాల్సి వచ్చింది. కానీ, ఇప్పుడు జగన్ సర్కారు వెంటనే ఉదారంగా

మిగతా 2వ పేజీలో ▶

మహారాష్ట్రలోని పాల్ఘార్ జిల్లా చరోటీ నాకా వద్ద ప్రమాదానికి గురైన మిస్త్రీ ప్రయాణిస్తున్న కారు





సైరస్ మిస్త్రీ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో సైరస్ మిస్త్రీ దుర్మరణం

ముంబై సమీపంలో డివైడర్‌ను ఢీకొన్న కారు

ప్రధాని మోదీ, సీఎం జగన్, పలువురు ప్రముఖుల సంతాపం

ముంబై: టాటా సన్స్ మాజీ చైర్మన్ సైరస్ మిస్త్రీ (54) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆదివారం మరో ముగ్గురితో కలిసి అహ్మదాబాద్ నుంచి ముంబై వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఆయన ప్రయాణిస్తున్న మెర్సిడెజ్ బెంజ్ కారు ముంబైకి 120 కిలోమీటర్ల దూరంలోని పాల్ఘార్ జిల్లా చరోటీ నాకా వద్ద మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో సూర్య నది వంతెనపై రోడ్డు డివైడర్‌ను, ఆపై రిటెన్షన్ వాల్‌ను ఢీకొట్టింది. దాంతో మిస్త్రీతో పాటు మరొకరు అక్కడికక్కడే చనిపోయారు. కారు నడుపుతున్న డాక్టర్

మిగతా 2వ పేజీలో ▶

గౌరవం కోసం పోరు

- టాటా గ్రూప్‌ను కొత్త బాటలో నడిపే యత్నం
- అత్యధిక వాటాలున్నా.. అర్ధంతరంగా పదవుల నుంచి తొలగింపు
- తుది వరకు పోరాడిన సైరస్

13లో

హలో.. డాక్టర్

ఫోన్ కాల్‌తో వైద్య సేవలు..
ఫ్యామిలీ డాక్టర్లకు ప్రత్యేక యాప్

- 1,142 పీహెచ్‌సీల్లో వైద్యులకు మొబైల్ ఫోన్లు
- విలేజ్ క్లినిక్స్/సచివాలయాల్లో డాక్టర్ల ఫోన్ నెంబర్
- సమర్థంగా అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని సమర్థంగా అమలు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ పక్కా ప్రణాళికతో సన్నద్ధమైంది. త్వరలో ప్రయోగాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రత్యేక యాప్ కూడా రూపొందించారు. గ్రామీణ ప్రజలకు ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా వెంటనే సంప్రదించేందుకు వీలుగా ప్రతి పీహెచ్‌సీ వైద్యుడికి మొబైల్ ఫోన్లు అందచేస్తున్నారు. గ్రామ సచివాలయాల్లోనూ వైద్యులు బయోమెట్రిక్ హాజరుకు వీలు కల్పిస్తున్నారు.

ఇప్పటికే టెలి మెడిసిన్ సేవలు.. టాప్‌లో ఏపీ

ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ వైద్య ఆరోగ్య రంగంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు ఆస్పత్రులకు

మిగతా 3వ పేజీలో ▶

నిరంతర ఫాలోఅప్..

మధుమేహం, రక్తపోటు తదితర సమస్యలున్న వారి ఆరోగ్యం గురించి నిరంతరం వాకబు చేసేందుకు యాప్‌లో మరో ఆప్షన్ ఏర్పాటు చేస్తున్నారు. కోమార్బిడిటీస్ (దీర్ఘకాలిక జబ్బులు) బాధితుల వివరాలు సచివాలయాల వారీగా ఫ్యామిలీ డాక్టర్ యాప్‌లో ఉంటాయి. పీహెచ్‌సీ వైద్యుడు గ్రామానికి వెళ్లినప్పుడు యాప్‌లో నమోదైన వివరాలను పరిశీలించి బాధితుల ఆరోగ్య పరిస్థితిని వాకబు చేస్తారు. అనారోగ్య సమస్యలతో శిశువు జన్మిస్తే వెంటనే నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో చికిత్స అందిస్తారు. ఆ వివరాలు కూడా యాప్‌లో నమోదు చేస్తారు. గర్భిణులు, బాలింతలకు చెకప్‌లు, విద్యార్థుల ఆరోగ్యం.. ఇతర అంశాలనూ యాప్ పరిధిలోకి తెస్తున్నారు.

ఈ లిక్కర్ బ్రాండ్లు టీడీపీవి కావా..!

మద్యం అంతా బీ–3 బ్రాండ్లే.. బీ–3 అంటే బాబు, భువనేశ్వరి, బ్రహ్మణిలే

- తాగడంలో అత్తా కోడళ్ల మధ్య పోటీ.. తాగి ఈ మధ్య కొట్టుకున్నట్లు వార్తలు వచ్చాయి
- పైకి పాల వ్యాపారం... తెర వెనక లిక్కర్ బేరాలు
- అనుమతులు ఇప్పించటం వారిద్దరికీ కుటీర పరిశ్రమ లాంటిది
- ఒకవంక మగువ.. మరో వంక మద్యం... అదే పప్పు బ్రాండ్
- టోటల్‌గా బాబు కుటుంబమే తాగుబోతు ఫ్యామిలీ
- చుక్క లేకపోతే తండ్రీ తనయులు ముక్క కూడా మాట్లాడలేరు
- టీడీపీ హయాంలోనే డిస్టిలరీలు, బ్రూవరీలన్నింటికీ అనుమతులు
- మంత్రి ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, పోతుల సునీత, ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పి.అమ్మాజీ ధ్వజం



ఉషశ్రీ చరణ్



వరుదు కళ్యాణి



పోతుల సునీత



పి. అమ్మాజీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉన్న మద్యం బ్రాండ్లన్నీ బాబు, భువనేశ్వరి, బ్రహ్మణి (బీ–3) బ్రాండ్లేనని మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, పోతుల సునీత, ఎస్సీ (మాల) కార్పొరేషన్ చైర్ పర్సన్ పి.అమ్మాజీ స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలో ఉండగా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రహ్మణి ఆధ్వర్యంలోనే లిక్కర్ డీల్స్ జరిగాయని పేర్కొన్నారు. హెరిటేజ్ పేరుతో వారు పాల వ్యాపారం చేస్తున్నట్లు కనిపించినా తెర వెనక జరిగింది లిక్కర్ బేరమేనని వెల్లడించారు. మద్యం తయారీకి అనుమతులు ఇప్పించటాన్ని చంద్రబాబు, భువనేశ్వరి దశాబ్దాలుగా కుటీర పరిశ్రమగా మార్చుకున్నారని చెప్పారు. మద్యం సేవించటంలో స్వయంగా అత్తా కోడళ్లు పోటీ పడతారని.. ఇలా తాగి ఇటీవల కొట్టుకున్నట్లు కూడా వార్తలు వచ్చాయని చెప్పారు. టోటల్‌గా బాబు కుటుంబమే తాగుబోతు ఫ్యామిలీ అని వ్యాఖ్యానించారు. ఒకవంక మగువ, మరోవంక మద్యం.. ఇదే పప్పు బ్రాండ్ అని లోకేష్‌పై ధ్వజమెత్తారు. ఇంట్లో అన్నింటికీ లైసెన్స్.. అది తమకు సాధారణమే అన్నట్లుగా నారా కుటుంబం వ్యవహార శైలి ఉందన్నారు. చుక్క లేకపోతే తండ్రీ కొడుకులు ఒక్క ముక్క కూడా మాట్లాడలేరని చెప్పారు. ఆదివారం అనంతపురం, విశాఖపట్నం, తాడేపల్లిలో వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలివీ..

- చంద్రబాబు హయాంలోనే బూమ్ బూమ్ బీర్, ప్రెసిడెంట్స్ మెడల్, గవర్నర్స్ ఛాయిస్, పవర్ స్టార్ 999, రష్యన్ రోమనోవా, ఏసీబీ, 999 లెజెండ్, హెవెన్స్ డోర్, క్రేజీ డాల్, క్లిఫ్ హేంగర్ లాంటి 254 బ్రాండ్లకు అనుమతులిచ్చారు. ఇలాంటి బ్రాండ్ల పేరుతో దత్త పుత్రుడి రుణం, వియ్యంకుడి రుణం తీర్చుకున్నారు.
- మద్యం కంపెనీలన్నీ టీడీపీ నేతలవే. ఎస్పీవై బ్రాండ్ ఎవరిది? ఎస్పీవై రెడ్డి


మిగతా 10వ పేజీలో ▶

ఇదండీ సంగతి



అడిగినంత కట్నం ఇవ్వకుంటే దానిని తిరిగి ఎలా రాబట్టుకోవాలో తనకు బాగా తెలుసట! పెళ్లికి ఏర్పాట్లు చేసుకోమంటున్నాడు!

నెల్లూరుకు నగిషీ



రేపే బ్యారేజీ ప్రారంభం.. వందేళ్ల కల సాకారం

జాతికి అంకితం చేయనున్న సీఎం వైఎస్ జగన్


- ఆంగ్లేయుల కాలంలో పెన్నాపై ఆనకట్ట నిర్మాణం.. శిథిలావస్థకు చేరడంతో ఆయకట్టుకు నీళ్లందించలేని దుస్థితి
- ఏమాత్రం వరద వచ్చినా నెల్లూరు–కోవూరు మధ్య రాకపోకలు బంద్
- ఆనకట్ట స్థానంలో బ్యారేజ్ నిర్మించాలని 1904 నుంచి ప్రజల వినతి
- జలయజ్ఞంలో భాగంగా సాకారం చేస్తూ వైఎస్సార్ అడుగులు.. రూ.86.62 కోట్లతో బ్యారేజ్ పనులను కొలిక్కి తెచ్చిన మహానేత
- రాష్ట్ర విభజన తరువాత అటకెక్కించిన టీడీపీ సర్కార్
- రెండేళ్ల తర్వాత అంచనా వ్యయాన్ని పెంచేసి కమీషన్లకే ప్రాధాన్యం
- రూ.71.54 కోట్లు మట్టిపాలు.. పూర్తి చేయలేక చేతులెత్తేసిన చంద్రబాబు
- అధికారంలోకి రాగానే నెల్లూరు బ్యారేజ్‌ను ప్రాధాన్యతగా చేపట్టిన సీఎం
- కరోనా, వరదలు లాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ 51 గేట్లతో సహా పూర్తి

(నెల్లూరు బ్యారేజ్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి రామగోపాలరెడ్డి ఆలమూరు)

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రజల వందేళ్ల స్వప్నం నెల్లూరు బ్యారేజ్ సాకారమవుతోంది. జలయజ్ఞంలో భాగంగా దివంగత వైఎస్సార్ చేపట్టిన నెల్లూరు బ్యారేజ్ పనులను ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేశారు. ఈ బ్యారేజ్‌ను ఈనెల 6వతేదీన జాతికి అంకితం చేయనున్నారు. బ్యారేజ్ ద్వారా సర్వేపల్లి, జాఫర్ సాహెబ్ కాలువల కింద సర్వేపల్లి, కోవూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల పరిధిలోని ముత్తుకూరు, టీపీ గూడూరు, వెంకటాచలం, ఇందుకూరుపేట, నెల్లూరు మండలాల్లోని 77 గ్రామాల్లో 99,525 ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందనుంది. బ్యారేజ్‌ను పూర్తి చేసి నిత్యం 0.4 టీఎంసీలను నిల్వ చేయడం ద్వారా నెల్లూరుతోపాటు 77 గ్రామాల్లో తాగునీటి సమస్యను సీఎం జగన్ శాశ్వతంగా పరిష్కరించారు. వరద నియంత్రణ ద్వారా ముంపు ముప్పు నుంచి తప్పించారు. నెల్లూరు బ్యారేజ్ కమ్ 2 వరసల రోడ్డు బ్రిడ్జిని పూర్తి చేయడంతో

మిగతా 2వ పేజీలో ▶

మానవ అక్రమ రవాణా తగ్గడం శుభపరిణామం



- ఏపీ ప్రభుత్వ చర్యలు ఫలిస్తున్నాయి
- 99 శాతం పైగా కేసుల్లో చార్జిషీట్ వేయడం ఒక రికార్డ్
- మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్ల ఏర్పాటుతో మంచి ఫలితాలు
- జాతీయ నేర నివేదికపై హెల్ప్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి రామమోహన్ విశ్లేషణ

- వివరాలు 14లో

క్లుప్తంగా

రేపు సీఎం జగన్ నెల్లూరు జిల్లా పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. పెన్నానదిపై సంగం వద్ద నిర్మించిన మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం అక్కడ బహిరంగసభలో మాట్లాడతారు. తరువాత ముఖ్యమంత్రి జగన్ నెల్లూరు చేరుకుని నెల్లూరు బ్యారేజ్ కమ్ బ్రిడ్జిని ప్రారంభించి జాతికి అంకితం చేస్తారు.

సీఎం జగన్ పర్యటన ఇలా..

- ఉదయం 9.30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరి 10.40 గంటలకు సంగం చేరుకుంటారు.
- 11–1.10 గంటల మధ్య మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్‌ను ప్రారంభించి, బహిరంగసభలో ప్రసంగిస్తారు.
- 1.20 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 1.45 గంటలకు నెల్లూరు బ్యారేజ్ వద్దకు చేరుకుంటారు.
- 1.50–2.20 గంటల మధ్య నెల్లూరు బ్యారేజ్ కమ్ బ్రిడ్జిని ప్రారంభిస్తారు.
- 2.20 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 4.15 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

ఉపాధ్యాయ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం పిలుపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయుల అన్ని సమస్యలను, ముఖ్యంగా ఫేషియల్ అటెండెన్స్ ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని పేర్కొన్నారు. అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రకటించాలని సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు.

● తెలంగాణ

రీల్స్ చేయబోతూ.. ప్రాణాల మీదకు తెచ్చుకుని



కాజీపేట రూరల్: ఓ ఇంటర్ విద్యార్థి రీల్స్ చేయబోతూ ప్రాణాల మీదికి తెచ్చుకున్న ఘటన హనుమకొండ జిల్లా కాజీపేట టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. వివరాల ప్రకారం ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న చింతాకుల అక్షయ్ తన స్నేహితులతో కలిసి రైలు పట్టాల వద్దకు రీల్స్ వీడియో షూట్ చేయడానికి వచ్చాడు. అక్షయ్ రైలు వస్తుంటే రైలు పట్టాల కింద నుంచి నడుచుకుంటూ వెళ్తున్నట్లు తన ఫ్రెండ్స్ వీడియో షూట్ చేస్తుండగా.. కాజీపేట నుంచి బల్లార్షా వైపు వెళ్తున్న రైలు ఇంజన్ ఢీకొట్టింది. దీంతో అక్షయ్ కంకర రాళ్లపై పడటంతో తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. 24 గంటలు గడిస్తే గానీ అతడి పరిస్థితి గురించి చెప్పలేమన్నారు.

చివరి దశకు ఖరీఫ్



- 79 శాతం దాటిన పంటల సాగు
- సాధారణ విస్తీర్ణం 92.04 లక్షల ఎకరాలు
- ఇప్పటికే 72 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- 30 లక్షల ఎకరాల్లో వరి.. 14.70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- రికార్డు స్థాయిలో నూనెగింజల సాగు
- భారీగా పెరిగిన ఆముదం, సోయాబీన్, నువ్వుల సాగు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఖరీఫ్ చివరి దశకు చేరుకుంటోంది. సమృద్ధిగా కురుస్తున్న వర్షాలకు తోడు అడుగడుగునా ప్రభుత్వం అండగా నిలబడడంతో రైతులు రెట్టించిన ఉత్సాహంతో పంటలు సాగుచేస్తున్నారు. సీజన్‌కు ముందుగానే ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచిన ప్రభుత్వం ఏ దశలోనూ రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టింది. దీంతో ఇప్పటికే 79 శాతం మేర పంటలు సాగయ్యాయి. మరోవైపు.. ముందస్తుగా సాగునీరు విడుదల చేయడంతో పాటు పుష్కలంగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ సాఫీగా సాగుతోంది.

శివారు భూములకు సమృద్ధిగా సాగునీరు

ఇక సీజన్ సాధారణ వర్షపాతం 556 మిల్లీమీటర్లు (ఎంఎం) కాగా, ఇప్పటివరకు 424.6 ఎంఎం వర్షపాతం కురవాల్సి ఉంది. కానీ, 429.9 ఎంఎం అధిక వర్షపాతం నమోదైంది. కోస్తాంధ్రలో 454 ఎంఎంకు 466.6 ఎంఎం.., రాయలసీమలో 200 ఎంఎంకు 257.5 ఎంఎం వర్షపాతం కురిసింది. సాధారణం కంటే రాయలసీమలో 28 శాతం, కోస్తాంధ్రలో 2.8 శాతం అధిక వర్షపాతం నమోదైంది. గోదావరి, కృష్ణా, పెన్నా వంటి నదులకు వరదలు పోటెత్తడంతో శివారు భూములకు సైతం సమృద్ధిగా సాగునీరు అందుతోంది. ఫలితంగా తెగుళ్ల బెడద ఎక్కడా కన్పించడంలేదు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశకు చేరుకోగా మిగిలిన పంటలు కూడా కాయకట్టే దశకు చేరుకున్నాయి.

30 లక్షల ఎకరాలు దాటిన వరి నాట్లు

ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 92.04 లక్షల ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 72 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ప్రధానంగా..

■ వరి సాధారణ విస్తీర్ణం 38.98 లక్షల ఎకరాలు అయితే ఇప్పటికే 30 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ■ అపరాలు సాధారణ విస్తీర్ణం 8.28 లక్షల ఎకరాలు కాగా, 4.75 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. ■ నూనెగింజల సాగు విస్తీర్ణం 17.96 లక్షల ఎకరాలు అయితే.. ఇప్పటికే 15 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. ■ ఇక ఇతర పంటల విషయానికి వస్తే 14.70 లక్షల ఎకరాల్లో పత్తి, 2.82 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.55 లక్షల ఎకరాల్లో మిరప, 93వేల ఎకరాల్లో చెరకు, 45వేల ఎకరాల్లో ఉల్లి, 35 వేల ఎకరాల్లో పసుపు పంట సాగయ్యాయి.

పెరిగిన ఆముదం, నువ్వులు, సోయాబీన్ సాగు

ఈ ఏడాది వేరుశనగ సాగు తగ్గగా, ఆ మేర ఆముదం, నువ్వులు, సోయాబీన్ రికార్డుస్థాయిలో సాగయ్యాయి. ■ వేరుశనగ సాధారణ విస్తీర్ణం 16.84 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 13.42 లక్షల ఎకరాల్లో సాగైంది. గతేడాది ఇదే సమయానికి 15.37లక్షల ఎకరాల్లో సాగైంది. ■ ఈ ఏడాది వేరుశనగ రైతులు ఇతర పంటల సాగువైపు మళ్లారు. ఫలితంగా నువ్వులు సాధారణ విస్తీర్ణం 32వేల ఎకరాలు అయితే.. ఇప్పటివరకు 42వేల ఎకరాల్లో సాగైంది. ■ అలాగే, ఆముదం సాధారణ విస్తీర్ణం 59వేల ఎకరాలు కాగా, 63వేల ఎకరాల్లో సాగైంది. ■ పొద్దుతిరుగుడు సాధారణ విస్తీర్ణం 9,645 ఎకరాలు అయితే ఇప్పటివరకు 15,932 ఎకరాల్లో సాగైంది. ■ ఇక సోయాబీన్ సాధారణ విస్తీర్ణం 3,665 ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 22,607 ఎకరాల్లో సాగైంది. ఈ–క్రాపింగ్ కూడా జోరుగా సాగుతోంది. ఇప్పటివరకు 46.79 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, 15.12 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలతో పాటు 10,427 ఎకరాల్లో మల్బరీ (పట్టు) పంటల సాగును నమోదు చేశారు.

సెప్టెంబర్‌లోనూ సమృద్ధిగా ఎరువులు..

సీజన్‌కు 19.02 లక్షల టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటివరకు 17.21 లక్షల టన్నులు అందుబాటులో ఉంచారు. ఇందులో 9.99 లక్షల టన్నుల అమ్మకాలు జరగగా, ఇంకా 7.22 లక్షల టన్నులు (యూరియా 3.24 లక్షల టన్నులు, కాంప్లెక్స్ 2.76 లక్షల టన్నులు, డీఏపీ 67,394 టన్నులు, ఎంఓపీ 29,785 టన్నులు) అందుబాటులో ఉన్నాయి. ఆర్బీకేల్లో ప్రత్యేకంగా 1.98 లక్షల టన్నుల ఎరువులను నిల్వచేయగా, ఇప్పటివరకు 1.23 లక్షల టన్నుల ఎరువులను రైతులు కొనుగోలు చేశారు. ఇంకా 74,823 టన్నులు (యూరియా–43,478 టన్నులు, డీఏపీ–15,627 టన్నులు, కాంప్లెక్స్–11,493 టన్నులు, ఎంఓపీ–4128 టన్నులు, ఎస్ఎస్‌పీ–97 టన్నులు) నిల్వలు ఉన్నాయి. సెప్టెంబర్‌లో 5.22 లక్షల టన్నుల ఎరువులు అవసరం కాగా, ఆ మేరకు కేంద్రం కేటాయింపులు జరిపింది. ఈ నిల్వలు రాష్ట్రానికి రావాల్సి ఉంది.

నేడు గురుపూజోత్సవం



- 176 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సీఎం చేతుల మీదుగా పురస్కారాల ప్రదానం
- విజయవాడ 'ఎ' కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాట్లు పూర్తి

సాక్షి , అమరావతి: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించనుంది. ఈ మేరకు విద్యా శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొని రాష్ట్రంలోని 176 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందించి సన్మానిస్తారు. పాఠశాల విద్యాశాఖ నుంచి 58 మంది ఉపాధ్యాయులు, ఇంటర్ విద్య నుంచి 19 మంది, ఉన్నత విద్య నుంచి 60 మంది అధ్యాపకులు, భాషా సాంస్కృతిక శాఖ నుంచి ఐదుగురు, కేజీబీవీల నుంచి ముగ్గురు, జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఐదుగురు ఈ పురస్కారాలను అందుకోనున్నారు. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ విద్యాలయ అవార్డులు సాధించిన 26 పాఠశాలలను కూడా ఈ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కె.సురేష్‌కుమార్ తెలిపారు. గురుపూజోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి పాల్గొంటారు.

గవర్నర్ టీచర్స్ డే శుభాకాంక్షలు

సమసమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు మూలస్తంభాలని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు ఆయన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యావేత్త, తత్వవేత్త, రాజనీతిజ్ఞుడైన మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉన్నత విలువల కోసం అహరహం కృషి చేశారని కొనియాడారు. పాశ్చాత్య దేశాలకు భారతీయ తత్వశాస్త్రాన్ని, విజ్ఞానాన్ని పరిచయం చేశారని పేర్కొన్నారు. అటువంటి మహనీయుని జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం ఉపాధ్యాయులకు గర్వకారణమన్నారు. విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

మంత్రి బొత్స గురుపూజోత్సవ శుభాకాంక్షలు

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక భూమిక పోషిస్తారని, అటువంటి వారిని గురుపూజోత్సవం రోజు సన్మానించుకోవడం ముదావహమని మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యారంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని మంత్రి ఆకాంక్షించారు.

వేగంగా.. ఉదారంగా..

▶ మొదటి పేజీ తరువాయి

పరిహారాన్ని అందించి బాధితులకు భరోసా కల్పించింది.

శరవేగంగా సాయం పంపిణీ

బాధితులను ఆదుకునేందుకు సహాయక చర్యలు శరవేగంగా చేపట్టినా వరద ప్రభావం, ఇళ్లు కూలిపోవడంతో ఏడుగురు మృత్యువాత పడ్డారు. వారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున రూ.28 లక్షల ఎక్స్‌గ్రేషియాను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అందించింది. ఇక 45 మండలాల్లో 467 గ్రామాలు వరద ప్రభావానికి గురయ్యాయి. 389 గ్రామాలు ముంపుబారిన పడ్డాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే 205 గ్రామాలు ముంపు బారినపడ్డాయి. ఈ గ్రామాల నుంచి 1.50 లక్షల మందిని ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ముంపు గ్రామాల నుంచి బోట్ల ద్వారా తరలించడానికి రూ.5.17 కోట్లు ఖర్చుచేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా రెండు వేల బోట్లను అద్దెకు తీసుకుంది. 195 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రతిరోజు సగటున 1.07 వేల మందికి తాత్కాలికంగా ఆశ్రయం కల్పించింది. అక్కడ వారికి భోజనం,



గోదావరి వరదల సమయంలో సహాయం అందిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది(ఫైల్)

దుస్తులివ్వడంతోపాటు వైద్యసేవలు అందించింది. నిత్యావసరాలూ పంపిణీ చేసింది. ఇందుకోసం రూ.12.22 కోట్లు ఖర్చుచేసింది.

వేగంగా పంట నష్టం అంచనా

ఇక పంట నష్టం అంచనానూ శరవేగంగా నిర్వహిస్తోంది. గతంలో ఎప్పుడూలేని విధంగా ఏ సీజన్‌లో జరిగిన నష్టానికి ఆ సీజన్‌లోనే పరిహారం ఇవ్వాలన్న విధానపరమైన నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకు అనుగుణంగా వచ్చే సీజన్ ఆరంభమయ్యేలోగానే ఇన్‌పుట్ సబ్సిడీని అందించాలన్న దృఢసంకల్పంతో సర్కారు ఉంది. అక్టోబర్‌లోగా ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది.

సహాయక చర్యల్లో 40 వేల మంది..

మరోవైపు.. వరద సహాయక చర్యల్లో గతంలో ఎన్నడూలేని విధంగా 40 వేల మందికిపైగా అధికారులు, సిబ్బంది పాలుపంచుకున్నారు. వరద హెచ్చరికలు మొదలైనప్పటి నుంచి సీఎం సహా ప్రభుత్వ యంత్రాంగమంతా అప్రమత్తమైంది. ఆరు జిల్లాల్లో ఆరుగురు కలెక్టర్లు, ఆరుగురు జేసీలు, ఆరుగురు ఎస్పీలు పక్కా ప్రణాళికతో విపత్తును ఎదుర్కొన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది కలిసి 1,235 మంది.. గ్రామ సచివాలయ సిబ్బంది 8,960 మంది, గ్రామ వలంటీర్లు 13,241 మంది, పారిశుధ్య సిబ్బంది 2,650 మంది, వైద్య సిబ్బంది 1,294 మంది, బోటు డ్రైవర్లు, సహాయకులు 631 మంది ప్రత్యక్షంగా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. వీరంతా కలిపి మొత్తం 28,029 మంది పనిచేశారు. వీరుకాక.. పోలీసులు, ఫైర్ సర్వీసెస్, పశు సంవర్ధక, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది మరో 10 వేల మందికిపైగా సహాయక చర్యల్లో నిరంతరాయంగా సేవలందించారు. ఇలా వరద బాధితులను ఎక్కడికక్కడ శరవేగంగా ఆదుకున్న తీరుపై సర్వత్రా సంతృప్తి వ్యక్తమైంది.

ఎప్పుడూ లేని విధంగా తక్షణ సాయం

ఇక వరద తగ్గాక శిబిరాల నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు బాధిత కుటుంబాలకు గతంలో ఎప్పుడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సాయం కింద నగదు అందించింది.

- 94,715 కుటుంబాలకు వెయ్యి నుంచి రూ.2 వేల చొప్పున పంపిణీ చేసింది.
- ఒక లక్షా 966 కుటుంబాలకు 25 కేజీల బియ్యం, కేజీ చొప్పున కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, లీటర్ ఆయిల్‌ను పంపిణీ చేసింది.
- 2,429 టన్నుల బియ్యాన్ని రూ.3.84 కోట్ల ఖర్చుతో పంపిణీ చేసింది.
- వరద ధాటికి గుడిసెలు దెబ్బతిన్న 14,731 కుటుంబాలకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.14.73 కోట్ల సాయం అందించింది.
- ఇళ్లు దెబ్బతిన్న 4,509 కుటుంబాలకు రూ.15.16 కోట్ల పరిహారాన్ని ఇచ్చింది.
- పశువుల పాకలు కూలిపోయిన రైతులకు రూ.2,100 చొప్పున 10 మందికి రూ.21 వేలు అందించింది.
- 543 వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్య పరీక్షలు చేయించింది.
- ముంపు ప్రాంతాల్లో ముందస్తుగా పారిశుధ్య చర్యలు చేపట్టి జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంది. దోమలు పెరగకుండా ఫాగింగ్, బ్లీచింగ్ చల్లారు. ఇందుకోసం రూ.41 లక్షలు వినియోగించింది.
- ఇక రోడ్లు, డ్రెయిన్లు, ఇళ్లలో పేరుకుపోయిన బురద, చెత్త, ఇతర వ్యర్థాలను కార్మికులు తొలగించారు.
- ముంపు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పథకాలు దెబ్బతినడంతో యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసింది. రూ.12.4 కోట్లతో ట్యాంకర్లు, అద్దె బోట్ల ద్వారా నీటిని అందించింది.
- దెబ్బతిన్న తాగునీటి సరఫరా వ్యవస్థలు, పారిశుధ్య వ్యవస్థలు, రోడ్లు, నీటిపారుదల వ్యవస్థల పునరుద్ధరణ కోసం రూ.18 కోట్లు ఖర్చుచేసింది.

నెల్లూరుకు నగిషీ



రికార్డు సమయంలో ప్రభుత్వం పూర్తి చేసిన నెల్లూరు బ్యారేజీ. (ఇన్‌సెట్) ప్రారంభానికి సిద్ధంగా బ్యారేజీ

▶ మొదటి పేజీ తరువాయి

నెల్లూరు–కోవూరు మధ్య రవాణా ఇబ్బందులు శాశ్వతంగా పరిష్కారమయ్యాయి. దీంతోపాటు మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీని కూడా సీఎం జగన్ ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు.

ఆంగ్లేయుల కాలంలో...

1854–55లో ఆంగ్లేయుల హయాంలో నెల్లూరు నగరానికి సమీపంలో పెన్నా నదికి అడ్డంగా 481.89 మీటర్ల వెడల్పుతో ఆనకట్ట నిర్మించి అరకొరగా మాత్రమే ఆయకట్టుకు నీళ్లందించారు. 1862లో భారీ వరదలకు ఆనకట్ట దెబ్బతినడంతో 621.79 మీటర్ల వెడల్పుతో 0.7 మీటర్ల ఎత్తుతో కొత్త ఆనకట్ట నిర్మించారు. పూడిక పేరుకుపోవడం, శిథిలం కావడంతో ఆయకట్టుకు నీళ్లందించడం 1904 నాటికే సవాల్‌గా మారింది. నెల్లూరు తాగునీటికి తల్లడిల్లింది. ఆనకట్టకు దిగువన ఉన్న రోడ్డు ద్వారా నెల్లూరు–కోవూరు మధ్య రాకపోకలు సాగించేవారు. పెన్నా నదికి కాస్త వరద వచ్చినా రాకపోకలు స్తంభించిపోయేవి. ఆనకట్ట వల్ల వరద వెనక్కి ఎగదన్ని నెల్లూరును ముంచెత్తేది. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఆనకట్ట స్థానంలో బ్యారేజ్ కమ్ రోడ్ బ్రిడ్జి నిర్మించాలని 1904 నాటి నుంచి నెల్లూరు ప్రజలు కోరుతున్నా 2004 వరకూ ఎవరూ పట్టించుకోలేదు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా నెల్లూరు బ్యారేజ్ కమ్ రోడ్ బ్రిడ్జి నిర్మాణాన్ని రూ.147.20 కోట్లతో 2008 ఏప్రిల్ 24న చేపట్టారు. ఆయన హయాంలో బ్యారేజ్ పనులు వరుగులెత్తాయి. రూ.86.62 కోట్లను ఖర్చు చేశారు. మహానేత హఠాన్మరణం నెల్లూరు బ్యారేజ్‌కు శాపంగా మారింది.


నేడు ప్రతికూల పరిస్థితుల్లోనూ పూర్తి..

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక నెల్లూరు బ్యారేజ్‌ను ప్రాధాన్యతగా చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. 2020 మార్చి నుంచి 2021 చివరిదాకా కరోనా మహమ్మారి మూడు దఫాలు విజృంభించింది. పెన్నా చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో 2019–20, 2020–21, 2021–22లో వరుసగా భారీ వరదలు వచ్చాయి. నెల్లూరు బ్యారేజ్ నుంచి 2019–20లో 45.52, 2020–21లో 301.52, 2021–22లో 373.52 టీఎంసీల వరద జలాలు సముద్రంలో కలిశాయంటే ఏ స్థాయిలో ఉగ్రరూపం దాల్చిందో అంచనా వేయవచ్చు. వరద ఉద్ధృతికి బ్యారేజ్‌కు ఎగువన ఆయకట్టుకు నీళ్లందించడం కోసం తాత్కాలికంగా నిర్మించిన కాఫర్ డ్యామ్ (మట్టికట్ట) దెబ్బతిన్నది. వరదలు తగ్గాక మళ్లీ మట్టికట్టను సరిచేసి ఆయకట్టుకు నీళ్లందిస్తూ బ్యారేజ్ పనులు చేయడం సవాల్‌గా మారింది. ఈ తీవ్ర ప్రతికూలతల్లోనూ బ్యారేజ్‌లో రెండు మీటర్ల మందంతో 57 పియర్లను ప్రభుత్వం పూర్తి చేసింది. 57 పియర్ల మధ్య పది మీటర్ల ఎత్తు, మూడు మీటర్ల వెడల్పుతో 43 గేట్లు, కోతకు గురై వచ్చిన మట్టిని దిగువకు పంపడానికి పది మీటర్ల ఎత్తు, 4.3 మీటర్ల వెడల్పుతో 8 గేట్లు (స్కవర్ స్లూయిజ్ గేట్లు) వెరసి 51 గేట్లను ఏర్పాటు చేసింది. గేట్లను ఎత్తడం, దించడానికి వీలుగా ఎలక్ట్రిక్ విధానంలో హాయిస్ట్‌ను ఏర్పాటు చేసింది. బ్యారేజ్‌కు 22 మీటర్ల ఎత్తులో 1.2 మీటర్ల మందం, 7.5 మీటర్ల వెడల్పుతో రెండు వరుసల రోడ్ బ్రిడ్జిని నిర్మించారు. సర్వేపల్లి, జాఫర్ సాహెబ్ కాలువలకు నీటిని సరఫరా చేసే రెగ్యులేటర్‌ను పూర్తి చేశారు. బ్యారేజ్‌లో 0.4 టీఎంసీలను నిల్వ చేయడానికి వీలుగా కుడి, ఎడమ కరకట్టలను పటిష్టం చేసేందుకు రూ.77.37 కోట్లను ఖర్చు చేశారు.

నాడు కాలయాపన.. కమీషన్లకే ప్రాధాన్యం

రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ సర్కార్ నెల్లూరు బ్యారేజ్ పనులను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. బ్రిటీష్ సర్కార్ నిర్మించిన పాత ఆనకట్టకు పది మీటర్ల ఎగువన 10.9 లక్షల క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేసేలా 640 మీటర్ల వెడల్పుతో నెల్లూరు బ్యారేజ్ నిర్మాణాన్ని చేపట్టారు. పాత ఆనకట్ట వల్ల వరద ప్రవాహం వెనక్కి ఎగదన్నడం బ్యారేజ్ నిర్మాణానికి సమస్యగా మారింది. పాత ఆనకట్టను పూర్తిగా తొలగించి బ్యారేజ్ నిర్మిస్తున్న ప్రాంతానికి 20 మీటర్ల ఎగువన కాఫర్ డ్యామ్ నిర్మించి ఆయకట్టుకు నీళ్లందిస్తూ బ్యారేజ్ నిర్మించాలని 2014లో ప్రభుత్వానికి నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చింది. 2016 వరకూ టీడీపీ సర్కార్ దీన్ని పరిశీలించకుండా జాప్యం చేసింది. ఆ తరువాత డిజైన్లలో మార్పులు చేసి అంచనా వ్యయాన్ని రూ.274.83 కోట్లకు సవరించింది. కాంట్రాక్టర్ నుంచి కమీషన్లు రాబట్టుకునే పనులకే ప్రాధాన్యం ఇచ్చింది. 2016 నుంచి 2019 మే 29 వరకూ రూ.71.54 కోట్లు ఖర్చు చేసినా బ్యారేజ్‌లో 57 ఫియర్లను (కాంక్రీట్ దిమ్మెలు) పునాది కంటే ఒక మీటర్ ఎత్తు వరకు మాత్రమే చేయగలిగింది.

నూతన అధ్యాయం..



నెల్లూరు జిల్లా ప్రజల వందేళ్ల కలను సాకారం చేస్తూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పనులు ప్రారంభిస్తే ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ బ్యారేజీని పూర్తి చేశారు. ఈనెల 6న నెల్లూరు బ్యారేజ్‌ను సీఎం జగన్ జాతికి అంకితం చేసి చరిత్రలో నూతన అధ్యాయాన్ని లిఖించనున్నారు. ఆయకట్టుకు సమృద్ధిగా నీటితోపాటు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. నెల్లూరు–కోవూరు మధ్య రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుంది.

– అంబటి రాంబాబు, జలవనరుల శాఖ మంత్రి


పెరగనున్న భూగర్భ జలమట్టం..



నెల్లూరు బ్యారేజ్‌ను ప్రాధాన్యతగా చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. కరోనా, వరదలు లాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ పనులు కొనసాగాయి. సీఎం జగన్, మంత్రి అంబటి రాంబాబు మార్గదర్శకాల మేరకు సవాల్‌గా తీసుకుని పెన్నా బ్యారేజ్‌ను పూర్తి చేశాం. ఆయకట్టుకు సమృద్ధిగా నీటి సరఫరాతోపాటు బ్యారేజ్‌లో నిత్యం 0.4 టీఎంసీలను నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుతుంది. సాగు, తాగునీటి సమస్యకు సీఎం జగన్ శాశ్వత పరిష్కారాన్ని చూపారు.

– సి.నారాయణరెడ్డి, ఈఎన్‌సీ, జలవనరుల శాఖ

వరద ఉధృతిలోనూ..



పెన్నా చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో గత మూడేళ్లుగా భారీ వరదలు వచ్చాయి. మట్టికట్ట కొట్టుకుపోవడంతో దాన్ని సరిచేసి ఆయకట్టుకు నీళ్లందిస్తూ బ్యారేజ్ పనులు పూర్తి చేయడం సవాల్‌గా మారింది. వరద ఉధృతిని అధిగమించి సీఎం జగన్ నిర్దేశించిన గడువులోగా బ్యారేజ్‌ను పూర్తి చేశాం. ఈ బ్యారేజ్ పూర్తవ్వడంతో నెల్లూరు జిల్లా ప్రజల వందేళ్ల కల నెరవేరుతోంది.

– హరినారాయణరెడ్డి, సీఈ, తెలుగుగంగ

రోడ్డు ప్రమాదంలో సైరస్ మిస్త్రీ దుర్మరణం

▶ మొదటి పేజీ తరువాయి

అనాహిత పండోలే, ఆమె భర్త డేరియస్ గాయపడ్డారు. మరో మృతుడు డేరియస్ సోదరుడు జహంగీర్ పండోలె అని పాల్ఘార్ ఎస్పీ బాలాసాహెబ్ పాటిల్ వెల్లడించారు. ప్రమాద సమయంలో మృతులిద్దరూ వెనక సీట్లలో కూర్చుని ఉన్నారు. మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో వాహనం అదుపు తప్పి ఉంటుందని అధికారులు తెలిపారు. ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ వెల్లడించారు. సైరస్ తండ్రి, ప్రముఖ వ్యాపారవేత్త పల్లోంజీ షాపూర్జీ మిస్త్రీ రెండు నెలల క్రితమే చనిపోయారు. అనాహిత పండోలె ముంబైలోని ప్రముఖ బీచ్‌క్యాండీ ఆస్పత్రిలో గైనకాలజిస్టు. డేరియస్ జేఎం ఫైనాన్షియల్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ఎండీ సీఈవోగా ఉన్నారు. వారిని గుజరాత్‌లోని వాపీలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ప్రముఖుల సంతాపం

మిస్త్రీ దుర్మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఆయన మృతి వాణిజ్య, పారిశ్రామిక లోకానికి పెద్ద లోటని మోదీ పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, నితిన్ గడ్కరీ, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, పారిశ్రామికవేత్తలు గౌతం ఆదానీ, ఆనంద్ మహీంద్రా తదితరులు మిస్త్రీ మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మిస్త్రీ కుటుంబానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన అద్భుతమైన వ్యాపారవేత్తలలో ఆయన ఒకరని ట్వీట్ చేశారు. మిస్త్రీ మరణ వార్త షాక్‌కు గురిచేసిందని, ఆయన మరణం వాణిజ్య ప్రపంచానికే తీరని లోటని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే పేర్కొన్నారు.

సైరస్ మిస్త్రీ మృతిపై సీఎం జగన్ సంతాపం

సాక్షి, అమరావతి : టాటా సన్స్ మాజీ చైర్మన్ సైరస్ మిస్త్రీ అకాల మరణంపట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంతాపం వ్యక్తంచేశారు. మిస్త్రీ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సైరస్ మిస్త్రీ ఒక ఆశాజనక వ్యాపార దిగ్గజమని సీఎం కొనియాడారు.

సంగం బ్యారేజీ వద్ద వైఎస్సార్, గౌతంరెడ్డి విగ్రహాలు

- నెల్లూరు బ్యారేజ్ వద్ద వైఎస్సార్ మరో విగ్రహం
- రేపు సీఎం జగన్ చేతుల మీదుగా ఆవిష్కరణ



కొత్తపేట శిల్పశాలలో వైఎస్సార్, గౌతంరెడ్డి విగ్రహాలతో శిల్పి రాజ్‌కుమార్

కొత్తపేట: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం బ్యారేజీ వద్ద దివంగత సీఎం వైఎస్సార్, దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డిల కాంస్య విగ్రహాలతో పాటు, నెల్లూరు బ్యారేజ్ కమ్ బ్రిడ్జి వద్ద వైఎస్సార్ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించనున్నారు. ఈ విగ్రహాలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన ప్రముఖ జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ తయారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ మేరకు ఈ మూడు విగ్రహాలను తయారు చేసినట్టు రాజ్‌కుమార్ ఆదివారం 'సాక్షి'తో చెప్పారు. ఒక్కో విగ్రహాన్ని 2.5 టన్నుల కాంస్యంతో 15 అడుగుల ఎత్తుతో తయారు చేశానన్నారు. గౌతంరెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో సంగం బ్యారేజీ వద్ద వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, తయారు చేయాల్సిందిగా తనకు సూచించారని గుర్తు చేసుకున్నారు. కానీ వైఎస్సార్ విగ్రహంతో పాటు గౌతంరెడ్డి విగ్రహాన్ని కూడా తయారు చేయాల్సి వచ్చిందని రాజ్‌కుమార్ భావోద్వేగానికి లోనయ్యారు.

క్లుప్తంగా

కేబినెట్ ప్రతిపాదనలు ఒకేలా ఉండాలి

- నిర్దేశించిన రెండు నమూనాల్లో పీపీపీలు సిద్ధం చేయాలి
- 7వ తేదీ కేబినెట్ సమావేశానికి ముందే పంపాలి
- అన్ని శాఖలను ఆదేశించిన సీఎస్ డాక్టర్ సమీర్‌శర్మ



సాక్షి, అమరావతి: కేబినెట్ ప్రతిపాదనలకు సంబంధించి శాఖలు సమర్పించే పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు (పీపీపీలు) ఏకరూపతతో ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్‌శర్మ స్పష్టం చేశారు. ప్రస్తుతం వివిధ శాఖలు కేబినెట్ సమావేశానికి చివరి నిమిషంలో వివిధ నమూనాల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీన జరిగే కేబినెట్ సమావేశానికి మూడురోజుల ముందే ఆయా శాఖలు కేబినెట్ మెమోరాండంతో పాటు ప్రతిపాదనలకు సంబంధించి నిర్దేశించిన రెండు నమూనాల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను సమర్పించాలని ఆదేశించారు. ఒకటి సింగిల్ స్లైడ్‌లో, మరొకటి ఐదు స్లైడ్లకు మించకుండా ఉండాలని పేర్కొన్నారు. ఈ మేరకు అన్ని శాఖలకు సర్క్యులర్ మెమో జారీచేశారు. సింగిల్ స్లైడ్ పీపీపీలో కేబినెట్ అజెండా సంఖ్యతోపాటు శాఖ పేరు, అంశం, దానికి సంబంధించిన వివరాలు, ప్రయోజనం, ఆమోదం కోరుతూ ఉండాలని తెలిపారు. మరోదాన్లో శాఖ పేరు, అంశం, ఎందుకు సమస్య పరిష్కరించాలి, ప్రతిపాదనకు సంబంధించిన వివరాలు, ఎక్కడి నుంచి సమస్య వచ్చింది, ప్రతిపాదనలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎందుకు, ఆమోదం కోరుతూ ఉండాలని వివరించారు. ఇక నుంచి ప్రతి కేబినెట్ సమావేశానికి మూడురోజుల ముందే కేబినెట్ మెమోరాండంతోపాటు ప్రతి అంశానికి రెండేసి పీపీపీలను సాధారణ పరిపాలన శాఖ (కేబినెట్ విభాగం)కు సమర్పించాలని సర్క్యులర్‌లో స్పష్టం చేశారు.

విద్యుత్ అధికారులకు 'కెపాసిటీ బిల్డింగ్'

- మూడు రోజుల పాటు కార్యక్రమం
- ఇంధన శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: దేశ, విదేశాల్లో అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతిక టెక్నాలజీని వాడుకుని విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయాలని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు ఏపీ ట్రాన్స్ కో, ఏపీ డిస్కంలకు చెందిన సీనియర్ అధికారులకు విజయవాడలోని విద్యుత్ సౌధలో సోమవారం నుంచి 'సామర్థ్య పెంపు (కెపాసిటీ బిల్డింగ్)' కార్యక్రమాన్ని చేపట్టనుంది. మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ వెబినార్ల ద్వారా మూడు రోజుల పాటు ఇంధన శాఖ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. విద్యుత్ రంగంలో ఇటీవల వచ్చిన విధానపరమైన మార్పులు, నియంత్రణ విధి విధానాలు, విద్యుత్ కొనుగోళ్లు, మార్కెట్ల ప్రభావం, ఆర్థిక నిర్వహణ, సరఫరా, పంపిణీ నష్టాలను తగ్గించేందుకు ఆటోమేషన్ కార్యకలాపాలు, విద్యుత్ వినియోగంపై ముందే అంచనా వేసే విధానాలు, స్మార్ట్ గ్రిడ్లు, ఎలక్ట్రిక్ రవాణా సహా పలు అంశాలతోపాటు.. దేశ విద్యుత్ రంగ ప్రస్తుత పరిస్థితులపై అధికారులకు వర్చువల్ విధానంలో అవగాహన కల్పిస్తామని ఇంధన శాఖ వెల్లడించింది. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధికారులు, సిబ్బందిని తయారు చేసేందుకు ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్(టెరి) ద్వారా ఈ శిక్షణ చేపట్టినట్టు వివరించింది.

గుండ్లకమ్మ మూడో గేటుకు స్టాప్‌లాక్‌ల ఏర్పాటు



మూడో గేటుకు ఏర్పాటు చేసిన స్టాప్‌లాక్‌లు

మద్దిపాడు: ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలోని గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో మూడో గేటుకు స్టాప్‌లాక్‌లు ఏర్పాటు చేశారు. ఇటీవల వరద ఉధృతికి గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో మూడో గేటుకు సంబంధించిన గడ్డర్లు కొట్టుకుపోయాయి. దీంతో అధికారులు ఆదివారం సాయంత్రానికి మూడో గేటుకు స్టాప్‌లాక్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డ్యాం ఈఈ మురళీమోహన్ మాట్లాడుతూ రిజర్వాయర్‌లో ప్రస్తుతం సుమారు ఒక టీఎంసీ నీరు ఉందని తెలిపారు. తాగునీటికి ఇబ్బంది లేదని చెప్పారు. రాబోయే పంట కాలానికి నీరు అందించడానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపామని, నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు కూడా విషయం తెలియజేశామని చెప్పారు. మంత్రి చెప్పిన విధంగా ఎస్‌ఎస్పీ వారితో మాట్లాడుతున్నామని, త్వరలోనే పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేస్తామని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా గేటుకు మరమ్మతులు చేస్తామని పేర్కొన్నారు.

చెత్తకూ పవరుంది!

మున్సిపల్ ఘన వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి

రాష్ట్రంలో సగటున ఓ ఇంటికి రోజుకు 10 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తారు. నెలకు 300 యూనిట్లు. ఓ ఇంటి నుంచి రోజుకు సగటున వచ్చే చెత్త 2.5 కిలోలని మున్సిపల్ శాఖ లెక్క గట్టింది. నెలకు ఒక్కో ఇంటి నుంచి సుమారు 75 కేజీలు. పల్నాడు జిల్లా కొండవీడు వద్ద, విశాఖపట్నం సమీపంలోని కాపులుప్పాడ వద్ద ఉన్న 'జిందాల్ ఎకోపోలిస్ ఎనర్జీ ప్లాంట్లు' గంటకు 30 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. అంటే దాదాపు 72 వేల ఇళ్లకు ఒక రోజుకు సరిపోయేటంత. విద్యుత్, చెత్త వేర్వేరు. మనం నిత్యం బయట పడేసే చెత్త ద్వారానే విద్యుత్ తయారై తిరిగి మన ఇంటికి వెలుగునిస్తుంది. ఇలా.. వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తిపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్టు.

- విశాఖపట్నం, గుంటూరు వద్ద జిందాల్ ఎకోపోలిస్ పవర్ ప్లాంట్స్
- రోజుకు 2,400 టన్నుల వ్యర్థాల ప్రాసెస్
- దేశంలో ఉన్న ఐదు ప్లాంట్లలో రెండు మన రాష్ట్రంలోనే...
- రెండుచోట్లా గంటకు 30 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- ఆధునిక టెక్నాలజీతో కాలుష్యరహితంగా నిర్వహణ



గుంటూరు సమీపంలో జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్

సాక్షి, అమరావతి: రోజురోజుకు పేరుకుపోతున్న చెత్త నగరాలు, పట్టణాలనే కాదు.. పచ్చని పల్లెలకూ సవాలు విసురుతోంది. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల (యూఎల్‌బీల) నుంచి రోజుకు 4,200 మెట్రిక్ టన్నుల చెత్త వస్తున్నట్టు తేలింది. ఈ చెత్త సమస్య పరిష్కారానికి ఉన్న వాటిలో ఉత్తమ మార్గం.. దాన్ని మండించి విద్యుత్ ఉత్పత్తి చేయడమే. ఈ ప్రక్రియ మన దేశంలో 1987లో ఢిల్లీలో మొదలైంది. అక్కడే మొదటి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఇలా మున్సిపల్ వ్యర్థాలతో నడిచే విద్యుత్ ప్లాంట్లు ఢిల్లీ, జబల్‌పూర్, హైదరాబాద్‌లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. మన రాష్ట్రంలో రెండు ఉన్నాయి. గుంటూరు, విశాఖపట్నం నగరాలకు సమీపంలో ఒక్కోటి గంటకు 15 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు రెండింటిని రూ.640 కోట్లతో జిందాల్ సంస్థ నిర్మించింది.

చెత్తే ఇంధనంగా విద్యుత్ ఉత్పత్తి

పల్నాడు జిల్లా కొండవీడులో ఏర్పాటు చేసిన ఈ పవర్ ప్లాంట్‌కు విజయవాడ, గుంటూరు నగరాలతో పాటు సమీపంలోని మరో 9 మున్సిపాలిటీల నుంచి ఘన వ్యర్థాలను తరలిస్తున్నారు. విశాఖ సమీపంలోని కాపులుప్పాడ వద్ద ఏర్పాటు చేసిన ప్లాంటుకు గ్రేటర్ విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం పట్టణాల చెత్తను తరలిస్తున్నారు. ఇక్కడ గార్బేజ్ పిట్స్‌లో వారం రోజులు ఆరబెట్టి, వాటి నుంచి విడుదలయ్యే మీథేన్, ఇతర వాయువులను ఫ్యాన్ల ద్వారా బర్నింగ్ చాంబర్‌కు అనుసంధానించారు. గార్బేజ్ పిట్‌లో చెత్తను క్రేన్లతో బర్నింగ్ చాంబర్‌లో వేసి ఈ గ్యాస్‌తో మండించి 1,000 డిగ్రీల వేడిని ఉత్పత్తి చేస్తున్నారు. దీనితో నీటిని ఆవిరిగా మార్చి టర్బయిన్లు తిప్పి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ప్లాంట్స్ ఒక్కోదానిలో రోజుకు 1,200 టన్నుల చెత్తను మండిస్తారు. 15 మెగావాట్ల చొప్పున 30 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ప్లాంట్ అవసరాలకు పోను 13.5 మెగావాట్ల చొప్పున 27 మెగావాట్లను గుంటూరు జిల్లా వెంగళాయపాలెం సబ్ స్టేషన్‌కు, విశాఖలోని విద్యుత్‌ను ఆనందపురం సబ్‌స్టేషన్‌కు సరఫరా చేస్తున్నారు. పట్టణ ఘన వ్యర్థాల్లో ఈ రెండు ప్లాంట్లకు చేరుతున్నది 1,800 నుంచి 1,900 టన్నులు. మిగిలిన చెత్తను సాధ్యమైనంత మేర తరలిస్తే మరింత విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని నిర్వాహకులు చెబుతున్నారు.

సమర్థంగా ఉప వ్యర్థాల వినియోగం

కుళ్లిన చెత్త నుంచి ప్రధానంగా బయో గ్యాస్, లీచెట్ విడుదలవుతాయి. వీటిని జిందాల్ ప్లాంట్లలో సమర్థంగా శుద్ధి చేసి వినియోగిస్తున్నారు. రోజు 1,200 టన్నుల వ్యర్థాల నుంచి 100 కిలో లీటర్ల (1కిలో లీటర్=1000 లీటర్లు) లీచెట్ వస్తోంది. లీటర్ లీచెట్‌లో 70 వేల నుంచి లక్ష మిల్లీగ్రాముల కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (సీఓడీ)తో పాటు ఇతర ప్రమాదకర రసాయనాలుంటాయి. దీన్ని భూమిలోకి ఇంకకుండా పిట్ అడుగునున్న చాంబర్ల ద్వారా సేకరించి శుద్ధి చేయగా 60 కిలో లీటర్ల శుద్ధి జలాలు, 35 కిలో లీటర్ల రిజెక్ట్ వాటర్‌తో పాటు 5 కిలో లీటర్ల స్లెడ్జ్ ఉత్పత్తి అవుతోంది. శుద్ధి జలాలను మొక్కలకు, రిజెక్ట్ వాటర్‌ను బూడిదను చల్లబరిచేందుకు, స్లెడ్జ్‌ను ఎండబెట్టి తిరిగి చెత్త మండించేందుకు వినియోగిస్తున్నారు, అంటే ఘన వ్యర్థాల నుంచి వచ్చే ఉప వ్యర్థాలను సైతం నూరు శాతం తిరిగి వినియోగిస్తున్నారు. ప్లాంట్లలో జరిగే కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు కాలుష్య నియంత్రణ మండలితో అనుసంధానించారు.

కాలుష్య రహితంగా ప్లాంట్ నిర్వహణ

దేశంలో ఉన్న ఐదు ప్లాంట్లలో అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన రెండూ మన రాష్ట్రంలోనే ఉన్నాయి. జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలో రోజుకు వందల టన్నుల చెత్తను మండించినా కాలుష్యం ప్లాంట్ దాటి వెళ్లే పరిస్థితి లేదు. థర్మల్ విద్యుత్ ప్లాంట్ విడుదల చేసే కాలుష్యంలో 10 శాతానికంటే తక్కువ కారకాలు విడుదలవుతుండగా, వాటిని గాల్లోకి చేరకుండా ఆధునిక టెక్నాలజీతో అడ్డుకుంటున్నారు. బాయిలర్ అడుగున పడే బూడిదను, బ్లోయర్ల ద్వారా వచ్చే ఫ్లైయాష్‌ను, లీచెట్ శుద్ధి చేయగా వచ్చిన నీటితో చల్లబరిచి రోడ్లపై గుంతలు పూడ్చడానికి వినియోగిస్తున్నారు. మరోపక్క ఫ్లై యాష్‌తో ఇటుకల తయారీపై కూడా ప్రయోగాలు చేస్తున్నారు.



జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లో చెత్తను డంపింగ్ చేస్తున్న లారీ

మరో ఏడు ప్లాంట్లకు అవకాశం



ఏపీ మున్సిపాలిటీల్లో రోజు సుమారు 4,200 మెట్రిక్ టన్నుల చెత్త వస్తోంది. ఇది ఏటా 5 శాతం పెరుగుతుందని సర్వే చెబుతోంది. మా ప్లాంట్లు రెండింటిలోనూ గంటకు 20 మెగావాట్లు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. అనుకున్న స్థాయిలో చెత్తను అందిస్తే ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేయగలం. మా ప్రగతిలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కృషి ఎంతో ఉంది. రాష్ట్రంలో మరో ఏడు ప్రాంతాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటుకు అవకాశం ఉంది.

– ఎం.వి.చారి, జిందాల్ ఏపీ ఆపరేషన్స్ ప్రెసిడెంట్

సమర్థంగా వ్యర్థాల నిర్వహణ



మున్సిపల్ ఘన వ్యర్థాలతో విద్యుత్ తయారీ ప్లాంట్లు దేశంలో ఐదు ఉండగా, వాటిలో రెండు మన రాష్ట్రంలోనే ఉన్నాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ వాహనాలతో ఎప్పటికప్పుడు యూఎల్బీల నుంచి ప్లాంట్లకు చెత్త తరలిస్తున్నాం. దీనివల్ల వ్యర్థాల నిర్వహణ సమర్థంగా జరుగుతుంది.

– డాక్టర్ సంపత్‌కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ

పొరుగు రాష్ట్రాల్లోని కార్గోపై మారిటైమ్ బోర్డు దృష్టి

- త్వరలో హైదరాబాద్‌లో ఎగుమతిదారులతో సమావేశం
- కాకినాడ యాంకరేజ్ పోర్టు టర్న్ ఎరౌండ్ సమయం సగానికి తగ్గింపు లక్ష్యం
- ఇందుకోసం రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు
- ఏపీ మారిటైమ్ బోర్డు డిప్యూటీ సీఈవో రవీంద్రనాథ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించిన రాష్ట్ర ప్రభుత్వం దానికి అనుగుణంగా వ్యాపార విస్తరణను చేపట్టింది. ఇందుకోసం పొరుగు రాష్ట్రాల ఎగుమతులను ఆకర్షించే విధంగా ఏపీ మారిటైమ్ బోర్డు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ నుంచి కార్గో రవాణాను ఆకర్షించే విధంగా రోడ్‌షోలను నిర్వహించనున్నట్లు ఏపీ మారిటైమ్ బోర్డు డిప్యూటీ సీఈవో రవీంద్రనాథ్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. రాష్ట్రంలోని పోర్టుల్లో ఉన్న అవకాశాలు, ఇక్కడ నుంచి ఎగుమతి చేస్తే కలిగే ప్రయోజనాలను ఈ రోడ్‌షోల్లో వివరించనున్నట్లు చెప్పారు. త్వరలో తెలంగాణలోని ఎగుమతిదారులతో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎక్కువగా ముంబై పోర్టు మీద ఆధారపడుతున్న తెలంగాణ ఎగుమతిదారులు పక్కనే ఉన్న కాకినాడ, గంగవరం పోర్టులను వినియోగించుకోవడం ద్వారా ఎంత వ్యయం తగ్గుతుందన్న విషయాన్ని ఈ సమావేశంలో వివరించనున్నామని చెప్పారు. త్వరలోనే ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలతో సమావేశమై ఎగుమతులకు రాష్ట్ర పోర్టులను ఉపయోగించుకునే విధంగా ఒప్పందం చేసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

మౌలికవసతుల కల్పన

ఎగుమతిదారులకు అవసరమైన ఓడలను అందుబాటులో ఉంచడంతోపాటు సరుకు నిల్వచేసుకోవడం కోసం గోడౌన్ల నిర్మాణం వంటి మౌలిక వసతులపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. బియ్యం ఎగుమతులకు అనుకూలంగా ఉండే కాకినాడ యాంకరేజ్ పోర్టులో ఒక ఓడ సరుకు నింపుకొని వెళ్లడానికి కనీసం 28 నుంచి 30 రోజులు (టర్న్ ఎరౌండ్ టైమ్) పడుతోందని, దీన్ని కనీసం 15 రోజులకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇందుకోసం సాగరమాల పథకం కింద రూ.100 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచామని, త్వరలోనే వీటి పనులు మొదలవుతాయని తెలిపారు. టర్న్ ఎరౌండ్ సమయం సగానికి తగ్గించగలిగితే కాకినాడ యాంకరేజ్ పోర్టు ఎగుమతి సామర్థ్యం రెట్టింపవుతుందన్నారు. 2021–22లో కాకినాడ యాంకరేజ్ పోర్టు 2.91 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడం ద్వారా రూ.60.10 కోట్లు ఆర్జించినట్లు తెలిపారు. సరుకు రవాణా రెట్టింపు అయితే ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు మాత్రమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ వాటా ఉన్న గంగవరం, కాకినాడ డీప్‌వాటర్ పోర్టు, కృష్ణపట్నం పోర్టుల ద్వారా ఎగుమతి అవకాశాలను కూడా ప్రచారం చేయనున్నట్లు చెప్పారు.

నాణ్యమైన విద్యుత్‌తోనే పెట్టుబడులు

- విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి పెద్దిరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులు పెరుగుతున్న నేపథ్యంలో పరిశ్రమలను ప్రోత్సహించడంతో పాటు, మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు పారిశ్రామిక రంగానికి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయడంపై దృష్టి సారించాలని ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. విద్యుత్ శాఖ అధికారులతో ఆదివారం వర్చువల్‌గా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రానికి గడిచిన రెండున్నరేళ్లలో కొత్తగా రూ.24,956 కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. జనవరి 2020 నుంచి జూన్ 2022 మధ్య పెట్టుబడులు పెట్టేందుకు 129 మెగా యూనిట్లు ఒప్పందాలు చేసుకున్నాయని వివరించారు. విద్యుత్ రంగం బలోపేతానికి సీఎం వైఎస్ జగన్ తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందుతోందని, రాష్ట్రం పారిశ్రామిక హబ్‌గా మారుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ప్రస్తుతం ఆర్థిక కార్యకలాపాలు బాగా పెరుగుతున్నాయని, ఇదే సమయంలో విద్యుత్ వినియోగం కూడా గణనీయంగా పెరుగుతోందన్నారు. విశాఖ సర్కిల్లో ఐదేళ్లుగా విద్యుత్ వినియోగం పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. సత్వర ఆర్థికాభివృద్ధికి ఇదే నిదర్శనం అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు.

టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలి..

అత్యంత నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్‌ను అందిస్తేనే రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులొస్తాయని మంత్రి పెద్దిరెడ్డి చెప్పారు. ప్రపంచ శ్రేణి ప్రమాణాలతో విద్యుత్‌ను సరఫరా చేయాలంటే సరికొత్త అంతర్జాతీయ టెక్నాలజీలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఇందుకోసం ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్(టెరి) వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థల మద్దతుతో రాష్ట్ర విద్యుత్ సంస్థలు సరికొత్త టెక్నాలజీలను అమలు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర ఇంధన సంరక్షణ మిషన్ సీఈవో చంద్రశేఖరరెడ్డి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీ ట్రాన్స్ కో సీఎండీ బి.శ్రీధర్, డిస్కంల సీఎండీలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి 1.33 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్: శ్రీశైలం జలాశయానికి ఆదివారం సాయంత్రం సమయానికి జూరాల, సుంకేసుల నుంచి 1,33,841 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. జలాశయం నాలుగు రేడియల్ క్రస్ట్ గేట్లను పదడుగులు ఎత్తి 1,12,116 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయంలో 309.9534 టీఎంసీల నీరు ఉంది.

హలో.. డాక్టర్

▶ మొదటి పేజీ తరువాయి

వెళ్లాల్సిన అవసరం లేకుండా టెలీమెడిసిన్ ద్వారా వైద్య సేవలు పొందే అవకాశం ఇప్పటికే రాష్ట్రంలో ఉంది. టెలీ మెడిసిన్ సేవలను ప్రజలకు చేరువ చేయడంలో మన రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో గ్రామీణ ప్రజల ముంగిటికే వైద్య సేవలను అందించేలా 'ఫ్యామిలీ డాక్టర్' విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. సచివాలయం యూనిట్‌గా ప్రతి గ్రామాన్ని పీహెచ్‌సీ వైద్యులు నెలలో రెండుసార్లు సందర్శించేలా ప్రణాళిక రూపొందించారు. మరోవైపు వైద్యుడు గ్రామానికి రాని రోజుల్లో ప్రజలకు ఏవైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైతే వెంటనే డాక్టర్‌ను సంప్రదించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యుడికి మొబైల్ ఫోన్‌ను ప్రభుత్వం సమకూరుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 1,142 పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యులకు సుమారు రూ.3 కోట్లతో 2,300 ఫోన్లను అందజేస్తోంది. వైద్యుడు మారినా ఫోన్ నంబర్ మారకుండా శాశ్వతంగా కేటాయిస్తోంది.

విలేజ్ క్లినిక్స్‌లో వివరాలు..

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా పీహెచ్‌సీలో పనిచేసే ఇద్దరు వైద్యులకు ఆ పరిధిలోని సచివాలయాలను విభజిస్తున్నారు. ప్రతి వైఎస్సార్ విలేజ్ క్లినిక్/సచివాలయంలో ఆ గ్రామానికి కేటాయించిన వైద్యుడి పేరు, ఫోన్ నంబర్, ఇతర వివరాలను ప్రదర్శిస్తారు. గ్రామంలో ఎవరికి ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా ఫోన్ నంబర్ ద్వారా వైద్యుడిని సంప్రదించవచ్చు. తమ సమస్యను వివరించి సలహాలు, సూచనలు పొందవచ్చు. విలేజ్ క్లినిక్‌కు వెళ్లి వైద్యుడు సూచించిన మందులను తీసుకోవచ్చు. స్పెషలిస్ట్ డాక్టర్ల వైద్య సేవలు అవసరమైనవారు విలేజ్ క్లినిక్‌లో సంప్రదిస్తే టెలీ మెడిసిన్ ద్వారా ఆయా వైద్యులతో ఎంఎల్‌హెచ్‌పీ మాట్లాడిస్తారు.

ప్రత్యేక యాప్

ఫ్యామిలీ డాక్టర్ విధానం కోసం వైద్య శాఖ ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందిస్తోంది. సచివాలయాల వారీగా వలంటీర్ల క్లస్టర్ల ప్రాతిపదికన ప్రజల వివరాలను యాప్‌లో అందుబాటులోకి తెస్తున్నారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (జీవన శైలి జబ్బులు) సర్వేలో భాగంగా వైద్య శాఖ ప్రజలను స్క్రీనింగ్ చేస్తోంది. మధుమేహం, రక్తపోటు, ఇతర వ్యాధిగ్రస్తులను గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తోంది. ఆ వివరాలను ఫ్యామిలీ డాక్టర్ యాప్‌తో అనుసంధానిస్తున్నారు. యాప్‌లో వైద్యాధికారులు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో విధులు నిర్వహించే ఎంఎల్‌హెచ్‌పీలు, సచివాలయ ఏఎన్‌ఎంలు.. ప్రతి ఒక్కరికీ వేర్వేరుగా లాగిన్ ఉంటుంది. వైద్యులు గ్రామానికి వెళ్లినప్పుడు రోగి ఏ క్లస్టర్ పరిధిలో ఉంటారో చెబితే చాలు దాని ఆధారంగా ఎన్‌సీడీ సర్వేతో సహా సంబంధిత వ్యక్తి ఆరోగ్య వివరాలన్నీ యాప్‌లో ప్రత్యక్షమవుతాయి. ఆరోగ్య సమస్య ఆధారంగా వైద్యులు చికిత్స అందిస్తారు. ఆ వివరాలతో పాటు అవసరమైన మందులను కూడా యాప్‌లో నమోదు చేస్తారు. మందుల ప్రిస్క్రిప్షన్ ఎంఎల్‌హెచ్‌పీ లాగిన్‌కు వెళుతుంది. దాని ఆధారంగా రోగికి ఎంఎల్‌హెచ్‌పీ మందులను అందిస్తారు. ఎవరికైనా మెరుగైన వైద్యం అవసరమైతే వైద్యుడే నేరుగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి రిఫర్ చేసే ఆప్షన్‌ను కూడా యాప్‌లో కల్పిస్తున్నారు.

ఇబ్బందులు ఎదురవకుండా..

ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని గ్రామ సచివాలయాలను ఇద్దరు వైద్యులకు విభజిస్తారు. రోజు మార్చి రోజు పీహెచ్‌సీ వైద్యుడు తనకు కేటాయించిన సచివాలయాలను సందర్శించాలి. వైద్యుడు, 104 మొబైల్ మెడికల్ యూనిట్‌తో పాటు గ్రామాలకు వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి వైద్యసేవలు అందిస్తారు. సచివాలయంలోనే హాజరు నమోదు చేస్తారు.


ప్రజలకు వైద్య సేవలు చేరువే లక్ష్యం



గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రతి పీహెచ్‌సీ వైద్యుడికి మొబైల్ ఫోన్‌ను అందిస్తున్నాం. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు వెళ్లలేనివారు వైద్యుడికి ఫోన్ చేయవచ్చు. గ్రామాల్లో పాము కాట్లు, గర్భిణులకు పురిటి నొప్పులు తదితర సందర్భాల్లో 108 అంబులెన్స్ చేరుకునేలోపు పీహెచ్‌సీ వైద్యుడిని ఫోన్ ద్వారా సంప్రదిస్తే ప్రాథమిక చికిత్స చర్యలను సూచిస్తారు. తద్వారా బాధితుల విలువైన ప్రాణాలను కాపాడవచ్చు.

– విడదల రజిని, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి

మెరుగైన సేవల కోసమే..



ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మెరుగైన సేవలందించేలా ప్రత్యేక యాప్ రూపొందిస్తున్నాం. చికిత్స, పరీక్షలు, సూచించిన మందులు అన్ని వివరాలను వ్యక్తిగత డిజిటల్ హెల్త్ ఐడీల్లో నిక్షిప్తం చేస్తాం. బయోమెట్రిక్ ద్వారా సంబంధిత వ్యక్తి అంగీకారంతో అప్‌లోడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. త్వరలో ప్రయోగాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. జనవరిలో పూర్తిస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ అమలుకు ప్రణాళిక రూపొందించాం. వైద్యులకు సచివాలయాల్లో బయోమెట్రిక్ హాజరుకు వీలు కల్పించాం. ఏఎన్‌ఎంల హాజరు వేళల్లో మార్పుపై సచివాలయాల శాఖకు లేఖ రాశాం.

– జె. నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్

ప్రజలకు ఎంతో మేలు..



పీహెచ్‌సీ వైద్యులకు ప్రత్యేకంగా మొబైల్ ఫోన్ల పంపిణీ, శాశ్వత ఫోన్ నంబర్ కేటాయింపు ప్రజలకు ఎంతో ఉపయోగకరం. అత్యవసర సమయాల్లో పీహెచ్‌సీ వైద్యుడికి ఫోన్ చేసి ఏం చేయాలో తెలుసుకోవచ్చు. వైద్యులు బదిలీపై వేరే చోటకు వెళ్లినా ఫోన్ నంబర్లు మారవు.

– డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, గుండె, ఊపిరితిత్తుల శస్త్రచికిత్స నిపుణులు, జీజీహెచ్ కర్నూలు



జ్ఞానం అనేది మనకు శక్తిని ఇస్తుంది. కానీ ప్రేమ మనకు సంపూర్ణతను ప్రసాదిస్తుంది.
– సర్వేపల్లి రాధాకృష్ణన్

సాక్షి

సోమవారం, సెప్టెంబర్, 5

'గురు'తర బాధ్యత

గురువులను గౌరవించడం మన సంప్రదాయం. మన దేశంలోనే కాదు, పాశ్చాత్య దేశాల్లోనూ గురువులకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉంది. ప్రాచీన నాగరికతలు పరిఢవిల్లిన కాలంలో మొదలైన గురుకుల సంప్రదాయం, ఒకటి రెండు శతాబ్దాల కిందటి వరకు మన దేశంలో కొనసాగింది. ఆధునిక తెలుగు సాహితీవేత్తలలో సుప్రసిద్ధులైన తిరుపతి వేంకట కవులు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు గురుకుల సంప్రదాయంలో చదువుకున్నవారే! అప్పటికి ఆధునిక పాఠశాలలు పుట్టుకొచ్చినా, బ్రిటిష్ హయాంలోనూ పలుచోట్ల గురుకులాలు కొనసాగేవి. ఆధునిక ప్రపంచంలో పరిస్థితులు మారాయి. గురుకులాలు కనుమరుగైపోయి, ఆధునిక విద్యాసంస్థలు ఏర్పడ్డాయి. పల్లెల్లోని వీధి బడులు మొదలుకొని, పట్టణాలు, నగరాల్లోని కళాశాలలు, విశ్వవిద్యాలయాల వరకు ఆధునిక పద్ధతుల్లోనే విద్యార్థులకు చదువులు చెబుతున్నాయి. గురుకులాల్లో గురుశిష్యుల అనుబంధం బలంగా ఉండేది. ప్రైవేటు విద్యాసంస్థల ధాటి మొదలవనంత కాలం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మధ్య అనుబంధాలు బాగానే ఉండేవి. ప్రైవేటు విద్యాసంస్థల పుణ్యాన చదువులు అంగడి సరుకుల స్థాయికి చేరుకోవడంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నడుమ వినియోగదారుకు, విక్రేతకు నడుమ ఉండే సంబంధానికి మించిన అనుబంధం ఏర్పడే అవకాశాలు దాదాపు మృగ్యంగా మారాయి.

'నేర్చుకునే శక్తి లోపించిన వాళ్లంతా బోధనలోకి వచ్చేస్తుంటారు' అన్నాడు ఆస్కార్ వైల్డ్. మిడిమిడి జ్ఞానులైన కొందరు ఉపాధ్యాయుల గురించి ఆయన విసిరిన వ్యంగ్యాస్త్రం ఇది. ఇలాంటి బాపతు ఉపాధ్యాయులు ఇప్పటికీ వర్ధిల్లుతూనే ఉన్నారు. గురజాడ వారి 'కన్యాశుల్కం'లోని గిరీశం ఇందుకు ఒక ఉదాహరణ. గిరీశం లాంటి గురువుల శిక్షణలో విద్యార్థులు వెంకటేశం అంతటి మేధావులుగానే తయారవుతారు. ఎనిమిదో తరగతి దాటినా, మాతృభాషలో చిన్న చిన్న వాక్యాలను కూడా ధారాళంగా చదవలేని విద్యార్థులు పాతిక శాతం, కూడికలు తీసివేతల వంటి సామాన్యమైన లెక్కలు కూడా చేయలేని వాళ్లు దాదాపు అరవై శాతం మంది మన దేశంలో ఉన్నట్లు జాతీయ స్థాయి గణాంకాలు చెబుతున్నాయి. ఇదంతా ఎలాంటి గురువుల చలవో ఆలోచించుకోవాలి. విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చాక కూడా ఇలాంటి పరిస్థితులు ఉన్నాయంటే, 'ఏం గురువులో ఏం చదువులో' అనే నిస్పృహ రాదూ! గురువులకు మన సమాజంలో ఒకప్పుడు అత్యున్నత స్థానం ఉండేదనడానికి పురాణాల్లో ఉదాహరణలు కోకొల్లలుగా కనిపిస్తాయి. అలాగని పురాణాల్లో కనిపించే గురువులంతా సచ్ఛీలురని కాదు. అర్జునుడిపై పక్షపాతంతో ఏకలవ్యుడి బొటనవేలిని గురుదక్షిణగా కోరిన ద్రోణాచార్యుల వంటి పక్షపాతబుద్ధులు గురువుల్లో నేటికీ ఉన్నారు. దండోపాయ ధురంధరులైన చండామార్కుల వంటి గురువులకూ నేడు లోటు లేదు. బోధనారంగానికే ఇలాంటి వారు తీరని కళంకాలు. రాజస్థాన్‌లో ఒక ఉపాధ్యాయుడు నీటికుండను తాకిన పాపానికి తొమ్మిదేళ్ల దళిత బాలుడిని చావగొట్టి పొట్టన పెట్టుకున్నాడు. స్వాతంత్ర్య అమృతోత్సవాలకు ముందురోజే వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన ఎందరినో కలచివేసింది. ఇలాంటి క్రూర ప్రవృత్తిగల వాళ్లను బోధనా రంగం నుంచి దూరంగా ఉంచేందుకు ప్రభుత్వాలే తగిన చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయుల ఎంపికలో అభ్యర్థుల విద్యార్హతలతో పాటు వారి మానసిక స్థితిగతులనూ పరిగణనలోకి తీసుకోవాలి.

నానా స్వభావాలు గల మనుషులు ఉండే సమాజంలో ఉన్న గురువులు కూడా మనుషులే! మామూలు మనుషుల స్వభావాలకు భిన్నంగా గురువులు ఉంటారని ఆశిస్తే, అది అత్యాశే అవుతుంది. అయితే, గురువుల్లో నైతికత, విద్యాప్రావీణ్యం, బోధనానైపుణ్యం, నిష్పాక్షికత వంటి లక్షణాలను సమాజం ఆశిస్తుంది. ఇదివరకటి గురువుల్లో ఈ లక్షణాలు పుష్కలంగానే ఉండేవి. ఇప్పటి కాలంలో బొత్తిగా అరుదైపోయాయి. 'బోధన అంతరించిపోయిన కళ కాదు, దాని పట్ల గౌరవమే అంతరించిపోయిన సంప్రదాయం'– అమెరికాలో స్థిరపడిన ఫ్రెంచి చరిత్రకారుడు జాక్వెస్ బార్జున్ అభిప్రాయం ఇది. ఝార్ఖండ్‌లో కొందరు విద్యార్థులు తమకు మార్కులు తక్కువ వేసి ఫెయిల్ చేశారంటూ ఉపాధ్యాయులను చెట్టుకు కట్టేసి చితక్కొట్టిన సంఘటన కలకలం రేపింది. ఇలాంటి సంఘటనలను గమనిస్తే, బార్జున్ మాటలు నిజమే కదా అనుకోకుండా ఉండలేం.

పరిస్థితులు ఎంత మారినా, నిబద్ధతతో చదువులు చెప్పే ఉపాధ్యాయులు ఇప్పటికీ లేకపోలేదు. అరుదుగా ఉండే అలాంటి ఉపాధ్యాయులతోనే విద్యార్థులు అనుబంధాన్ని పెంచుకుంటారు. ఈ ఉపాధ్యాయ దినోత్సవానికి రెండు రోజుల ముందు ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్ ప్రభుత్వ పాఠశాలలో లెక్కల మాస్టారుగా పనిచేస్తున్న రాజేశ్ థప్లియాల్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. తన బోధనతో విద్యార్థులను అంతగా ఆకట్టుకున్నాడాయన. విద్యార్థులంతా ఆయనను కన్నీళ్లతో వీడ్కోలు పలికిన దృశ్యాలు వార్తలకెక్కాయి. నూటికో కోటికో ఒక్కరుగా ఉండే ఇలాంటి ఉపాధ్యాయులే, బోధనా రంగంపై ఆశలు అడుగంటిపోకుండా కాపాడుతుంటారు. 'ఉపాధ్యాయుడు తాను బోధించే అంశాన్ని విద్యార్థులకు సులభగ్రాహ్యం చేయాలే తప్ప కేవలం సమాచారాన్ని అందివ్వడానికే పరిమితం కారాదు' అని అభిప్రాయపడ్డాడు సోవియట్ మానసిక శాస్త్రవేత్త లెవ్ ఎస్. వైగోత్‌స్కీ. సులభగ్రాహ్యంగా బోధించే ఉపాధ్యాయులను విద్యార్థులు ఎన్నటికీ మరచిపోలేరు. భావితరాలకు బలమైన పునాదులు వేసేది అలాంటి ఉపాధ్యాయులే! వాళ్లను కాపాడుకోవలసిన బాధ్యత సమాజానిదే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.దశమి రా.3.09 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** మూల సా.6.26 వరకు, తదుపరి పూర్వాషాఢ **వర్జ్యం:** సా.4.56 నుండి 6.26 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.25 నుండి 1.55 వరకు, తదుపరి ప.12.22 నుండి 1.11 వరకు **అమృతఘడియలు:** ప.12.25 నుండి 1.55 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం: 6.09
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

గొంతు చించుకొని అడగాల్సిందే!

బిల్కిస్ బానో సామూహిక అత్యాచార ఘటనలో దోషులైన పదకొండు మందికి గుజరాత్ ప్రభుత్వం క్షమాభిక్ష పెట్టడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. యావజ్జీవ శిక్ష పడిన నేరస్థులకు కొన్నిసార్లు క్షమాభిక్ష పెడుతూనే ఉన్నప్పటికీ, ఈ కేసులో ప్రత్యేకించి అనుసరించిన ప్రక్రియ మీద ఎన్నో సందేహాలు తలెత్తాయి. పైగా క్షమాభిక్షను అత్యాచార నిందితులకు వర్తింపజేయకూడదన్న కేంద్ర ప్రభుత్వ కొత్త నిబంధనలకు ఇది వ్యతిరేకం. అందుకే దీన్ని సుప్రీంకోర్టు రద్దు చేస్తుందని చాలామంది విశ్వసిస్తున్నప్పటికీ, అనుమానాలు ఉండనే ఉన్నాయి. అలా జరగకపోతే, బిల్కిస్‌కు ఇవ్వగలిగే జవాబు ఏమిటి? ఆమె న్యాయపోరాటానికి అర్థం ఏమిటి? ఇది దేశంలోని ప్రతి మహిళకూ సంబంధించిన అంశం కాదా? ఈ ప్రశ్నలకు సమాధానం మనం ఎంత పెద్దగా మన స్వరాలను పెంచుతాం అనేదానిపైనే ఆధారపడి ఉంటుంది.

ఇది దేశానికే అగ్ని పరీక్ష

కామెంట్



కరణ్ థాపర్

గుజరాత్‌లో బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం చేసి, ఆమె కుటుంబంలోని ఏడుగురు సభ్యులను హత్య చేసిన 11 మందికి పెట్టిన క్షమాభిక్షను బహుశా సుప్రీంకోర్టు రద్దు చేస్తుందని చాలామంది విశ్వసిస్తున్నారు. ఈ నేపథ్యంలో నేను కొన్ని ప్రశ్నలను లేవనెత్తాలనీ, ఈ అంశంపై కొంత సందేహం కలిగించాలనీ నిర్ణయించుకున్నాను. అయితే న్యాయస్థానంపై నాకు విశ్వాసం లేదని కాదు. కానీ నాణేనికి మరోవైపు కూడా చూడటం మంచిదనేది నా ఉద్దేశం. లేకుంటే మనం భ్రమల్లో కూరుకుపోతాం. చెప్పాలంటే, క్షమాభిక్ష ప్రక్రియ మొదలుపెట్టిందే సుప్రీంకోర్టు అని మర్చిపోవద్దు. కాబట్టి కొన్ని ప్రశ్నించదగిన నిర్ణయాల గురించే మనం మాట్లాడుతున్నాం. వాటిలో రెండు నిర్ణయాలు ఏమిటంటే, 1992 విధానం ప్రకారం క్షమాభిక్ష కేసును విచారించాలి; దీన్ని గుజరాత్ ప్రభుత్వం చేపట్టాలి. ఈ రెండోది మరింత ఆందోళనకరం. ఇది క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 432(7)(బి)ని ఉల్లంఘించడమే కాదు, అపరాధులకు ఎక్కడైతే శిక్ష పడిందో ఆ రాష్ట్రానికే దీన్ని కేటాయించడం. ఇక్కడ మరింత ఆందోళన కలిగించే అంశం ఇంకోటుంది.

బిల్కిస్ బానో కేసును సుప్రీంకోర్టు 2004లో సీబీఐకి బదలాయించింది. గుజరాత్‌లో పక్షపాత ధోరణులు చోటు చేసుకుంటాయనే ఆందోళనల నేపథ్యంలో ఈ కేసు విచారణను గుజరాత్ నుంచి మహారాష్ట్రకు తరలించింది. ఈ క్షమాభిక్షను చూసినప్పుడు ఆనాటి భయాలను పరిగణించకపోవడం అసాధారణం అనిపించడం లేదా? అయినప్పటికీ, నాకు మరో రెండు పట్టింపులున్నాయి. మొదటిది, ఈ క్షమాభిక్ష విషయంలో గుజరాత్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు సంబంధించింది. ఆనాడు ఈ కేసు విచారణను చేపట్టిన న్యాయమూర్తి అభిప్రాయాన్ని తీసుకోలేదు. అలాగే సీబీఐ దర్యాప్తు చేసిన అంశాల విషయంలో తప్పనిసరి అని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 435 స్పష్టంగా సూచిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కూడా ఆహ్వానించలేదు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రతించి ఉంటే, అది ఇటీవలే వెలువరించిన మార్గదర్శకాల ప్రకారం ఇలాంటి క్షమాభిక్షను తిరస్కరించాల్సి ఉండేదని నేను కచ్చితంగా చెప్పగలను. పైగా, క్షమాభిక్షను సిఫార్సు చేసిన కమిటీలో అయిదుగురు బీజేపీ నాయకులు కాగా, వారిలో ఇద్దరు సిట్టింగ్ బీజేపీ ఎమ్మెల్యేలు కావడం గమనించాలి.

ఈ అన్ని అంశాలనూ పరిశీలించాక, సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా పరిగణించాల్సి లేదా? అలాంటి అధికారం దానికి ఉంది కూడా! పైగా ఈ కేసులో బహుశా సుప్రీంకోర్టుకు ఒక నైతికపరమైన విధి కూడా ఉండవచ్చు. ఎందుకంటే క్షమాభిక్ష ప్రక్రియను మొదలుపెట్టిందే సుప్రీంకోర్టే మరి. ఆ ప్రక్రియ తప్పు ఫలితంతో ముగిసిపోతే, విషయాలను చక్కదిద్దడానికి న్యాయస్థానం ముందుకు రావలసిన అవసరం లేదా?

నా రెండో ఆందోళన ఏమిటంటే, న్యాయస్థానపు సూచనాత్మక వైఖరికి సంబంధించినది. ఈ కేసును విచారిస్తున్న జస్టిస్ అజయ్ రస్తోగీ ఆగస్టు 25న ఒక ప్రశ్న సంధించారు. "జరిగిన ఘటన భయంకరమైనది కాబట్టి, ఈ క్షమాభిక్ష తప్పు అంటే సరిపోతుందా?... యావజ్జీవ శిక్ష పడిన నేరస్థులకు నిత్యం క్షమాభిక్ష పెడుతూనే ఉన్నారు కదా, ఇక్కడ మినహాయింపు ఏముంది?" ఇవి కేవలం ప్రశ్నలు మాత్రమే. ఇది కేవలం వాక్చాతుర్యమే కావొచ్చు. కానీ ఈ ప్రశ్నలు ఇంతకు మించిన సందేశాన్ని ఇవ్వడం లేదని మీరు భావించగలరా? ఈ సందర్భంగా కోర్టు ఏం చేస్తుందనే రెండో ఊహకు తావివ్వాలనుకోవడం లేదు. కానీ, ఆ 11 మంది దోషులను కోర్టు తిరిగి జైలుకు పంపిస్తుందని మనం నిజంగా నమ్మవచ్చా? అలా కోర్టు చేయలేకపోతే ఏం జరుగుతుంది?

బిల్కిస్ ఉదంతం నేడు ఒక అగ్ని పరీక్షగా మారింది. ఇది స్పష్టంగా భారతీయ మహిళలకు మాత్రమే కాదు, బహుశా మరింత శక్తిమంతంగా సుప్రీంకోర్టుకు కూడా పరీక్షగా నిలుస్తున్నది. ఒక రకంగా చూస్తే, ఇది మన దేశం మొత్తానికి సంబంధించిన పరీక్ష కాదా? నా సమాధానం అవుననే! దీని ఫలితం మీదే భారత న్యాయ వ్యవస్థ పవిత్రత ఆధారపడి ఉంది.

నేరస్థులను సత్కరించడం ద్వారా భారత్‌లో అత్యాచారాన్ని సాధారణం చేశారా అని 'బీబీసీ' ప్రశ్నించింది. దీన్ని మీరు సక్రమమైన ప్రశ్నగా ఆమోదించకపోవచ్చు. కానీ అది లేవనెత్తారంటే, ప్రపంచం కళ్లు మన మీద ఉన్నాయని అర్థం.

సుప్రీంకోర్టు దీన్ని ఎలా పరిష్కరిస్తుంది, ఎలాంటి తుది నిర్ధారణ చేస్తుందనేదానిపై చాలా అంశాలు ఆధారపడి ఉన్నాయి. న్యాయమూర్తులు దీనిపట్ల అప్రమత్తంగా ఉన్నారని నాకు నమ్మకం ఉంది. కాబట్టే వారి నిర్ణయం కీలకమైనది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు



ఈ సమస్య మహిళలందరిదీ!

అభిప్రాయం



బర్ఖా దత్

అయిదు నెలల గర్భిణిగా ఉన్నప్పుడు మగాళ్ల గుంపు ఒకటి ఒకరి తర్వాత ఒకరు అత్యాచారం సాగిస్తున్నప్పటి ఘోరానుభవాన్ని ఊహించగలరా? పైగా మూడేళ్ల కూతురును కళ్లముందే చంపేశారు. అంతకుమించిన ఘోరమేమిటంటే, దీనికి పాల్పడినవాళ్లంతా తెలిసినవారే. పొరుగువారు, స్నేహితులని భావించినవారు. ఆ ఘోర కృత్యానికి పాల్పడిన ఆ 11 మంది గుజరాత్ ప్రభుత్వ కార్యనిర్వాహక ఆదేశం ద్వారా జైలు నుంచి విడుదలై బయటకొచ్చారు. అత్యంత కఠినమైనవైనప్పటికీ, కొన్ని కథలు మనం వ్యక్తిగతమైనవిగా భావించేలా చేస్తాయి. అలాంటివాటిల్లో బిల్కిస్ బానో గాథ ఒకటి.

ఇరవై ఏళ్ల క్రితం గోధ్రాలోని బాధితుల శిబిరంలో కిరోసిన్ లాంతరు ఛాయలో ఇతర మహిళలతోపాటు టార్పాలిన్ షీటు కింద ఉన్న ఆమెను నేను కలిశాను. కానీ ఇటీవల పతాక శీర్షికల్లో ఆమె పేరు కనిపించిన తర్వాత ఆమెతో నాటి సమావేశం నిన్ననే జరిగినట్లు అనిపించింది. ఆ రాత్రి తనకు ఏం జరిగిందన్నది గుర్తు చేసుకుంటున్నప్పుడు, ఆమె అస్సలు ఏడవని విషయం నాకు గుర్తుంది. ఒక శూన్యమైన, ముక్కలైపోయిన వ్యక్తీకరణతో ఆమె తన కళ్లలో ఆ వేదనను చూపించింది. ఆమెపై అత్యాచారం చేసి, పసిపాపను తన కళ్లముందే చంపిన వారు విడుదలై, జైలు బయట స్వీట్లు, పూలదండలతో సత్కారం పొందుతున్నప్పుడు ఆనాటి శూన్యం బిల్కిస్‌లో పూర్తిగా ఆవరించినట్లు కనిపించిందనీ, ఆమెకు మాటలు రాకుండా పోయాయనీ, ఎంతో ఒంటరితనాన్ని ఆమె అనుభవిస్తోందనీ బిల్కిస్ భర్త యాకూబ్ నాతో చెప్పారు. బిల్కిస్ బానోకు ఇంతకు మించిన గాయం తగిలే అవకాశం లేదని మీరు అనుకోవచ్చు.

ఈ ఖైదీల విడుదల కోసం సిఫార్సు చేసిన గుజరాత్ ప్యానెల్‌లోని సభ్యుల్లో ఒకరైన బీజేపీ ఎమ్మెల్యే సీకే రావుల్జీ ఓ దిగ్భ్రాంతికరమైన విషయం చెప్పారు. "వీళ్లు బ్రాహ్మణులు. బ్రాహ్మణులకు మంచి సంస్కారం ఉంటుంది. జైలులో వారి ప్రవర్తన చక్కగా ఉంది" అనేశారాయన. నా సహోద్యోగి చేసిన ఆ ఇంటర్వ్యూ వైరల్ అయింది. దాన్ని చూసిన బీజేపీ సానుభూతి పరులు, మద్దతుదారులు కూడా ఇబ్బంది పడ్డారు. 'సంస్కారవంతులైన రేపిస్టుల' గురించిన ఈ ఇంటర్వ్యూ ఒక విషయాన్ని స్పష్టం చేసింది. ఖైదీల సంస్కరణ పథకంలో భాగంగా 14 సంవత్సరాల తర్వాత వీరిని విడుదల చేస్తూ తీసుకున్న నిర్ణయంలో సంస్కరణాత్మకమైనది ఏదీ లేదని తేలిపోయింది. పైగా రావుల్జీ వారు చేసిన తప్పును కూడా ప్రశ్నించే సాహసం చేశారు. "వారు నేరం చేశారో లేదో నాకు తెలీదు" అన్నారు.

ఖైదీలను ముందస్తుగా విడుదల చేసే పథకాల నుంచి రేపిస్టులను మినహాయించాలని 2022 వేసవిలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకటించిన మార్గదర్శకాలు స్పష్టంగా చెప్పి ఉన్నాయి. దీనికి ముందున్న 1992 నాటి చట్టం ప్రకారం గుజరాత్ ప్రభుత్వం నిర్ణయించి ఉన్నట్లయితే, ఆ సందర్భంలో కూడా కేంద్ర ప్రభుత్వ ఆమోదం తప్పనిసరి అవుతుందని న్యాయనిపుణులు చెబుతున్నారు.

బిల్కిస్ బానో తరఫున వాదించిన న్యాయవాది శోభా గుప్తా సంవత్సరాల పాటు న్యాయం కోసం పోరాడారు. తన హృదయం బద్దలైపోయిందనీ, ఇప్పుడు బిల్కిస్ మొహం కేసి చూడలేకపోతున్నాననీ ఆమె నాతో చెప్పారు. గుజరాత్ ప్రభుత్వ నిర్ణయంపై బిల్కిస్ న్యాయస్థానంలో పిటిషన్ వేయగలుగుతుందా అని నేను అడిగాను. అప్పుడు శోభ చెప్పిన మాటలు నన్ను సిగ్గుపడేలా చేశాయి. "ఇంత జరిగాక ఇప్పుడు ఒక సామాన్యమైన మనిషి పోరాడాలంటే ఎంత సాహసం కావాలి? గుజరాత్ ప్రభుత్వ నిర్ణయంపై సీబీఐ అప్పీల్ చేయాలి. కేంద్ర ప్రభుత్వం అప్పీల్ చేయాలి. ప్రధానమంత్రి జోక్యం చేసుకోవాలి."

బిల్కిస్ ఉదంతం ఈ దేశంలోని ప్రతి మహిళకూ సంబంధించిన అంశమని మనకు తెలుసు. లైంగికంగా దాడికి గురైన మరొక మహిళ, ఈ 11 మంది రేపిస్టులు జైలు నుంచి బయటకు వచ్చాక శోభా గుప్తాకు ఫోన్ చేసి, తన కేసును కూడా ఉపసంహరించుకుంటే మంచిదా? అంటూ నిరుత్సాహంతో కూడిన స్వరంతో అడిగిందట. 2012 డిసెంబర్ 16న నిర్భయ ఘటన సందర్భంగా మనం చూసిన ఆ సాహసం ఇప్పుడు ఎక్కడుంది? ఈ మనుషులు తమ మిగిలిన జీవిత కాలం అంతా జైలులోనే గడపాల్సినవాళ్లు కాదా? న్యాయం కోసం పోరాడిన ఏ మహిళ జీవితమైనా ఇలా ముగిసిపోవలసిందేనా? ఈ ప్రశ్నకు సమాధానం మనం ఎంత పెద్దగా మన స్వరాలను పెంచుతాం అనేదానిపైనే ఆధారపడి ఉంటుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

గతం ప్రతిఫలించాలి



అన్ని ప్రభుత్వ భవనాల్లో కూడా మన ప్రాచీన నిర్మాణ వారసత్వం ప్రతిఫలించాలి. మనం దాని కోసం పాశ్చాత్యులు, చైనీయుల అద్దాల మేడలను అనుసరించాల్సిన పని లేదు. అవే ఆధునికతకు చిహ్నం కానక్కరలేదు. మన గతంలో నుంచి డిజైన్లను తెచ్చుకుంటూ కూడా అన్ని ఆధునిక సౌకర్యాలనూ కలిగి వుండొచ్చు.

– యూసుఫ్ ఉంర్ఖూవాలా, సంపాదకుడు

ఇప్పుడే ఇలా ఉందంటే...



నిజం చెప్పాలంటే భయంగానే ఉంది. పాకిస్తాన్‌లో మూడో వంతు నీళ్లలో ఉంది. చైనా అత్యంత కరవును ఎదుర్కొంటోంది. అలాగే స్పెయిన్‌లోని ఆలివ్ పండించే ప్రాంతాలు కూడా కరవు బారిన పడ్డాయి. ఇంకా మనం 1.2 డిగ్రీల సెంటీగ్రేడ్ భూతాపోన్నతి దగ్గరే ఉన్నాం.

– డోనా లూ, సైన్స్ రైటర్

ఇండియాతో వాణిజ్యం



ఇరు దేశాల సమస్యలు వాణిజ్యానికి అడ్డు రాకూడదు. వాణిజ్యం జరగకపోతే నష్టపొయ్యేది చిన్న ఆర్థిక వ్యవస్థలే (ఈ సందర్భంలో పాకిస్తాన్). చైనా, ఇండియాల మధ్య సమస్యలున్నాయి; అయినా వాటి మధ్య వాణిజ్యం 100 బిలియన్ డాలర్ల పరిమాణంలో ఉంది. తైవాన్, చైనాల మధ్య పెద్ద సమస్యలున్నాయి; అయినా వాటి మధ్య వాణిజ్యం విలువ 166 బిలియన్ డాలర్లు.

– హుసేన్ హక్కానీ, పాకిస్తాన్ మాజీ దౌత్యవేత్త

ట్రయలనే శిక్ష ఏపాటిది?

విశ్లేషణ



మంగారి రాజేందర్

అఖిల భారత జిల్లా న్యాయ సేవల అథారిటీస్ ప్రథమ సమావేశంలో భారత ప్రధాని మాట్లాడుతూ చాలామంది విచారణలో ఉన్న ఖైదీలు జైళ్లలో మగ్గిపోవడం గురించి ఆందోళన వెలిబుచ్చారు. వారి విడుదల కోసం న్యాయ సేవల అధికార సంస్థలు కృషి చేయాలని అన్నారు. న్యాయం వారికి సులభంగా అందుబాటులోకి రావాలనీ, అలా వస్తే వాళ్ల జీవించే హక్కు కుదుటపడుతుందనీ ప్రధాని అన్నారు.



తీవ్రమైన నేరాలు చేయని వ్యక్తులూ, ఇదివరకే 1/3 వంతు శిక్షా కాలాన్ని అనుభవించినవాళ్లూ జైలు నుంచి బయటకు రావడానికి వారిపైన ఉన్న కేసులను రద్దు చేయాలని సుప్రీంకోర్టు ఆగస్టు 5వ తేదీన ప్రభుత్వానికి సూచించింది. అంతకుముందు జూలై 11వ తేదీన సుప్రీంకోర్టు కొత్తగా బెయిల్ చట్టం తీసుకొని రావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. కాగ్నిజబుల్ నేరం చేయని ఎంతోమంది వ్యక్తులు జైళ్ళలో ఉన్నారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అరెస్టు చేయడం అనేది చాలా క్రూరమైన చట్టమనీ, వ్యక్తి స్వేచ్ఛ దానివల్ల పోతుందనీ, అందుకని అత్యవసరమైనప్పుడు మాత్రమే ఈ అరెస్టులను చేయాలనీ సుప్రీంకోర్టు తన తీర్పులో వ్యాఖ్యానించింది. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో 2020లో ప్రకటించిన వివరాల ప్రకారం 4,88,551 మంది జైళ్లలో బెయిల్ రాక ఉండి పోయారు. విచారణలో ఉన్న ఖైదీల సంఖ్య తగ్గించడం కోసం పోలీస్ కమి షన్, సుప్రీంకోర్టు అనేక సూచనలు చేసినప్పటికీ ఫలితం లేదు.

అరెస్టు చేసే అధికారం ఉందని అరెస్టు చేయడం తగదనీ, అరెస్టు చేయడానికి న్యాయబద్ధత ఉండాలనీ జోగిందర్ కుమార్ కేసు(1994)లో సుప్రీంకోర్టు చెప్పింది. అయినా పోలీసుల పని విధానంలో మార్పు రాలేదు. అరెస్టులను తగ్గించాలని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో 41వ నిబంధనకు మార్పులను (2009) తీసుకొని వచ్చారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఈ మార్పులు చేసిన నిబంధన పోలీసులకు విశేష అధికారాలను కల్పించింది. ఈ అధికార నియంత్రణ కోసం ఆర్నేష్ కుమార్ కేసులో కొన్ని మార్గదర్శకాలను కోర్టు ఏర్పరిచింది. కానీ ఆ మార్గదర్శకాలను అమలు చేసే మేజిస్ట్రేట్లు ఎంతమంది మన దేశంలో ఉన్నారు?

రాజద్రోహ నేరం పేరుతో దేశంలో ఎన్నో అరెస్టులు జరుగుతూనే ఉన్నాయి. హాని కలిగించని ట్వీట్లు చేసిన జర్నలిస్టు మహమ్మద్ జుబేర్‌ని ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మధ్యే ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. అవమానకరమైన ట్వీట్ చేశాడన్న ఆరోపణ మీద ఓ నటుడు నెల రోజులపాటు జైల్లో ఉన్నాడు. ఆయన ఎవరి గురించి అయితే ఆ ట్వీట్ చేశాడో ఆ నాయకుడు ఆ ట్వీట్‌ని పట్టించుకోలేదు. బర్షశ్రీ బురగొహెయిన్ అనే స్టూడెంట్ ఏదో కవిత రాసినందుకు రెండు నెలలు జైల్లో ఉండిపోయింది.

మన జైళ్లలో కూడా చాలా దుర్మార్గమైన పరిస్థితులు ఉన్నాయి. సుఖేష్ చంద్రశేఖర్ అనే విచారణలో ఉన్న ఖైదీకి సకల సౌకర్యాలు జైల్లో లభిస్తాయి. స్టాన్‌స్వామి అనే ఖైదీ ఒక రూపాయి విలువ చేసే 'స్ట్రా' కోసం విలవిల లాడాల్సి వచ్చింది. ఇట్లా ఎన్నో ఉదాహర ణలను చెప్పవచ్చు. 2018లో అరెస్టయిన ప్రముఖ కవికి సుప్రీంకోర్టు ఇటీవల మెడికల్ గ్రౌండ్స్ మీద బెయిల్ మంజూరు చేసింది. ఆయనకి 82 సంవత్సరాలు ఉన్నాయనీ, కస్టడీ విచారణ 2018లో జరిగిందనీ, ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలైనా కూడా విచారణ ఇంకా మొదలు కాలేదన్న కారణంగా బెయిల్ మంజూరు చేసినట్టుగా పత్రికల్లో వార్తలు వచ్చాయి. అరెస్టు విషయంలో ఆర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను, మేజిస్ట్రేట్స్ కఠినంగా అమలు చేస్తే ఈ అరెస్టులకు అడ్డుకట్ట ఏర్పడుతుంది. అదే విధంగా రిమాండ్ చేసేటప్పుడు గుడ్డిగా కాకుండా జాగ్రత్తగా రిమాండ్ చేస్తే కూడా ఈ నిర్బంధాలు తగ్గే అవకాశం ఉంటుంది.

ఇదే కాకుండా 'జైలు కాదు బెయిల్' అన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యానం స్లోగన్ మాదిరిగా మారడం శోచనీయం. నేర నిరూపణ జరిగేవరకు ముద్దాయిని అమాయకుడిగా పరిగణించాలన్న నియమం కాస్త అమాయకుడిగా నిరూపణ అయ్యేంతవరకూ నేరస్థుడు అన్న చందంగా మారడం ఓ విషాదం. రిమాండ్ విషయంలో, అదే విధంగా బెయిల్ మంజూరు చేసే విషయంలో కోర్టులు న్యాయబద్ధంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. సీరియస్ నేరాలను, మామూలు నేరాలను వేరువేరుగా చూసే దృష్టి అలవర్చుకోవాలి. ఈ గందరగోళ పరిస్థితి నుంచి బయటపడటానికి క్రిమినల్ జస్టిస్ సిస్టమ్‌లోని అన్ని వ్యవస్థలూ కృషి చేయాల్సిన అవసరం ఉంది. న్యాయమూర్తుల పాత్ర గురించి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పని చేసిన మదన్ బి. లోకూర్ మాటలను ఇక్కడ ఉదహరించాలి.

"అరెస్టు విషయంలో ట్రయల్ కోర్టు న్యాయమూర్తులు పోలీసుల రబ్బర్ స్టాంపు మాదిరిగా వ్యవహరించకూడదు. మీ మనస్సుతో చూడండి. ఓ నా ప్రియమైన న్యాయమూర్తులారా! స్వేచ్ఛ అనేది అత్యంత విలువైనది. అది ఎవరూ కోల్పోకూడదు. దేశ పౌరుల రాజ్యాంగ హక్కులవైపు మీరు నిలబడండి. నాకు తెలుసు. మిమ్మల్ని రాత్రికి రాత్రి బదిలీ చేస్తారన్న భయం కూడా ఉంటుంది. నిద్రలేని రాత్రులు మీకు ఏర్పడవచ్చు. మంచి రోజులు ఏదో ఒక రోజు వస్తాయి. అంతలోపు సంవత్సరాల తరబడి విచారణలో ఉన్న ఖైదీల వైపు చూడండి. అమాయకులు జైళ్లలో ఉండిపోకుండా చూడండి. ఇది సరైనదేనా? వాళ్ళ కుటుంబ సభ్యుల పరిస్థితి గురించి ఆలో చించండి. ఇది న్యాయమా? అన్యాయమా? ఆలోచించండి. ఇది కష్టమైన ప్రశ్న కాదు."

ప్రధానమంత్రి, భారత ప్రధాన న్యాయమూర్తి, కేంద్ర న్యాయ శాఖా మంత్రి, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అందరూ విచారణలో ఉన్న ఖైదీల గురించి ఆందోళనల వ్యక్తపరుస్తున్నారు. ఈ ఆందోళనలను తగ్గించే అవకాశం ఉన్న వ్యక్తులు ట్రయల్ కోర్టు న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు. ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించే బాధ్యత వారిమీద లేదా? 'విచారణలో ఉన్న ఖైదీనా, విచారణే అవసరం లేని ఖైదీనా' తెలియజెప్పమని విచారణలో ఉన్న ఖైదీలు కోరకుండా చూసుకోవాల్సిన బాధ్యత న్యాయమూర్తుల మీదే ఉంది.

వ్యాసకర్త మాజీ జిల్లా జడ్జి | 94404 83001

హిమాలయాలను కాపాడుకోవాలి

సందర్భం



మరింగంటి శ్రీరామ

మళ్లీ హిమాలయ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. వంతెనలు కొట్టుకుపోయాయి. ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగింది. హిమాలయాలలో తరచూ జరిగే నష్టాలే ఇవి. పర్యావరణం మీద మానవుల అశ్రద్ధ దీనికి కారణం కావచ్చు. నష్టాల నివారణకు తీసుకోవలసిన చర్యలను తెలుసుకోవడం ఈ సందర్భంగా చాలా ముఖ్యం.

హిమాలయాల నిర్మాణం మిలియన్ల ఏళ్లుగా కొనసాగుతోంది. అందుకే ప్రతి ఏడాదీ హిమాలయాలు, కొన్ని సెంటి మీటర్ల ఎత్తు పెరుగుతున్నాయి. ఈ పర్వతాల్లో జన్మించిన నదుల ద్వారా కొట్టుకు వచ్చిన రాళ్లు, ఒండ్రు వంటి వాటితో దిగువన ఉన్న తక్కువ లోతైన టెథిస్ సముద్రం నిండిపోయి ప్రపంచంలోనే అతిపెద్ద సారవంతమైన గంగా–సింధు మైదానం ఏర్పడింది. హిమాలయాలు దేశానికి పెట్టని గోడల్లాగా, ఉత్తర దిశలో నేలమార్గంలో వచ్చే శత్రువుల నుండి కాపాడుతున్నాయి. సైబీరియా నుండి వచ్చే అతి శీతల గాలుల నుండి భారత ద్వీపకల్పాన్ని కాపాడుతున్నాయి. సింధు, గంగ, బ్రహ్మపుత్ర జీవనదులకు జన్మనిచ్చి; 40 శాతం భారతీయుల తాగు నీరు, సాగునీరు, పరిశ్రమలకు కావలసిన నీటి అవసరాలు తీరుస్తున్నాయి. ఆపిల్ పండ్లనూ, న్యూస్ ప్రింట్, ఆయుర్వేద మూలికలనూ అందించే అడవులనూ దేశానికిస్తున్నాయి. ప్రపంచంలోనే అందమైన పర్యాటక ప్రదేశాలు కశ్మీర్, కులూ, మనాలి, సిమ్లా, ముస్సోరీ, డార్జిలింగ్‌లకు పుట్టినిల్లుగా ఉన్నాయి. ఋతుపవనాలకు సహాయం చేస్తున్నాయి. ఇటువంటి హిమాలయాలు లేకపోతే భారతదేశం లేదనటంలో అతిశయోక్తి లేదు.

అయితే హిమాలయాల్లో అభివృద్ధి పేరిట, పుణ్యస్థలాల పేరిట, పర్యాటకం పేరిట; రోడ్లు వెడల్పు చేయటం, రైల్వేవంతెనలు, జలవిద్యుత్ కేంద్రాలు, సొరంగాలు (టన్నెళ్లు) వంటి వాటిని నిర్మించడం కోసం భారీ బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. హిమాలయాల్లో ఉన్న రాయి దక్కన్ పీఠభూమిలో ఉన్న గ్రానైట్ రాయిలాగా గట్టిది కాదు. బలహీనమైన మట్టిదిబ్బలు. లూజు రాళ్ల రప్పలతో ఏర్పడిన ఈ ముడుత పర్వతాల చరియలు భారీ పేలుళ్ల కారణంగా విరిగిపడుతున్నాయి. మానవుడు సృష్టిస్తున్న శక్తిమంతమైన విస్ఫోటనాలు హిమాలయాల భౌతిక స్వరూపాన్నే మార్చేలా తయారయ్యాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఊహించని విపత్తులు ఎన్నయినా సంభవించే ఆస్కారం ఉంది. పర్యావరణ ప్రేమికులూ, భూ శాస్త్రవేత్తలూ; ఆ ప్రాంత రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం పై విషయాలను సానుకూలంగా ఆలోచించి నష్టనివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. తద్వారా హిమాలయాలనూ, అక్కడి పుణ్యక్షేత్రాలనూ, పర్యాటక ప్రదేశాలనూ... చివరగా దేశాన్నీ కాపాడుకుందాం.

వ్యాసకర్త రిటైర్డ్ చీఫ్ జీఎం, సింగరేణి కాలరీస్, కొత్తగూడెం

క్లుప్తంగా

స్వరూపానందేంద్రను కలిసిన మంత్రి కారుమూరి



రుషికేష్‌లో స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిని కలిసిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

సింహాచలం: రుషికేష్‌లో చాతుర్మాస దీక్షలో ఉన్న విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతిని ఆదివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కలిశారు. స్వామీజీల ఆశీస్సులు అందుకున్నారు. రుషికేష్‌లోని పవిత్ర గంగానదిలో పుణ్యస్నానమాచరించారు. శారదా స్వరూప రాజశ్యామల చంద్రమౌళీశ్వరుల పీఠార్చనను వీక్షించారు. పీఠాధిపతులు చేపట్టిన చాతుర్మాస దీక్షాఫలాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.

ప్రశాంతంగా పీజీ సెట్

- 86.93 శాతం హాజరు

వైవీయూ: ఆంధ్రప్రదేశ్ పోస్టుగ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2022లో భాగంగా ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాలతోపాటు హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పరీక్షలకు 86.93 శాతం మంది హాజరయ్యారు. మొత్తం 9,460 మంది పరీక్షలకు దరఖాస్తు చేయగా, మూడు సెషన్‌లుగా నిర్వహించిన ఈ పరీక్షలకు 8,224 మంది హాజరయ్యారు. సెషన్–1లో తెలుగు, సెషన్–2లో లైఫ్ సైన్సెస్, సెషన్–3లో కామర్స్ అండ్ పాలిమర్ సైన్స్ సబ్జెక్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 815 మంది దరఖాస్తు చేసుకోగా, 634 మంది (77.79%) హాజరయ్యారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 5,960 మందికిగాను, 5,355 మంది (89.85 శాతం), సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 2,685 మందికి గాను, 2,235 మంది (83.24 శాతం) హాజరయ్యారు. వైఎస్సార్ జిల్లాలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, కేఎస్‌ఆర్ఎం కళాశాల పరీక్షా కేంద్రాలను ఏపీ పీజీ సెట్–22 చైర్మన్, వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య మునగల సూర్యకళావతి, కన్వీనర్ ఆచార్య వై.నజీర్ అహ్మద్ పరిశీలించారు. వీరి వెంట వైవీయూ ఆచార్యులు ఎంవీ శంకర్, డాక్టర్ ఎస్‌వీ సుబ్బారెడ్డి ఉన్నారు.

నిమజ్జనంలో అపశ్రుతి

ఏలూరు జిల్లాలో చెరువులో మునిగి ఇద్దరి మృతి

కొయ్యలగూడెం: ఏలూరు జిల్లాలో వినాయక నిమజ్జనంలో ప్రమాదవశాత్తు ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంలోని పోతన చెరువులో వినాయక విగ్రహాన్ని ఆదివారం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న షేక్ రియాజ్ (25), ఉక్కుర్తి దొరబాబు (45), దొరబాబు కొడుకు కార్తీక్ ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయారు. వెంటనే మత్స్యకారుడు పి.రమణ స్పందించి కార్తీక్‌ను కాపాడాడు. పూర్తిగా నీట మునిగిన రియాజ్, దొరబాబులను బయటకు తీసుకొచ్చారు. కొన ఊపిరితో ఉన్న వారిని జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలిచ్చారు. అప్పటికే వారు మృతిచెందారని వైద్యులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రియాజ్ అవివాహితుడు కాగా, దొరబాబుకు భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

కులవాదుల వద్ద సూటుకేసులకు ఆశపడటం సిగ్గు చేటు

707వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: కులవాదుల వద్ద సూట్ కేసులు తీసుకున్న దళిత దళారులు అమరావతికి మద్దతిస్తున్నట్టు ప్రకటించుకోవడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 707వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు ఆదివారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అమరావతి టైటిల్‌తో డ్రామా కంపెనీ పెట్టి రోజుకో నాటకం, పూటకో వేషం వేస్తూ ఎల్లో మీడియాలో విష ప్రచారం చేస్తుండటం సిగ్గుచేటన్నారు.5 కోట్ల మంది ప్రజల అజెండానే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మూడు రాజధానుల ఏర్పాటుకు ముందుకెలుతున్నారని, ఆయనకు రాష్ట్ర ప్రజలందరి మద్దతు ఉందన్నారు. చంద్రబాబు తాత్కాలికం పేరుతో చేసిన దోపిడీ కారణంగానే ఈ ప్రాంతం వెనుకబాటుతనానికి గురైందనేది బహిరంగ సత్యమన్నారు. బాబు ఇకనైనా తన వైఖరి మార్చుకుని.. పేదల సంక్షేమానికి అడ్డుపడుతూ వేసిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని, లేకుంటే రానున్న ఎన్నికల్లో బాబుతో పాటు ఆయనకు సహకరిస్తున్న పార్టీలను చిత్తు చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పల్లె బాబు పలువురు దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఒకటో తారీఖు వచ్చిందంటే పింఛన్ అందాల్సిందే. అది పట్టణమైనా, కీకారణ్యమైనా వలంటీర్లు వెళ్తున్నారు. నల్లమల అడవులూ అందుకు మినహాయింపు కాదు. శ్రీశైలానికి దాదాపు 25 కి.మీ. దూరంలో దట్టమైన అడవుల్లో ఉండే చెంచుల గూడెం నెక్కంటి పెంటకు వెళ్లడం సాహస యాత్రే. అక్కడ ఇద్దరు చెంచులకు మాత్రం టంచన్‌గా పింఛన్ అందుతోంది. ప్రతి నెలా అక్కడకు 14 కి.మీ. దూరంలోని పాలుట్ల పెంట నుంచి వలంటీర్ బయన్న ట్రాక్టర్‌పై వచ్చి పింఛన్ డబ్బులిస్తున్నాడు. సుమారు పది కుటుంబాలు ఉండే నెక్కంటి పెంటకు సోలార్ ద్వారా కరెంట్, బోరు నీటిని ప్రభుత్వం సమకూరుస్తున్నట్లు గిరిజన మహిళ చెవుల బసవమ్మ తెలిపింది.




నల్లమల అటవీ ప్రాంతంలోని ఇష్టకామేశ్వరి గూడెం

ఫొటోలు: కందుల చక్రపాణి

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

అడవి తాకిన సంక్షేమం

- మనుగడ కోసం పోరాడుతున్న చెంచులకు చేయూత
- అభివృద్ధి ఫలాలను అందచేస్తూ ఉపాధికి ఊతం
- అంతరించే జాబితాలోని తెగపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- నల్లమల అటవీ ప్రాంతంలోని 171 గూడేలలో 27,857 చెంచు జనాభా



సున్నిపెంట నుంచి సాక్షి ప్రతినిధి ఐ.ఉమామహేశ్వరరావు

దేశవ్యాప్తంగా అంతరించి పోతున్న 75 గిరిజన తెగల్లో మన రాష్ట్రంలో నివసించే చెంచులు మూడో స్థానంలో ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. మనుగడ పోరాటం చేస్తున్న చెంచు గూడేల్లో వికసిస్తున్న అభివృద్ధి రేఖలు, వారి జీవనశైలిని పరిశీలించేందుకు సున్నిపెంట సమీపంలోని పలు ప్రాంతాలను రెండు రోజుల పాటు సందర్శించి దట్టమైన అడవుల్లో రాళ్ల రప్పలతో నిండిన బాటలో జీపు, కాలినడకన కిలోమీటర్ల మేర ప్రయాణించి 'సాక్షి' ప్రతినిధి అందిస్తున్న గ్రౌండ్ రిపోర్ట్ ఇది.

మూడు జిల్లాల పరిధిలో

దట్టమైన నల్లమల అడవుల్లో పర్వతాలతో కూడిన ప్రాంతాలే చెంచులకు ఆవాసాలు. నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో 171 చెంచు గూడేలున్నాయి. వీటిని చెంచు పెంటలుగా పిలుస్తుంటారు. కీకారణ్యంలో క్రూరమృగాలు, వన్యప్రాణులతో కలసి జీవించే వీరంతా బాహ్య ప్రపంచానికి రావాలంటే మొనదేలిన రాళ్లతో కూడుకున్న అటవీ మార్గంలో కిలోమీటర్ల తరబడి నడవాల్సిందే. వేట, అటవీ ఉత్పత్తుల సేకరణ వీరి జీవనోపాధి. విల్లంబులు, చిన్నపాటి కత్తి వీరి ఆయుధాలు. గతంలో ఎలుగుబంటి, జింకలను వేటాడేవారు. వన్యప్రాణి సంరక్షణ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేస్తుండటంతో వేట వదిలేసి ప్రభుత్వం కల్పించే ఉపాధి అవకాశాలపై ఆధారపడుతున్నారు.


భిన్న జీవన శైలి

చెంచుల ఆహారపు అలవాట్లు సైతం చాలా సరళమైనవి. జొన్నలు, సజ్జలతో చేసిన జావ తాగుతారు. ఉడకబెట్టినవి, కాల్చిన దుంపలు, గడ్డలు తింటారు. చింతపండును బూడిదలో కలిపి తింటారు. ఉపాధి కోసం ఉదయం బయటకు వెళ్లేప్పుడు అన్నం తింటే తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చాకే మళ్లీ ఆహారం తీసుకుంటారు. చెంచు గూడేల్లో పెద్ద ఇచ్చే తీర్పులకు కట్టుబడి ఉంటారు. వివాహ వేడుక పెద్దల అంగీకారంతో జరుగుతుంది. సంసారం పొసగకపోతే విడాకులు మామూలే. వితంతు వివాహాలు జరుగుతాయి. శివుడి ప్రతిరూపంగా లింగమయ్యను పూజిస్తుంటారు. డబ్బులు దాచుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వరు. ఆహారాన్ని నిల్వ చేసుకోరు. ఏ రోజుకారోజు అనే రీతిలో జీవిస్తారు. అప్పుడప్పుడు కూలి పనులు చేసినా తమ జీవన విధానమైన అటవీ ఉత్పత్తుల సేకరణకే మొగ్గు చూపుతుంటారు.

అడవి తల్లి.. అమ్మవారు

శ్రీశైలం కూడలి నుంచి 20 కిలోమీటర్ల దూరంలో అడవిలో కొలువైన ఇష్టకామేశ్వరి దేవి ఆలయం గురించి తెలిసిన వారు తక్కువే. అక్కడికి ప్రయాణం అంటే సాహసంతో కూడుకున్నదే. కార్లు వెళ్లలేని ఈ ప్రదేశానికి శ్రీశైలం నుంచి పరిమిత సంఖ్యలో కొన్ని జీపులు మాత్రమే అటవీ శాఖ అధికారుల అనుమతితో నడుస్తాయి. దట్టమైన అడవిలో బండరాళ్లు, మొనదేలిన రాళ్ల మధ్య దాదాపు 40 నిమిషాల పాటు కుదుపుల మధ్య సాగే ప్రయాణంతో ఇష్టకామేశ్వరి అమ్మవారి గుడికి చేరుకోవచ్చు. అడవి తల్లిని, అమ్మవారిని నమ్ముకుని దాదాపు 26 చెంచు కుటుంబాలు అక్కడ జీవిస్తున్నాయి.





చెంచు గూడెంకు వెళ్లే అటవీ మార్గం

అభివృద్ధి ఇలా..

మొత్తం 171 చెంచు గూడేలకు వాటర్ ట్యాంక్‌లు, బోర్లు, పైపులైన్ల ద్వారా ప్రభుత్వం మంచినీటి వసతి కల్పించింది. 166 గూడేలకు సోలార్‌తో విద్యుత్ సదుపాయాన్ని కల్పించారు. 164 గూడేలకు రోడ్డు మార్గం ఉంది. మొత్తం 6,912 కుటుంబాల్లో 3,561 కుటుంబాలకు ఇళ్లు ఉన్నాయి. జగనన్న కాలనీల్లో మరో 2,940 కుటుంబాలకు ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసింది. 2,364 ఇళ్లకు మరమ్మతులు చేపట్టేలా ప్రతిపాదనలు చేశారు. 14,071.29 ఎకరాల ఆర్వోఎఫ్ఆర్, అసైన్డ్ భూములను 5,186 కుటుంబాలకు ప్రభుత్వం పంపిణీ చేసింది. నవరత్నాల ద్వారా వైఎస్సార్ రైతు భరోసా 2,411 మందికి, వైఎస్సార్ చేయూత మొదటి విడతలో 599 మందికి, రెండో విడతలో 825 మందికి అందించారు. వైఎస్సార్ ఆసరా 1,005 మందికి, వైఎస్సార్ పెన్షన్ కానుక 2,186 మందికి ఇస్తున్నారు.

విద్య - వైద్యం

నిరుపేద చెంచు కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుకునేలా ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం 12 గురుకులాలు, 66 ప్రాథమిక పాఠశాలలను నిర్వహిస్తోంది. నాడు–నేడు ద్వారా 9 గురుకులాలు, 42 పాఠశాలలు అన్ని వసతులతో నిర్మించారు. ఆరు సామాజిక, 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు 126 సబ్ సెంటర్లలో వైద్య సేవలు అందిస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు..



మా నాన్నకు ఐదుగురు సంతానం. ప్రభుత్వం అటవీ శాఖలో నలుగురికి ఉద్యోగం ఇచ్చింది. విభిన్న ప్రతిభావంతుడినైన నాకు అటవీ శాఖ ద్వారా ప్రొటెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగం ఇచ్చి నెలకు రూ.12,500 ఇస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో దాదాపు 63 బేస్ క్యాంపుల్లో నాలాంటి 300 మందికిపైగా చెంచు యువతకు ప్రభుత్వం ఉపాధి కల్పించింది.

– చెవుల బసవయ్య, చెంచు యువకుడు

గూడేనికే టీచర్



తాత ముత్తాతల కాలం నుంచి అడవి తల్లినే నమ్ముకుని జీవిస్తున్నాం. మా పిల్లలు చదువుకు దూరం కాకుండా ప్రభుత్వం గూడేనికే టీచర్‌ను పంపిస్తోంది. ఆరు కిలోమీటర్ల దూరంలోని నెక్కంటి పెంట నుంచి రోజూ వచ్చే ఐటీడీఏ టీచర్ శ్రీను ఉదయం 7 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 20 మంది పిల్లలకు పాఠాలు చెబుతారు. ఒకటో తేదీనే వలంటీర్ మల్లిఖార్జున వచ్చి ఐదుగురికి పెన్షన్ డబ్బులిస్తున్నారు.

– చిగుళ్ల వెంకటమ్మ, ఇష్టకామేశ్వరి గూడెం

బ్రాండ్ నల్లమల పేరుతో విక్రయాలు



హైదరాబాద్ కేంద్రంగా 1975లో ఏర్పాటైన చెంచు ఐటీడీఏను 1988లో శ్రీశైలానికి తరలించారు. శ్రీశైలం ప్రధాన కేంద్రంగా 3,600 చ.కి.మీ విస్తరించిన నల్లమల అటవీ ప్రాంతంలోని కొండల్లో చెంచు ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో నల్లమల అటవీ ప్రాంతంలో చెంచుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాం. వారు సేకరించే అటవీ ఉత్పత్తులను బ్రాండ్ నల్లమల పేరుతో విక్రయించేందుకు వన్ ధన్ వికాస కేంద్రాలు 10 కేటాయించాం. ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా వృత్తి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.ప్రత్యేక కార్యాచరణతో వారికి ఆధార్ నమోదు చేపట్టాం.

–రవీంద్రారెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్, శ్రీశైలం ఐటీడీఏ

మూడు జిల్లాల్లో చెంచులు

జిల్లా	మండలాలు	గ్రామాలు	గూడేలు	కుటుంబాలు	జనాభా
ప్రకాశం	7	33	81	3,136	13,321
నంద్యాల	14	30	42	2,133	8,160
పల్నాడు	6	33	48	1,643	6,376
మొత్తం	27	96	171	6,912	27,857

శ్రీవారి దర్శనానికి 10 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. పది కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 78,833 మంది స్వామి వారిని దర్శించుకోగా, 36,074 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీల్లో కానుకల రూపంలో భక్తులు రూ.4.73 కోట్లు సమర్పించుకున్నారు. శ్రీవారి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది.

గొడుగుల ఊరేగింపులో భక్తులు కానుకలు ఇవ్వకండి

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ సేవ రోజు అలంకరించేందుకు చెన్నై నుంచి తిరుమలకు చేరుకునే గొడుగుల ఊరేగింపులో భక్తులు ఎలాంటి కానుకలు అందించవద్దని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ఆ విధంగా భక్తులు అందించే కానుకలు టీటీడీకి చేరబోవని తెలియజేసింది. ఈ నెల 27 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాల సమయంలో పలు హిందూ సంస్థలు చెన్నై నుంచి గొడుగులను ఊరేగింపుగా తిరుమలకు తీసుకొచ్చి స్వామి వారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

జూనియర్ ఎన్టీఆర్ సేవలను వాడుకుంటాం

- మా పార్టీలోకి మరింత మంది నటులు వస్తారు
- జనసేన పార్టీతోనే ముందుకెళ్తాం
- రాష్ట్రంలో 5 వేల సభలతో ప్రభుత్వ అవినీతిని ఎండగడతాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

పెంటపాడు/రాజమహేంద్రవరం సిటీ: ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ సేవలను అవసరమైనప్పుడు ఉపయోగించుకుంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. అధిష్టానం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా జూనియర్ ఎన్టీఆర్‌కు రాష్ట్రంలో ప్రజాదరణ ఎక్కడుంటే అక్కడ ఆయన సేవలు వినియోగించుకుంటామని చెప్పారు. బీజేపీలోకి మరింత మంది నటులు, ముఖ్యంగా యువ నటులు వచ్చే అవకాశముందన్నారు. జనసేనతో కలిసే ముందుకు వెళతామని స్పష్టం చేశారు. ఈ మేరకు సోము వీర్రాజు ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం అలంపురం, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలలో వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాలన దోచుకోవడం, దాచుకోవడంలా తయారైందని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా 5 వేల సభల ద్వారా ప్రభుత్వ అవినీతిని ప్రజలకు వివరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాలన దారుణంగా మారిందని, వ్యవస్థలను దిగజారుస్తున్నారని సోము వీర్రాజు ఆరోపించారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ దిగజారిపోయి పనిచేస్తోందని మండిపడ్డారు. తనను పోలీస్ కానిస్టేబుల్ అసభ్య పదజాలంతో దూషించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు మట్టి, ఇసుక, గనులు దోచుకుంటున్నారని ఆరోపించారు. పేదలకు కేంద్రం రేషన్ ద్వారా మంచి బియ్యం ఇస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం చౌక రకం బియ్యాన్ని ప్రజలకు అంటగడుతోందన్నారు. రైతు భరోసా పేరుతో రాష్ట్రంలో రూ.1,500 కోట్ల మేర రైతులు నష్టపోతున్నారన్నారు.

పశువులపై విష ప్రయోగం

- వైఎస్సార్ సీపీ ఎంపీటీసీపై ప్రత్యర్థుల కుట్ర
- దూడ మృతి, మరో మూడు గేదెలకు అస్వస్థత
- కృష్ణా జిల్లాలో ఘటన



విషప్రయోగంతో మరణించిన దూడ

హనుమాన్‌జంక్షన్ రూరల్ (గన్నవరం): రాజకీయ కక్షలతో కృష్ణా జిల్లా బాపులపాడు మండలంలోని వీరవల్లి–1 సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల (వైఎస్సార్ సీపీ)కు చెందిన పశువులపై విషప్రయోగం జరిగింది. ఈ ఘటనలో ఓ గేదె దూడ మృతి చెందగా, మరో మూడు గేదెలు అస్వస్థతకు గురయ్యాయి. గ్రామంలో ఆదివారం ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన దూసరి నిర్మల, జోజి దంపతులు పాడి పశువులను పెంచుకుంటూ కౌలు రైతులుగా జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా రాజకీయంగా వారిద్దరూ చురుగ్గా వ్యవహరిస్తున్నారు. దీంతో కొందరు పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని వారిపై ద్వేషాన్ని పెంచుకున్నారు. ఇటీవల నిర్మల దంపతులు కౌలుకు సాగు చేసిన 16 ఎకరాల వరి కుప్పలను ప్రత్యర్థులు దహనం చేశారు. కాగా, శనివారం అర్ధరాత్రి నిర్మల ఇంటి ప్రాంగణంలోని గేదెలపై విషప్రయోగం జరగగా.. సంఘటనాస్థలంలోని ఆనవాళ్లను బట్టి చూస్తే దోసకాయ, వంకాయలలో గుళికల మందు కలిపి గేదెలకు పెట్టినట్లు తెలుస్తోంది. ఆదివారం తెల్లవారుజామున నిర్మల యథావిధిగా పశువులకు మేత వేసేందుకు వెళ్లినపుడు పశువులన్నీ అపస్మారక స్థితిలో కనిపించాయి. స్థానికులు వీరవల్లి ప్రభుత్వ వైద్యశాల, సంచార పశువైద్యశాల సిబ్బందికి సమాచారం అందించటంతో వారు హుటాహుటిన పశువులకు వైద్యం అందించారు. దీంతో గేదెలకు ప్రాణాపాయం తప్పినట్లేనని పశు వైద్యులు భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు వీరవల్లి ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేశారు. గతంలో వరి కుప్పలు దహనం చేసిన వ్యక్తే ఈ ఘటనకు పాల్పడ్డాడా? లేక వేరేఎవరైనా విష ప్రయోగం చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనాస్థలంలో పడి ఉన్న గుళికలు కలిపి పెట్టిన కూరగాయలు

అల్లరి చేస్తున్నాడని బాలుడి దారుణ హత్య

- మేనత్త, మామలే నిందితులు
- వైఎస్సార్ జిల్లా కడపలో ఘటన



ఆశ్రిత్‌కుమార్ (ఫైల్)

కడప అర్బన్: అల్లరి చేస్తున్నాడని ఓ బాలుడిని మేనత్త, మామలు చిత్రహింసలు పెట్టి హత్య చేశారు. ఈ ఘటన వైఎస్సార్ జిల్లా కడపలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. మృతుడి నానమ్మ ఇందిరమ్మ, తాత జానయ్య, పోలీసుల కథనం మేరకు..అన్నమయ్య జిల్లా కోనాపురం హరిజనవాడకు చెందిన వెలగచెర్ల శివకుమార్, భాగ్యలక్ష్మి దంపతులు కువైట్‌లో ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరు నానమ్మ, తాతయ్యల దగ్గర ఉంటున్నారు. పెద్ద కుమారుడు ఆశ్రిత్‌కుమార్ (8)ను బాగా చదివించాలని శివకుమార్, భాగ్యలక్ష్మిల అనుమతితో కడప ఓంశాంతి నగర్‌లో ఉంటున్న మేనత్త ఇంద్రజ వద్ద పది రోజుల క్రితం నానమ్మ, తాతయ్యలు వదిలిపెట్టారు. ఇంద్రజ, ఆమె భర్త అంజన్‌కుమార్ వై–జంక్షన్ సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయులు. ఆశ్రిత్‌ను తమ బిడ్డలాగా చూసుకుంటామని చెప్పిన వీరు..బాగా అల్లరి చేస్తున్నాడనే నెపంతో చిత్రహింసలు పెట్టేవారు. ఈ నెల 3న రాత్రి రోజూ మాదిరిగానే మేనత్త,మామలు బాలుడిని బాగా కొట్టారు. బాలుడు తీవ్ర అస్వస్థతకు గురైనట్లు గుర్తించి రిమ్స్‌కు తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారు. దీంతో ఇంద్రజ దంపతులు వారి కుమార్తెతో కలిసి పరారయ్యారు. రిమ్స్ మార్చురీలోని బాలుడి మృతదేహాన్ని కడప డీఎస్పీ శివారెడ్డి పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా, అంజన్‌కుమార్‌ను ఇంద్రజ ప్రేమించి మూడేళ్ల క్రితం వివాహం చేసుకుంది. ఈ వివాహం ఇంద్రజ అమ్మా, నాన్న, అన్నా, వదినకు ఇష్టం లేదు. దీంతో వారి మధ్య రాకపోకలు లేవు. ఇంద్రజ కుమార్తె పుట్టిన రోజును ఇటీవల ఘనంగా నిర్వహించారు. దీంతో వీరి మధ్య మళ్లీ రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఆ తరువాత ఈ ఘోరం జరిగింది.

అన్నయ్యా..మమ్మల్ని క్షమించు!

తాము చేయరాని తప్పు చేశామని, ఆశ్రిత్ చనిపోయాడని ఇంద్రజ, కువైట్‌లో ఉన్న తన అన్న శివకుమార్‌కు వాట్సాప్‌లో వాయిస్ మెసేజ్ పెట్టింది. తరువాత సెల్‌ఫోన్‌ను స్విచ్చాఫ్ చేసి భర్త, కుమార్తెతో కలిసి పరారైంది. మెసేజ్ చూసిన శివకుమార్ ఇంద్రజకు ఫోన్ చేయగా..స్విచ్చాఫ్ రావడంతో తన తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులకు సమాచారమిచ్చాడు. వారు కడప రిమ్స్‌కు హుటాహుటిన చేరుకుని బాలుడి మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు.

సింగిల్ స్టీల్ పీఎస్‌యూ చేయాలి

- ఎన్సీవోఏ తీర్మానం



తీర్మానం ప్రవేశపెడుతున్న ఉక్కు అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రరావు

ఉక్కునగరం : కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉన్న సెయిల్, విశాఖ స్టీల్ ప్లాంట్, ఎన్ఎండీసీ, మెకాన్, ఫెర్రో స్క్రాప్, ఎంవోఐఎల్ సంస్థలను విలీనం చేసి సింగిల్ స్టీల్ పీఎస్‌యూను తయారు చేయాలని నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్సీవోఏ) తీర్మానించింది. ఈ మేరకు గోవాలో ఆదివారం నిర్వహించిన ఎన్సీవోఏ సమావేశంలో ఉక్కు అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్ తీర్మానం ప్రవేశపెట్టగా, ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఈ సందర్భంగా చంద్రరావు, ప్రసాద్ మాట్లాడుతూ సింగిల్ పీఎస్‌యూ చేయడం వల్ల విశాఖ స్టీల్ ప్లాంట్‌కు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఇనుప గనుల సమస్య తీరడమే కాకుండా అధిక వడ్డీల భారం తొలగిపోతుందన్నారు. ఉత్పత్తి వ్యయం తగ్గి ఉక్కు ఉత్పత్తులు సామాన్యులకు అందుబాటులో ఉంటాయన్నారు. జాతీయ స్టీల్ పాలసీ ప్రకారం ఉక్కు ఉత్పత్తి 300 మిలియన్ టన్నుల సామర్థ్యానికి చేరుకోవడం సులభమవుతుందన్నారు. సెయిల్‌కు దక్షిణ భారతదేశంలో ఇంటిగ్రేటెడ్ ప్లాంట్ ఉండటం వల్ల వారి స్టీల్ మార్కెట్ పెరుగుతుందన్నారు. ఎన్సీవోఏ అధ్యక్షుడు అలోక్, సెక్రటరీ జనరల్ తోమర్, సీనియర్ సభ్యులు అశోక్‌రావు, స్టీల్ ఎగ్జిక్యూటివ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సెఫీ) చైర్మన్, ప్రధాన కార్యదర్శులు బంచోర్, మల్లిక్ మాట్లాడుతూ విలీనం వల్ల సెయిల్, విశాఖ స్టీల్‌ప్లాంట్ రెండూ లాభం పొందుతాయన్నారు.

టాయ్‌లెట్ చార్జీ రూ.112

ఆగ్రా: రైల్వేస్టేషన్‌లో టాయ్‌లెట్ వాడుకుంటే ఎంత చెల్లిస్తాం? ఉచితం కాకుంటే గనక ఏ ఐదు రూపాయలో, 10 రూపాయలో. కానీ ఇద్దరు బ్రిటిష్ పర్యాటకులు మాత్రం ఏకంగా రూ.112 చొప్పున చెల్లించుకోవాల్సి వచ్చింది! వారిద్దరూ ఢిల్లీలోని బ్రిటిష్ ఎంబసీ నుంచి ఆగ్రా వెళ్లారు. రైల్వేస్టేషన్లో శ్రీవాత్సవ అనే గైడ్ వారిని రిసీవ్ చేసుకున్నాడు. టాయ్‌లెట్‌కు వెళ్లాలని చెప్పడంతో ఐఆర్‌సీటీసీ ఎగ్జిక్యూటివ్ లాంజ్‌కు తీసుకెళ్లాడు. బయటికి రాగానే 12 శాతం జీఎస్టీతో కలిపి చెరో రూ.112 రూపాయలు చెల్లించాలని వారిని సిబ్బంది డిమాండ్ చేశారట. ఇదేమిటని ప్రశ్నించినా లాభం లేకపోయిందని, దాంతో ఆ మొత్తాన్ని తానే చెల్లించానని గైడ్ చెప్పుకొచ్చాడు. దీనిపై ఆయన ఐఆర్‌సీటీసీకి ఫిర్యాదు కూడా చేశాడు. అయితే అది లాంజ్ సేవల చార్జే తప్ప టాయ్‌లెట్‌కు వెళ్లినందుకు వసూలు చేసింది కాదని ఐఆర్‌సీటీసీ స్పష్టం చేసింది. ''లాంజ్ సేవలు వాడుకుంటే కనీస చార్జీ రూ.200. రెండు గంటల పాటు ఏసీ లాంజ్ రూము, కాంప్లిమెంటరీ కాఫీ, ఉచిత వైఫై వంటి సదుపాయాలకు కలిపి ఈ చార్జీ. 50 శాతం డిస్కౌంట్ పోను 12 శాతం జీఎస్టీతో కలిపి రూ.112 చెల్లించాల్సి ఉంటుంది'' అని వివరించింది.

క్లుప్తంగా...

రోహింగ్యాల సమస్యలో సాయపడండి: బంగ్లాదేశ్

ఢాకా: దాదాపు 11 లక్షల మంది రోహింగ్యా ముస్లింల వలసలతో బంగ్లాదేశ్ సమస్యలను ఎదుర్కొంటోందని, వారిని స్వదేశం మయన్మార్‌కు పంపే ప్రక్రియలో తమకు సాయపడాలని భారత్‌ను బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా కోరారు. ''రోహింగ్యా వలసల సమస్యకు పరిష్కారం కనుగొనడంలో భారత్ కీలక భూమి పోషించగలదు. వాళ్లు బంగ్లాకు పెద్ద భారంగా తయారయ్యారు. బంగ్లాదేశ్‌లో 11 లక్షల మంది రోహింగ్యాలు పోగుబడ్డారు. మానవతా దృక్పథంతో వారికి ఇన్నాళ్లూ సాయపడ్డాం. కానీ, ఎన్నాళ్లని వారు ఇక్కడే ఉంటారు? వారు ఉంటున్న తాత్కాలిక శిబిరాలు సమస్యల కేంద్రాలుగా మారుతున్నాయి'' అని హసీనా ఒక వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు.

నిధులు జమ చేయని మాల్యా

సుప్రీంకోర్టుకు నివేదించిన ట్రిబ్యునల్

న్యూఢిల్లీ: 4 కోట్ల డాలర్ల నిధుల బదిలీ కేసులో కోర్టు ధిక్కరణ అభియోగాలపై నాలుగు నెలల జైలు శిక్ష పడ్డ విజయ్ మాల్యా, ఇతర లబ్ధిదారులు వాటిని జమ చేయలేదని డెట్ రికవరీ ట్రిబ్యునల్ సుప్రీంకోర్టుకు తెలిపింది. సదరు 4 కోట్ల డాలర్లను నాలుగు వారాల్లోగా రికవరీ ఆఫీసర్ వద్ద జమ చేయాలని మాల్యా తదితరులను సుప్రీంకోర్టు జూలై 11న ఆదేశించడం తెలిసిందే. అలాగే ఇంగ్లండ్‌కు పారిపోయిన మాల్యాను జైలు శిక్షను అనుభవించేందుకు తక్షణం దేశానికి రప్పించాలని కూడా కేంద్రాన్ని ఆదేశించింది. నిధులను జమ చేయని పక్షంలో వారి ఆస్తులను రికవరీ ఆఫీసర్ జప్తు చేసుకోవచ్చని పేర్కొంది. ఈ నేపథ్యంలో వారిపై చేపట్టాల్సిన తదుపరి చర్యలను సుప్రీంకోర్టు సోమవారం పరిశీలించనుంది.

జార్ఖండ్‌లో నేడు బలపరీక్ష

రాయ్‌పూర్: జార్ఖండ్‌లో అధికార యూపీఏకి చెందిన 30 మంది ఎమ్మెల్యేలు ఆదివారం ఛత్తీస్‌గఢ్ నుంచి తిరిగి రాంచీకి చేరుకున్నారు. సోమవారం అసెంబ్లీలో బలపరీక్షలో పాల్గొంటారు. ఆగస్టు 30 నుంచీ వీరు రాయ్‌పూర్‌లోని ఓ విలాసవంతమైన రిసార్టులో మకాం వేసిన విషయం తెలిసిందే. తమ సంకీర్ణాన్ని ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రతిపక్ష బీజేపీ ప్రయత్నిస్తుందన్న అనుమానాల మధ్య సీఎం హేమంత్ సోరెన్ ఎమ్మెల్యేలను ఛత్తీస్‌గఢ్‌కు తరలించారు.

చిట్‌ఫండ్ కేసులో సీబీఐ సోదాలు


కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో వెలుగుచూసిన చిట్‌ఫండ్ కుంభకోణం కేసు దర్యాప్తును సీబీఐ ముమ్మరం చేసింది. రాష్ట్రంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సుబోధ్ అధికారి, అతని సోదరుడి ఇల్లు, ఆఫీస్‌లు సహా ఆరు చోట్ల ఆదివారం సీబీఐ సోదాలు కొనసాగించింది. సుబోధ్ సోదరుడు కమల్ కంచ్రాపారా మున్సిపాలిటీ చైర్మన్‌గా ఉన్నారు. సన్మార్గ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్‌తో సంబంధమున్న చిట్‌ఫండ్ కేసులో హాలీసహర్ మున్సిపల్ చైర్మన్, టీఎంసీ నేత రాజు సహానీని అరెస్ట్‌చేసిన రెండ్రోజులకే రాష్ట్రంలో పలుచోట్ల సీబీఐ దాడులు జరగడం గమనార్హం. సహానీ ఇంట్లో రూ.80 లక్షల నగదు, దేశవాళీ ఆయుధం, రూ.2.75 కోట్ల విలువైన స్థిరాస్తి పత్రాలు అధికారులు స్వాధీనంచేసుకున్నారు.

మోడల్ జైళ్ల చట్టం తీసుకొస్తాం: అమిత్ షా

అహ్మదాబాద్: బ్రిటిష్ కాలం నాటి నిబంధనల స్థానంలో ఆరు నెలల్లో మోడల్ జైళ్ల చట్టం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. తద్వారా దేశవ్యాప్తంగా కారాగారాల ఆధునీకరణ చేపడతామన్నారు. జైళ్ల విధానంలో సంస్కరణల కోసం 2016లో కేంద్రం తెచ్చిన మోడల్ ప్రిజన్ మాన్యువల్‌ను వెంటనే అంగీకరించాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఆదివారం ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి అమిత్ షా ప్రసంగించారు.

అమెరికాలో కాల్పులు.. ఇద్దరు మృతి

ఫ్లోరిడా: అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో శనివారం రాత్రి జరిగిన కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. జాక్సన్‌విల్లేకు 60 కిలోమీటర్ల దూరంలోని పలట్కా పట్టణంలోని ఓ క్లబ్ వెలుపల రెండు ముఠాల మధ్య గొడవ తలెత్తింది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో ఇద్దరు చనిపోగా పలువురు గాయపడ్డారు.



కుర్ర గ్రహం చిక్కింది


భూమికి కేవలం 385 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఓ కుర్ర గ్రహాన్ని జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తన కెమెరా కంటితో బంధించింది. సౌరవ్యవస్థకు ఆవల ఉన్న దీన్ని హెచ్‌ఐపీ 65426గా పిలుస్తున్నారు. ఈ గ్రహం భూమి కంటే చాలా చిన్నది. భూమి వయసు 450 కోట్ల ఏళ్లు కాగా దీని వయసు కేవలం 1.5 నుంచి 2 కోట్ల ఏళ్లేనట. భూమ్మీదున్న పలు టెలిస్కోప్‌లు ఈ గ్రహాన్ని 2017లోనే ఫొటో తీసినా అంతరిక్షం నుంచి తీసిన జేమ్స్ వెబ్ తాజా చిత్రాలు దాని వివరాలను అద్భుతమైన స్పష్టతతో అందించాయి. ఇంతకూ హెచ్‌ఐపీ 65426 నేల వంటి గట్టి ఉపరితలం లేని ఓ భారీ వాయు గ్రహమట. కనుక దానిపై జీవముండే ఆస్కారం కూడా లేదని నాసా శాస్త్రవేత్తలు తేల్చారు. సూర్యునికి భూమి మధ్య దూరంతో పోలిస్తే ఈ గ్రహం తాను పరిభ్రమిస్తున్న నక్షత్రానికి కనీసం 100 రెట్లు ఎక్కువ దూరంలో ఉందట. సౌర మండలానికి ఆవలున్న ఇలాంటి మరిన్ని గ్రహాలను జేమ్స్ వెబ్ ముందుముందు మనకు పట్టిస్తుందని నాసా చెబుతోంది.

మంగోలియా, జపాన్‌లలో నేటి నుంచి రాజ్‌నాథ్ పర్యటన

న్యూఢిల్లీ: మంగోలియా, జపాన్‌లలో ఐదు రోజుల పర్యటనకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం బయలుదేరి వెళ్లారు. మారుతున్న ప్రపంచ రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ రెండు దేశాలతో వ్యూహాత్మక, రక్షణ సంబంధాల బలోపేతమే లక్ష్యంగా పర్యటన సాగనుందని విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి. 5 నుంచి 7 వరకు మంగోలియాలో ఆయన పర్యటన ఉంటుంది. భారత రక్షణ మంత్రి ఒకరు మంగోలియాలో పర్యటించడం ఇదే ప్రథమం. అనంతరం 8, 9 తేదీల్లో జపాన్ పర్యటన సందర్భంగా జరిగే 2+2 విదేశాంగ, రక్షణ మంత్రుల సమావేశాల్లో రాజ్‌నాథ్‌తో పాటు జై శంకర్ కూడా పాల్గొంటారు.

భయద్వేషాల వ్యాప్తి

ఇవే మోదీ ఘనతలు: రాహుల్
- దేశాన్ని బలహీనపరుస్తున్నాడు
- ఇద్దరు మిత్రులకు దోచిపెడుతున్నాడు
- సామాన్యులపైనేమో తీవ్ర ధరాభారం
- ధరల పెరుగుదలపై కాంగ్రెస్ ర్యాలీ
- అవినీతిలో నిండా మునిగి నీతులా?
- రాహుల్ ప్రసంగంపై బీజేపీ ధ్వజం



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ సర్వత్రా భయోత్పాతాన్ని, విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. తద్వారా దేశాన్ని బలహీనపరుస్తూ అంతిమంగా చైనా, పాకిస్తాన్ వంటి శత్రు దేశాలకే లాభం చేకూరుస్తున్నారన్నారు. ''దేశ సంపదను తన ఇద్దరు మిత్రులకు దోచిపెట్టడంలో రాజు బిజీగా ఉన్నాడు. సామాన్యులేమో ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలతో సతమతమవుతున్నారు. నిరుద్యోగం 40 ఏళ్ల గరిష్టానికి చేరింది. దేశాన్ని మోదీ తిరోగమన పథంలోకి నెడుతున్నారు'' అని విమర్శించారు. ధరల పెరుగుదలపై 'మెహంగాయీ పర్ హల్లా బోల్' పేరిట కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో భారీ ర్యాలీ నిర్వహించింది. పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తీరును దుయ్యబట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని ఆక్షేపించారు. ''బీజేపీ హయాంలో మీడియా మొదలుకుని న్యాయ వ్యవస్థ, ఎన్నికల సంఘం దాకా అన్ని వ్యవస్థలపైనా విపరీతమైన ఒత్తిడి వాతావరణం నెలకొని ఉంది. కేవలం ఇద్దరు బడా పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేందుకే మోదీ ప్రభుత్వం 24 గంటలూ అవిశ్రాంతంగా శ్రమిస్తోంది. పేదలు, అణగారిన వర్గాలకు కూడా సంక్షేమ ఫలాలు అందాలన్నది కాంగ్రెస్ సిద్ధాంతం కాగా, బీజేపీ మాత్రం కేవలం కొందరు బడా బాబులకే సర్వం దోచిపెడుతూ పేదల పొట్ట కొడుతోంది. ఈ అన్యాయాలపై పార్లమెంటులో నిలదీసేందుకు విపక్షాలకు అవకాశం కూడా ఇవ్వడం లేదు. అందుకే నేరుగా ప్రజలతోనే మాట్లాడి నిజానిజాలు వారికి వివరించేందుకే భారత్ జోడో యాత్రను తలపెట్టాం'' అని చెప్పారు. బీజేపీ-ఆరెస్సెస్ భావజాలాన్ని విపక్షాలు సమైక్యంగా ఓడించి తీరతాయన్నారు.

మా కృషిని నేలపాలు చేశారు

కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ పదేళ్ల పాలనలో 27 కోట్ల మందిని పేదరికం నుంచి బయట పడేస్తే బీజేపీ మాత్రం ఎనిమిదేళ్ల పాలనలో ఏకంగా 23 కోట్ల మంది పౌరులను నిరుపేదలుగా మార్చేసిందని రాహుల్ ఆరోపించారు. అలా తమ కృషినంతా నేలపాలు చేసిందన్నారు. ''దేశ ఆర్థిక సామర్థ్యాన్ని మోదీ నాశనం చేస్తున్నారు. దాంతో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ధరల పెరుగుదల... ఇలా ఎటు చూసినా సమస్యలే కన్పిస్తుండటంతో భవిష్యత్తును తలచుకుని జనం భయపడుతున్నారు. పేదలకు, కార్మికులకు, చిరు వ్యాపారులకు మోదీ సర్కారు చేసింది శూన్యం'' అన్నారు. కేవలం కాంగ్రెస్ భావజాలం మాత్రమే దేశాన్ని ప్రగతి పథంలో నడపగలదన్నారు. ''నన్ను ఈడీ ఆఫీసులో 55 గంటలు కూచోబెట్టారు. మోదీకి ఒక్కటే చెబుతున్నా. 500 గంటలు కూచోబెట్టినా సరే, మీ ఈడీకి బెదిరే ప్రసక్తే లేదు'' అన్నారు. కేంద్రం పార్లమెంటులో విపక్షాల గొంతు నొక్కుతోందని మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. బీజేపీ నేతలను ప్రజాస్వామ్య ముసుగు ధరించిన ఫాసిస్టులుగా రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లోట్ అభివర్ణించారు. ఈడీ, సీబీఐ రూపంలో మోదీ సర్కారుకు ఇద్దరు సోదరులున్నారని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం కూడా మోదీ సర్కారు సోదరులేనన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్, ఎంపీలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

గోధుమ పిండి ద్రవ పదార్థమా?
రాహుల్ ప్రసంగంపై బీజేపీ ఎద్దేవా

కాంగ్రెస్ ర్యాలీని వృథా ప్రయాసగా బీజేపీ అభివర్ణించింది. గోధుమ పిండి ఘన పదార్థమో, ద్రవమో కూడా తెలియని స్థితిలో రాహుల్‌గాంధీ ఉన్నారంటూ పార్టీ అధికార ప్రతినిధి సంబిత పాత్రా ఎద్దేవా చేశారు. ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ గోధుమ పిండి ధర లీటర్ 22 రూపాయల నుంచి 40 రూపాయలకు పెరిగిందని వ్యాఖ్యానించారు. దాన్ని ప్రస్తావిస్తూ, ''గోధుమ పిండి ఘనమో, ద్రవమో రాహుల్‌కు తెలియదు. ఆలుగడ్డలు నేలపై పెరుగుతాయో, లోపల పెరుగుతాయో తెలియదు. కానీ ప్రపంచంలోని అన్ని అంశాలపైనా ప్రసంగం దంచేస్తారు. ఆయనో పరిపక్వత లేని వ్యక్తి'' అని విమర్శించారు. నిజమైన ద్వేషం, భయం రాహుల్ ప్రసంగంలోనే కన్పించాయన్నారు. ''రూ.5,000 కోట్ల పై చిలుకు నేషనల్ హెరాల్డ్ కుంభకోణంలో రాహుల్, కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ బెయిల్‌పై ఉన్నారు. అవినీతిని జన్మహక్కుగా భావిస్తూ అందులో మునిగి తేలుతున్న వాళ్లు భయంతో వణికిపోతున్నారు. రాహుల్ ప్రసంగంలోనూ అదే ప్రతిఫలించింది'' అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తే వాటిని కిలోల్లో కొలుస్తారా, లీటర్లలోనా అంటూ బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ చెణుకులు విసిరారు.

కశ్మీర్‌కు రాష్ట్ర హోదానే ఎజెండా

- గులాం నబీ ఆజాద్ వెల్లడి
- జమ్మూలో మొదటి ర్యాలీ



జమ్మూ: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా తమ కొత్త పార్టీ ఎజెండాలో ప్రధానంగా ఉంటుందని సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ ప్రకటించారు. జమ్మూ కశ్మీర్‌లోని అన్ని వర్గాలను కలుపుకుని పోతామని తెలిపారు. కాంగ్రెస్‌కు ఆయన ఇటీవల రాజీనామా చేయడం తెలిసిందే. జమ్మూ శివారులోని సైనిక్ కాలనీలో ఆదివారం మొట్టమొదటి ర్యాలీలో ఆయన ప్రసంగించారు. కశ్మీరీ పండిట్లకు పునరావాసం, నివాసితులకు భూ, ఉద్యోగ హక్కుల కల్పన వంటివి కూడా తమ ఎజెండాలో ఉంటాయన్నారు. కొత్త పార్టీ పేరు, జెండా వంటి వాటిని ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని త్వరలోనే నిర్ణయిస్తామన్నారు. ఉగ్రవాదుల టార్గెట్ కిల్లింగ్స్‌పై ఆయన మాట్లాడుతూ ఇటువంటి వాటిని ఇకపై ఆపేయాలన్నారు. లోయకు తిరిగి రావాలనుకునే వారికి భద్రత, వసతులు కల్పిస్తామని చెప్పారు. ఆజాద్‌కు మద్దతుగా కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, అప్నీ పార్టీ, పీడీపీలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్నారు.

లండన్‌లో మాయమైన ఖరీదైన కారు...

పాకిస్తాన్‌లో ప్రత్యక్షమైంది



లండన్: అది దాదాపు రూ.2.4 కోట్ల విలువైన ఖరీదైన బెంట్లీ కారు. దాన్ని బ్రిటన్‌లో మాయం చేసిన దొంగలు పాకిస్తాన్‌లో అమ్మేశారు. అయితే అధునాతన సాంకేతికత సాయంతో దాని జాడను బ్రిటన్ అధికారులు కనుగొన్నారు. మూడు లక్షల డాలర్ల విలాసవంత బెంట్లీ కారు కొన్ని వారాల క్రితం లండన్‌లో చోరీకి గురైంది. ఎట్టకేలకు దాని జాడను బ్రిటన్ నేషనల్ క్రైమ్ ఏజెన్సీ పాకిస్తాన్‌లో కనుగొంది. బ్రిటన్ అధికారులు అందించిన సమాచారంతో రంగంలోకి దిగిన కరాచీ కలెక్టరేట్ ఆఫ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంపన్నులుండే డీహెచ్‌ఏ ప్రాంతంలో కారు దాచిన విషయం తెల్సుకున్నారు. ఓ ఖరీదైన భవంతి ప్రాంగణంలో చేసిన సోదాల్లో కారు దొరికింది. అయితే, పాకిస్తాన్ రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్‌తో యజమాని అది పాక్ వాహనమని వాదించే ప్రయత్నం చేశాడు. అయితే, బ్రిటన్ అధికారులు ఇచ్చిన ఛాసిస్ నంబర్ వివరాలు ఈ కారుతో సరిపోలాయి. సరైన వాహన పత్రాలు ఇవ్వడంలో యజమాని విఫలమవడంతో కారును అధికారులు సీజ్ చేశారు. అతడిని, విక్రయించిన బ్రోకర్‌ను అరెస్ట్‌చేశారు. తూర్పు యూరప్‌లోని ఒక దౌత్యవేత్త పత్రాలను అడ్డుపెట్టుకుని కారును అక్రమంగా పాకిస్తాన్‌కు తరలించారని తేలింది. బెంట్లీ కారులోని ట్రేసింగ్ ట్రాకర్‌ను దొంగలు స్విచ్ ఆఫ్ చేయడం మరిచిపోయారని, అందుకే అధునిక ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా జాడ ఎక్కడుందో ఇట్టే కనిపెట్టారని పాకిస్తాన్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖరీదైన వాహనాన్ని అక్రమంగా పాక్‌కు తీసుకురావడంతో ఆ దేశం 30 కోట్ల పాక్ రూపాయల పన్నును కోల్పోయింది. ఈ స్మగ్లింగ్ రాకెట్ సూత్రధారి కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు.

మెగసెసెను తిరస్కరించిన శైలజ



తిరువనంతపురం/న్యూఢిల్లీ: ప్రజాసేవలో కొనసాగుతూ, అద్భుత ప్రతిభ కనబరిచిన వారికిచ్చే రామన్ మెగసెసె అవార్డ్‌ను కేరళ మాజీ ఆరోగ్య శాఖ మంత్రి కె.కె. శైలజ తిరస్కరించారు. దివంగత రామన్ మెగసెసె గతంలో ఫిలిప్పీన్స్ అధ్యక్ష హోదాలో ఆ దేశంలో కమ్యూనిజాన్ని తీవ్రంగా అణచివేశారని, అందుకే పార్టీ కీలక నేతలతో మాట్లాడి అవార్డ్‌ను స్వీకరించకూడదని నిర్ణయించుకున్నట్లు సీపీఐ(ఎం) సెంట్రల్ కమిటీ సభ్యురాలైన శైలజ స్పష్టంచేశారు. కేరళలో నిపా వైరస్ విజృంభణ, కోవిడ్ సంక్షోభ కాలంలో రాష్ట్ర ఆరోగ్యమంత్రిగా శైలజ ఆనాడు వైద్యరంగంలో తలెత్తిన సంక్షోభాన్ని సమర్థవంతంగా సద్దుమణిగేలా చేశారని ప్రశంసలందుకున్నారు. 'ఆనాడు రాష్ట్రంలో నేను చేసిన పని అందరితో కలిసి సమష్టిగా సాధించిన విజయం. ఒక్కదాన్నే చేసిందికాదు. అందుకే ఇప్పుడు ఈ అవార్డ్‌ను వ్యక్తిగతంగా తీసుకోదల్చుకోలేదు' అని శైలజ అన్నారు. 'ఫిలిప్పీన్స్ అధ్యక్షునిగా కమ్యూనిజాన్ని మెగసెసె దారుణంగా అణగదొక్కారు' అని పార్టీ సీనియర్ నేత సీతారాం ఏచూరి వ్యాఖ్యానించారు. క్రియాశీలక రాజకీయాల్లో ఉన్న వ్యక్తులకు ఇంతవరకు ఈ అవార్డ్‌ను ప్రకటించలేదు. శైలజ ఈ అవార్డ్‌ను స్వీకరిస్తే అవార్డ్‌ను పొందిన తొలి క్రియాశీలక నేతగా గుర్తింపు పొందేవారని మీడియాలో వార్తలొచ్చాయి. 1957లో విమాన ప్రమాదంలో మెగసెసె మరణించాక ఆయన పేరిట రాక్ ఫెల్లర్ బ్రదర్స్ ఫండ్ ఈ అవార్డును ఏర్పాటుచేసింది. ఆసియా దేశాల్లో ప్రజాసేవ, పాత్రికేయం, సాహిత్యం తదితర రంగాల్లో విశేష కృషి చేసిన వారికి, ఫిలిప్పీన్స్ పౌరులకు దీన్ని బహూకరిస్తున్నారు. గతంలో భారతీయ సినీ దిగ్గజం సత్యజిత్ రే, ప్రఖ్యాత కార్టూనిస్ట్ ఆర్‌కే లక్ష్మణ్, మాజీ కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ టీఎన్ శేషన్, ప్రముఖ గాయని ఎంఎస్ సుబ్బలక్ష్మి, వ్యవసాయరంగ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, మాజీ ఐపీఎస్ కిరణ్ బేడీ, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

జాన్సన్ వారసులెవరో తేలేది నేడే

బ్రిటన్ ప్రధాని ఎన్నికకు కౌంట్‌డౌన్
- కొన్ని గంటల్లోనే తేలిపోనున్న ఫలితం
- అందరి దృష్టీ రిషి సునాక్ మీదే
- లిజ్ ట్రస్ వైపే మొగ్గు?
- నూతన ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తానని రిషి వెల్లడి



లండన్: యూకే తదుపరి ప్రధాని ఎవరో మరికొద్ది గంటల్లోనే తేలిపోనుంది. భారత సంతతికి చెందిన మాజీ ఆర్థిక మంత్రి రిషి సునాక్(42), మంత్రి లిజ్ ట్రస్(47) ఎన్నికల బరిలో నిలిచిన విషయం తెలిసిందే. కన్జర్వేటివ్ పార్టీలో ఎక్కువ మంది లిజ్ ట్రస్ వైపే మొగ్గుచూపుతున్నట్లు పలు సర్వేల్లో ఇప్పటికే వెల్లడైంది. లిజ్ ట్రస్ ఎన్నికైతే బ్రిటన్ ప్రధానిగా మార్గరెట్ థాచర్, థెరిసా మే తర్వాత మూడో మహిళ కానున్నారు. ఆన్‌లైన్, పోస్టల్ బ్యాలెట్ ద్వారా సుమారు 1.60 లక్షల మంది కన్జర్వేటివ్ పార్టీ సభ్యులు ఓటు వేసి పార్టీ నేతను ఎన్నుకుంటారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఫలితాలను రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న సర్ గ్రాహం బ్రాడీ వెల్లడిస్తారు. ఎన్నికైన నేత డౌనింగ్ స్ట్రీట్‌కు సమీపంలోనే ఉన్న రాణి ఎలిజబెత్–2 కాన్ఫరెన్స్ సెంటర్ నుంచి సంక్షిప్త ప్రసంగం చేస్తారు. మంగళవారం డౌనింగ్ స్ట్రీట్ కార్యాలయం నుంచి ఆపద్ధర్మ ప్రధాని బోరిస్ జాన్సన్ వీడ్కోలు ప్రసంగం చేస్తారు. అనంతరం స్కాట్లాండ్‌లో ఉన్న రాణి ఎలిజబెత్‌కు తన రాజీనామాను అందజేస్తారు. ఆపైన, పార్టీ నేతగా ఎన్నికైన వారు స్కాట్లాండ్‌కు వెళ్లి రాణి నుంచి నియామక పత్రం అందుకుంటారు. ఇంగ్లండ్‌కు, బకింగ్‌హామ్ ప్యాలెస్‌కు బదులుగా మరోచోట నుంచి ప్రధాని పేరును రాణి ప్రతిపాదించడం బ్రిటన్ చరిత్రలో ఇదే మొదటిసారి. 96 ఏళ్ల రాణి వయస్సు రీత్యా ప్రయాణాలను గణనీయంగా తగ్గించుకున్నారు. ప్రస్తుతం ఆమె అబెర్దీన్‌షైర్ బాల్మోరల్ కోటలో గడుపుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం కొత్తగా నియమితులైన ప్రధానమంత్రి డౌనింగ్ స్ట్రీట్ కార్యాలయం నుంచి మొదటి ప్రసంగం చేయడానికి ముందే కీలకమైన కేబినెట్ పదవులను ఖరారు చేస్తారు. సీనియర్ అధికారులు నూతన ప్రధానికి భద్రతకు సంబంధించిన కీలక వివరాలను, అణ్వాయుధాల రహస్య కోడ్‌లను అందజేస్తారు. బుధవారం మధ్యాహ్నం అధికార కన్జర్వేటివ్ పార్టీ కొత్త నేత హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రతిపక్ష నేత ప్రశ్నలకు సమాధానాలిస్తారు. కోవిడ్ నిబంధనలన ఉల్లంఘిస్తూ పార్టీలు జరుపుకోవడం, పార్టీ సీనియర్ నేత ఒకరు కుంభకోణంలో ఇరుక్కోవడం వంటి పరిణామాలతో బోరిస్ జాన్సన్ కేబినెట్‌లోని సుమారు 60 మంది సీనియర్ నేతలు రాజీనామాలు చేశారు. దీంతో అధికార పార్టీ కొత్త నేతను ఎన్నుకునే సుదీర్ఘ ప్రక్రియను చేపట్టిన విషయం తెలిసిందే.

ఇంధన భారం తగ్గిస్తాం

ఇంధన సంక్షోభాన్ని పరిష్కరిస్తామని, గృహ వినియోగదారులకు విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని యూకే ప్రధాని రేసులో భారత సంతతికి చెందిన రిషి సునాక్, లిజ్ ట్రస్ తెలిపారు. బ్రిటన్ ప్రధాని పదవికి జరిగే ఎన్నికలో అధికార కన్జర్వేటివ్ పార్టీకి చెందిన ఈ ఇద్దరు నేతలు బరిలో ఉన్న విషయం తెలిసిందే. మరికొద్ది గంటల్లోనే పోలింగ్ జరగనున్న సమయంలో ఆదివారం వీరు బీబీసీ ఇంటర్వ్యూలో పలు విషయాలపై మాట్లాడారు. రష్యా– ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా యూకేలో ఇంధన ధరలు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో, ఇదే ప్రధాన అంశంగా మారింది. కొత్త ప్రభుత్వానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని కూడా రిషి సునాక్ పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యునిగా కొనసాగుతానని, తన సొంత రిచ్‌మండ్, యార్క్‌షైర్ ప్రజల కోసం పనిచేస్తానని చెప్పారు. ఈ ఎన్నికల్లో ఓటమిపాలైతే ఏం చేస్తారన్న ప్రశ్నలకు ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. మళ్లీ ఎన్నికలు జరిగితే ప్రధాని పదవి రేసులో ఉంటారా అన్న ప్రశ్నకు ఆయన నేరుగా సమాధానమివ్వలేదు.

ఉల్లితో మధుమేహం దూరం!



కాలిఫోర్నియా: ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదని అంటారు. ఈ మాటల్లో నిజముందని తాజా పరిశోధనల్లో వెల్లడైంది. మధుమేహ రోగులకు ఉల్లిపాయ సూపర్ ఫుడ్ అని, రోజూ ఉల్లిపాయ తింటే రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుందని అమెరికాలోని కాలిఫోర్నియాలో శాన్ డియోగాలోని ఎండోక్రైన్ సొసైటీ నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. టైప్ 2 డయాబెటీస్ రోగులకు ఇచ్చే యాంటీ డయాబెటిక్ డ్రగ్ మెట్‌ఫార్మిన్‌తో పాటు ఉల్లిపాయ కూడా తీసుకుంటే షుగర్ లెవల్స్ 50శాతం వరకు తగ్గే అవకాశం మెరుగ్గా ఉందని ఆ అధ్యయనంలో తేలినట్టు ది ఇండిపెండెంట్ పత్రిక ప్రచురించింది. మధుమేహ రోగుల చికిత్సలో భాగంగా ఉల్లిపాయను కూడా సూచించవచ్చునని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన నైజీరియాలో డెల్టా స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆంటోని ఒజిహె అన్నారు. అయితే తమ పరిశోధనలు ప్రస్తుతం ఇంకా ఎలుకలపైనే చేశామని, త్వరలో మానవ ప్రయోగాలు నిర్వహిస్తామని చెప్పారు. ''ఉల్లిపాయ తక్కువ ధరకి లభిస్తుంది. డయాబెటీస్‌కి వాడే మందుతో పాటు ఉల్లిపాయ కూడా క్రమం తప్పకుండా తీసుకుంటే ఆ మందు ఇంకా బాగా పని చేస్తుంది. అయితే ఇంకా ఎలుకల్లోనే ఈ ప్రయోగం జరిగింది'' అని ఆంటోని వెల్లడించారు. మధుమేహం ఉన్న ఎలుకల్లో రోజుకి 400 ఎంజీ, 600 ఎంజీ ఉల్లిని ఇవ్వడంతో చక్కెర స్థాయి బాగా తగ్గిందని, అంతేకాకుండా కొలస్ట్రాల్ కూడా తగ్గినట్టు తేలినట్టుగా వివరించారు. మరోవైపు సెంటర్ ఫర్ డయాబెటిస్ చైర్మన్ డాక్టర్ అనూప్ శర్మ ఈ అధ్యయనంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భారతీయులు ఉల్లిపాయ చాలా ఎక్కువగా తింటారని అలాంటప్పుడు భారత్ మధుమేహగ్రస్తులకు ఎందుకు హాట్‌స్పాట్‌గా మారిందని ప్రశ్నించారు. మానవ ప్రయోగాలు జరిగేంతవరకు ఒక నిర్ధారణకు రాలేమన్నారు.

వాళ్లతో ఉంటే మంచోళ్లు.. విమర్శిస్తే అవినీతిపరులు

బీజేపీపై బిహార్ సీఎం నితీశ్ వ్యంగ్యోక్తులు



పట్నా: బిహార్ సీఎం నితీశ్ కుమార్ బీజేపీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాషాయపార్టీతో సఖ్యతగా ఉన్న వాళ్లంతా మంచివాళ్లు, ఆ పార్టీ విధానాలను విమర్శిస్తే అవినీతి పరులవుతారంటూ ఎద్దేవా చేశారు. ఆదివారం జరిగిన జేడీయూ జాతీయ కౌన్సిల్ భేటీలో ఆయన మాట్లాడారు. ఇతర పార్టీల వారిని కొనుగోలు చేయడం అవినీతి కాదా అంటూ కొన్ని రాష్ట్రాల్లోని ప్రతిపక్ష పార్టీల నేతలు బీజేపీ కండువా కప్పుకోవడాన్ని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికల్లా బీజేపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలను ఐక్యం చేసేందుకు ప్రయత్నిస్తానన్నారు. ప్రతిపక్షాలు ఐక్యంగా ఉంటేనే బీజేపీని గద్దె దించగలమన్నారు. ఈ నెల 5 నుంచి 8 వరకు ఢిల్లీలో మకాం వేయనున్న నితీశ్.. రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌ను కలిసే అవకాశాలున్నాయి.



హిన్నామ్‌నూర్ భీకర తుపాను ముంచుకొస్తున్న వేళ దక్షిణకొరియాలోని జేజూ ద్వీపం వద్ద తీరాన్ని భారీ అలలు తాకుతున్న దృశ్యం. తుపాను నేపథ్యంలో చైనా, జపాన్‌లో వేలాది పడవలను సముద్రజలాల నుంచి తీరానికి తీసుకొచ్చారు. విమానసర్వీసులు రద్దయ్యాయి.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

సోమవారం । 5 । సెప్టెంబర్ । 2022



క్యూ లైన్ పనులు షురూ

దసరా ఉత్సవాలకు సంబంధించిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వినాయక గుడి నుంచి క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు.



పులిచింతల నీటినిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో 38.4077 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 1,24,360 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు 1,15,960 క్యూసెక్కులు వదులుతున్నారు.

నేడు స్పందన



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలోనూ ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చన్నారు.



బైబై గణేశా.. కృష్ణమ్మ ఒడిలోకి ఒరిగిపోతున్న బొజ్జ గణపయ్య





నిమజ్జనోత్సాహం

జై గణేశా.. జైజై గణేశా.. గణపతిబప్పా మోరియా.. నినాదాలు మార్మోగాయి. డప్పుచప్పుళ్లతో శోభాయాత్రలు అట్టహాసంగా సాగాయి. యువతీయువకులు, చిన్నాపెద్ద తేడా లేకుండా ఆడిపాడి సందడి చేశారు. దాండియా ఆడారు. ఊరూవాడా ఉత్సవశోభతో కళకళలాడింది. జిల్లా వ్యాప్తంగా నిమజ్జనోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. రంగు రంగుల విద్యుత్ దీపాల వెలుగులో గణనాథుడు నిమజ్జనానికి తరలివెళ్లాడు. బైబై గణేశా.. అంటూ ప్రజలు బొజ్జ గణపయ్యను గంగమ్మ ఒడికి చేర్చారు. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్దకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో పండుగ వాతావరణం కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ





జై బోలో గణేశ్ మహరాజ్‌కి.. నిమజ్జనం ఊరేగింపులో యువతి ఉత్సాహం

న్యూస్‌రీల్

10న జిల్లా స్థాయి యోగా పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: జిల్లా స్థాయి యోగాసన పోటీలను విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల పదో తేదీన నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి తేజస్వి తెలిపారు. ఆ రోజు ఉదయం ఎనిమిది గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఆర్టిస్టిక్ వ్యక్తిగత, ఆర్టిస్టిక్ జోడి, రిథమిక్ జోడి, సంప్రదాయ ఆసనాల విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల తొమ్మిదో తేదీ లోపు 9642002008, 9493997789లలో సంప్రదించి పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ఉత్సవ ఏర్పాట్లపై ప్రత్యేక బృందం సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై నిర్వహించే దసరా ఉత్సవాల ఏర్పాట్లపై ప్రత్యేక బృందం ఆదివారం సమీక్షించింది. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచన మేరకు ఆదివారం ఈ బృందం ఇంద్రకీలాద్రికి చేరుకుంది. ఈ బృందంతో పాటు దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. తొలుత కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి క్యూలైన్లను పరిశీలించుకుంటూ కొండపైకి చేరుకున్నారు. కెనాల్‌రోడ్డు నుంచి అమ్మవారి దర్శనానికి ఎంత సమయం పడుతుంది.. క్యూలైన్‌లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగుతున్నాయనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ తర్వాత మెట్ల మార్గం, మల్లేశ్వర స్వామి వారి ఆలయం మెట్ల మార్గం ద్వారా కొండ దిగువకు చేరుకున్నారు. దసరా ఉత్సవాలలో సాధారణ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని మంత్రి సూచన మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. సుమారు 3 గంటల పాటు క్షేత్ర స్థాయిలో ఈ బృందం పర్యటించింది. పర్యటనలో గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో మంత్రికి అందజేయనున్నట్లు తెలుస్తోంది.

మటన్ మాఫియా!

మాంసం విక్రయాల్లో వ్యాపారుల మాయాజాలం

- విజయవాడలో బహిరంగంగా నిల్వ మాంసం అమ్మకాలు
- వరుస దాడులు చేస్తున్న అధికారులు
- పెద్ద ఎత్తున దొరుకుతున్న కల్తీ మాంసం
- సంతల నుంచి అనారోగ్యకర, మరణించిన గొర్రెల మాంసాన్ని తరలిస్తున్నట్లు గుర్తింపు
- మాంసం కొనాలంటే భయపడుతున్న ప్రజలు



దుకాణంలో వేట మాంసాన్ని పరిశీలిస్తున్న వెటర్నరీ డాక్టర్ రవిచంద్ర



మాచవరం బీఆర్టీఎస్ రోడ్డులో అధికారులు స్వాధీనం చేసుకున్న కుళ్లిన మాంసం

◆ విజయవాడలోని భూపేష్‌గుప్తానగర్, రాణిగారితోట ప్రాంతాల్లో ప్రజారోగ్య విభాగం అధికారులు గత జూలైలో ఆకస్మిక దాడులు చేశారు. ఇక్కడ కొందరు వ్యక్తులు మాంసాన్ని పెద్ద ఎత్తున నిల్వ చేసి.. చిన్నపాటి హోటళ్లకు, రోడ్ల వెంట చిరు వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. వినుకొండ తదితర ప్రాంతాల్లో జరిగే వారాంతపు సంతల నుంచి అనారోగ్యకరమైన, మరణించిన, గొర్రెలు, మేకలను అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటిని నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు నిర్ధారించారు.

◆ గత నెలలో వన్‌టౌన్ కొత్తపేట హనుమంతరాయ చేపల మార్కెట్‌లో విక్రయదారులు మంచి మాంసంలో, కుళ్లిన మాంసాన్ని కలిపేసి విక్రయిస్తున్నట్లు అధికారుల దాడుల్లో కనుగొన్నారు. పెద్ద ఎత్తున కుళ్లిన కోడి మాంసం, పొట్టేలు తలకాయ, చేపల నిల్వలను గుర్తించారు. వీరు ఇతర ప్రాంతాల నుంచి కుళ్లిన మాంసంలో పేగులు తొలగించి, శుభ్రపరిచి పొట్టలో ఐస్ ఉంచి తీసుకువస్తున్నట్లు నిర్ధారించారు.

◆ నగరంలోని మాచవరం, బీఆర్టీఎస్, ప్రకాశ్‌నగర్‌లో మార్కెట్లలో వెటర్నరీ సర్జన్ డాక్టర్ రవిచంద్ర ఆధ్వర్యంలో అధికారులు ఆదివారం కూడా మాంసం దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఐదు షాపుల్లో 300 కిలోల కుళ్లిన మటన్, చికెన్ ఉన్నట్లు గుర్తించి, దానిని ధ్వంసం చేశారు.

సాక్షి ప్రతినిధి, విజయవాడ: నగరంలో మాంసం దుకాణాల వద్ద మటన్ కొనాలంటే భయపడే పరిస్థితి ఉంది. పండుగ రోజులు, ఆదివారం రోజుల్లో మాంసం ప్రియులు దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. అదే అదునుగా భావిస్తున్న వ్యాపారులు మరణించిన జీవాల మాంసాన్ని, రోజుల తరబడి నిల్వ ఉన్న సరుకును అంటగట్టి ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

నగర పాలక సంస్థ అధికారుల లెక్కల ప్రకారం విజయవాడలో మటన్ విక్రయించే దుకాణాలు 300–400, చికెన్ దుకాణాలు 1300–1500 వరకు ఉన్నాయి. మాంసం అమ్మకాలు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వైద్య పరీక్షలు, పర్యవేక్షణ, వీఎంసీ అధికారిక ముద్రలతో అమ్మకాలు సాగాలి. అయితే కబేళాలో వధించే జీవాల మాంసం కంటే, వ్యాపారులు ఆదివారాల్లో అత్యధికంగా విక్రయాలు సాగిస్తున్నారు. చాలామంది వ్యాపారులు తమ దుకాణాలు, ఇళ్ల వద్దనే జీవాలను వధించి మాంసం విక్రయిస్తున్నారు. ఇటువంటి వాటిలో ఎక్కువ భాగం మరణించిన, రోగాల బారిన పడినవే ఉంటాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలు ప్రాంతాల నుంచి మాంసాన్ని దిగుమతి చేసుకొని పెద్ద ఎత్తున ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచుతున్నారు. వీటితోపాటు తక్కువ వయస్సున్న గేదెలను కోయడంతో అది వేట మాంసమో, బర్రె మాంసమో పసిగట్టలేకపోతున్నారు.

అక్కడి నుంచి తరలింపు..

ఢిల్లీ, బీహార్, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి రైల్వే పార్సిళ్ల ద్వారా విజయవాడ నగరానికి గొర్రె, మేక, తలకాయ కాళ్లు టన్నుల కొద్దీ అక్రమంగా దిగుమతి చేసుకొని.. ఐస్ బాక్స్‌ల్లో నిల్వ ఉంచి, హోటళ్లకు వీటిని విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా మటన్ వ్యాపారులు మాయ చేస్తూ, ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. కల్తీ, కుళ్లిన మాంసం విక్రయాలకు అడ్డుకట్ట వేసే దిశగా అధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిల్వ మాంసంతో అనారోగ్య సమస్యలు



నిల్వ ఉన్న మాంసం తినడం ద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా వాంతులు, విరేచనాలు(డయేరియా) సోకవచ్చు. ఇవి పిల్లలు, వృద్ధుల్లో ప్రాణాంతకంగా మారవచ్చు. నిల్వ ఉన్న మాంసంలో బ్యాక్టీరియాలు వృద్ధి చెందుతాయి. అవి తినడం వల్ల జీర్ణకోశ ఇబ్బందులు తలెత్తుతాయి.

– డాక్టర్ బీఎస్‌వీవీ రత్నగిరి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..



నిల్వ, కుళ్లిన మాంసం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకొంటాం. ప్రజారోగ్యంతో చెలగాటం ఆడేవారిని ఉపేక్షించే పరిస్థితి ఉండదు. ఇందులో భాగంగానే ప్రజారోగ్య అధికారులతో ఆకస్మిక తనిఖీలు చేయిస్తున్నాం. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, సూక్ష్మ పరిశీలన చేసిన తర్వాతే మాంసాన్ని కొనుగోలు చేయాలి.

– స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కమిషనర్, వీఎంసీ

నేషనల్ చాంపియన్‌షిప్‌కు సంపత్



కంకిపాడు: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఈడుపుగల్లు స్విమ్మింగ్ పూల్లో శిక్షణ పొందిన ఈడుపుగల్లు గ్రామానికి చెందిన స్విమ్మర్ జి.సంపత్‌కుమార్ యాదవ్ సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్‌నకు ఎంపికయ్యాడు. ఈ మేరకు రాష్ట్ర క్రీడా ప్రాధికారసంస్థ స్విమ్మింగ్ కోచ్ జి. సురేష్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో ఇటీవల జరిగిన పోటీల్లో నాలుగు బంగారు పతకాలు, ఒక రజత పతకం గెలుపొంది ఉత్తమ ప్రతిభ చూపటంతో సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్‌నకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ జార్ఖండ్‌లో నిర్వహించనున్న సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో సంపత్‌కుమార్ పాల్గొంటాడన్నారు. క్రీడా ప్రాధికారసంస్థ సీఈఓ యు.శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ ఝాన్సీ లక్ష్మి ప్రత్యేకంగా అభినందించారన్నారు.

లైట్‌హౌస్‌లకు కొత్త కాంతి!

- 'సాగరమాల' కింద పర్యాటక అభివృద్ధికి కసరత్తు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యాన ప్రణాళికలు
- ఆంధ్రా తీరంలోని 17 లైట్‌హౌస్‌లకు మహర్దశ
- తూర్పు తీరంలోనే ఎత్తయినది మచిలీపట్నం లైట్ హౌస్



మచిలీపట్నం తీరంలో ఉన్న లైట్‌హౌస్ ప్రధాన ద్వారం

ప్రజలు చూడొచ్చు

విశాఖపట్నం కేంద్ర కార్యాలయం నుంచే లైట్‌హౌస్‌ల కార్యకలాపాలు ఉంటాయి. రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు సందర్శకులకు ప్రవేశం ఉంటుంది. కేంద్ర అధికారుల ఆదేశాలకు అనుగుణంగా లైట్‌హౌస్‌ల వద్ద ఎంతో అప్రమత్తతతో విధులు నిర్వహిస్తాం.

– మనోజ్ హల్దార్, మచిలీపట్నం లైట్‌హౌస్ స్టేషన్ అధికారి

మచిలీపట్నం: సముద్రంలో నౌకాయానానికి దిక్సూచి.. తీరాన్ని గుర్తించేందుకు వేటకు వెళ్లే మత్స్యకారులకు మార్గదర్శి.. అనుమతిలేకుండా వచ్చే బోట్లు, షిప్‌లను గుర్తించి, నౌకాదళ సిబ్బందిని అప్రమత్తం చేసే రక్షణ కవచం.. లైట్‌హౌస్. తీరం వెంబడి దీని సేవలు అమూల్యం. బహుముఖంగా ఉపయోగపడే ఈ లైట్‌హౌస్‌లు త్వరలోనే పర్యాటకంగా కొత్త అందాలను సంతరించుకోనున్నాయి. సాగరమాల ప్రాజెక్టులో భాగంగా తీర ప్రాంతాల్లోని బీచ్‌లు, లైట్‌హౌస్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రణాళికలు రూపొందించి ముందుకెళ్తున్నాయి.

దేశంలో 189 లైట్‌హౌస్‌లు.. రాష్ట్రంలో 17..

దేశంలో 189 లైట్ హౌస్‌లు ఉండగా, ఆంధ్రా తీరంలో 17 లైట్‌హౌస్‌లు ఉన్నాయి. రాష్ట్రంలోని సంతపల్లి, భీమునిపట్నం, డాల్ఫిన్ నోస్, పూడిమడక, పెంటకోట, వాకలపూడి, శాక్రమెంటో, రవ్వ పోర్ట్, అంతర్వేది, మచిలీపట్నం, నాగాయలంక, వాడరేవు, రామాయపట్నం, ఇసకపల్లి, కృష్ణపట్నం, ఆర్మగాన్ తీరంలో లైట్‌హౌస్‌లు ఉన్నాయి. ఇవి విశాఖపట్నం కేంద్ర కార్యాలయ పరిధిలో పని చేస్తాయి. త్వరలోనే ఈ లైట్‌హౌస్‌లు పర్యాటకంగా అభివృద్ధి చెందనున్నాయి.

ఫ్లాష్, కాల వ్యవధితో గుర్తింపు..

సముద్రతీరంలో లైట్‌హౌస్‌లు అన్ని చూడటానికి ఒకేరకంగా ఉంటాయి. కానీ, వాటిలో భిన్నమైన ఏర్పాట్లు ఉంటాయి. లైట్‌హౌస్ వెలువరించే ఫ్లాష్‌ల (లైటు కాంతి) సంఖ్య, కాలవ్యవధి ఆధారంగా అది ఏ తీర ప్రాంతం అనేది గుర్తిస్తారు. సముద్రంపై వేటకు వెళ్లిన, తప్పిపోయిన బోట్లకు సంబంధించిన వారు తమ దగ్గర ఉన్న సెల్‌ఫోన్ సిగ్నల్ అందక, వాతావరణ పరిస్థితులు అనుకూలించని సమయంలో గమ్యస్థానాలకు చేరేందుకు లైట్‌హౌస్‌లు బాగా ఉపయోగపడతాయి. ప్రతి లైట్‌హౌస్‌కు రాడార్ వ్యవస్థను అనుసంధానం చేయడంతో సముద్రంపై తిరిగే అనుమతిలేని బోట్లను గుర్తించి విశాఖపట్నంలో ఉన్న కేంద్ర కార్యాలయానికి సిగ్నల్స్ ఇస్తుంది. తద్వారా భద్రతా దళాలను సకాలంలో అప్రమత్తం చేస్తాయి.

అత్యంత ఎత్తయిన లైట్‌హౌస్





బ్రిటీష్ కాలం నుంచి మచిలీపట్నం ఓడరేవు ద్వారా విదేశాలకు సరుకులను ఎగుమతి చేసేవారు. అప్పట్లో మచిలీపట్నానికి సమీపంలోనే నాగాయలంక మండలం గిలకలదిండి వద్ద లైట్‌హౌస్ నిర్మించారు. అది తక్కువ ఎత్తులో ఉండటంతో 1983లో మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్ వద్ద 50.56 మీటర్లు ఎత్తు(165.879 అడుగులు)లో మరో లైట్‌హౌస్‌ను నిర్మించారు. ఇది తూర్పు తీరంలోనే ఎత్తయిన లైట్‌హౌస్‌గా గుర్తింపు పొందింది. ఇక్కడ మూడు ఫ్లాష్‌లు వస్తాయి. సముద్రంలో 48 కిలోమీటర్ల దూరంలో ఉన్న వారికి కూడా ఇవి కనిపిస్తాయి.

ది. గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., నెం.హెచ్.948

మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ-2

ఎన్నికల కార్యక్రమ ప్రకటన - రూలు 22(3)(ఎ)

జిల్లా కలెక్టర్ / జిల్లా ఎన్నికల అథారిటీ, యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ వారు యన్.టి.ఆర్. జిల్లా విజయవాడ అర్బన్ మండలంలోని ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి. నెం.హెచ్.948, విజయవాడ ఎన్నికల నిర్వహణకు గాను శ్రీ పి. కిరణ్ కుమార్, డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్, విజయవాడ వారిని ఎన్నికల అధికారిగా నియమించినారు.

పైన పేర్కొనబడిన అర్బన్ బ్యాంకునకు ఎన్నికల కార్యక్రమము

1. సంఘము పేరు : ది గాంధీ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., నెం.హెచ్ 948
   కేంద్రకార్యాలయము : మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ-2, యన్.టి.ఆర్. జిల్లా
   తరగతి : ప్రాథమిక సంఘం
   ఎన్నికలు నిర్వహించు విధానము : రహస్య ఓటింగ్ పద్ధతి
2. మొత్తం ఎన్నికలు జరుగు స్థానములు : 12
   షె.కు., షె.తె., వె.త.,స్త్రీలు ఇతరులు : రిజర్వేషన్ లేదు
3. పాలకవర్గ సభ్యుల ఎన్నిక కొరకు : నియోజకవర్గపు వర్గీకరణ లేదు
4. పోలింగ్ జరుగు ప్రదేశము లేదా ప్రదేశములు :

I	విజయవాడ ప్రధాన కార్యాలయం కొత్తపేట, పటమట అజిత్ సింగ్ నగర్ భవాని పురం రామవరప్పాడు సత్యనారాయణ పురం శాఖలకు సంబంధించిన ఓటర్లకు	బిషప్ అజరయ్య పాఠశాల మరియు కాలేజ ఆవరణ యందు వెంకటేశ్వరపురం, విజయవాడ-10
II	ఉయ్యూరు శాఖకు సంబంధించిన ఓటర్లకు	ఉర్దూపాఠశాల, మసీదు ఎదురు రోడ్, ఉయ్యూరు వెస్ట్, ఉయ్యూరు.
III	నూజివీడు శాఖకు సంబంధించిన ఓటర్లకు	శ్రీ ధర్మ అప్పారావు కాలేజ నూజివీడు
IV	మైలవరం శాఖకు సంబంధించిన ఓటర్లకు	ది కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు మైలవరం శాఖ ఆవరణ నందు
V	హనుమాన్ జంక్షన్ శాఖకు సంబంధించిన ఓటర్లకు	ది కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు హనుమాన్ జంక్షన్ శాఖ ఆవరణ నందు
VI	గుంటూరు శాఖకు సంబంధించిన ఓటర్లకు	సెయింట్ ఇగ్నేషియస్ బాలికోన్నత పాఠశాల, 16వ లైన్, అరండల్‌పేట, గుంటూరు

పోలింగ్ జరుగు తేది మరియు సమయము : ది.18.09.2022 ఉ॥ 7.00 గం॥ల నుండి మ॥2.00 గం॥ల వరకు

5. నామినేషన్ పత్రముల స్వీకరణ, సమయము మరియు ప్రదేశము : ది.09.09.2022 ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు, బ్యాంకు ప్రధాన కార్యాలయము, విజయవాడ నందు
6. నామినేషన్‌తో చెల్లించవలసిన రుసుము : షెడ్యూల్ కులములు రూ. 200, షెడ్యూల్ తెగలు రూ.200, వెనుకబడిన తరగతులు రూ.400 (రాయితీ కోరువారు కుల ధృవీకరణ పత్రము విధిగా దాఖలు చేయవలెను.), ఇతరులు రూ.1000
   నామినేషన్ పత్రముల పరిశీలన మరియు సక్రమముగా ఉన్న నామినేషన్ల జాబితా ప్రకటించు తేది : ది. 10.09.2022 ఉ॥10.00 గం॥ల నుండి నామినేషన్ పత్రముల పరిశీలన పూర్తైన పిదప, బ్యాంకు ప్రధాన కార్యాలయము, విజయవాడ నందు
7. నామినేషన్ పత్రముల ఉపసంహరణ జరుగు తేది : ది. 11.09.2022 ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు, బ్యాంక్ ప్రధాన కార్యాలయము, విజయవాడ నందు
8. అంతిమంగా పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన మరియు ఎన్నికల చిహ్నములను కేటాయించు తేది : ది. 11.09.2022 సా॥ 5.00 గం॥ల తరువాత బ్యాంక్ ప్రధాన కార్యాలయము, విజయవాడ నందు
9. పోటీ ఉండి ఎన్నికలు జరిగిన సందర్భములో ఓట్ల లెక్కింపు తేది : ది. 18.09.2022 న పోలింగ్ పూర్తి అయిన పిదప, బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాల, వెంకటేశ్వరపురం, విజయవాడ-10 ఆవరణలో గల తరగతి గది నందు.
10. ఎన్నికల ఫలితములను ప్రకటించు తేది : ది. 18.09.2022 న ఓట్ల లెక్కింపు ముగిసిన పిదప బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాల, వెంకటేశ్వరపురం, విజయవాడ-10 ఆవరణలో గల తరగతి గది నందు
11. పాలక వర్గములో భర్తీ కాని స్థానములకు మరియు ఖాళీ స్థానములకు కో ఆప్షన్ ద్వారా ఎన్నికల అధికారిచే భర్తీచేయుట మరియు కార్యనిర్వాహక సభ్యుల ఎన్నిక జరుగు తేది. : ఎ) 12.09.2022 పోటీ లేనిచో బి) 19.09.2022 పోటీ ఉన్నచో
   సమయము : ఖాళీ స్థానములకు కో-ఆప్షన్ ఉన్నచో ఉదయం 8.00 గం.ల నుండి కో-ఆప్షన్ లేనిచో ఉదయం 9.00 గం.ల నుండి
   ప్రదేశము : ది గాంధీ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి. నెం.హెచ్948, ప్రధాన కార్యాలయం, మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ-2

తేది : 04.09.2022

సం/- పి.కిరణ్ కుమార్
విభాగ సహకార అధికారి, విజయవాడ
ఎన్నికల అధికారి, ది గాంధీ కోపరేటివ్ అర్బన్ బ్యాంకు లి.
నెం.హెచ్.948, విజయవాడ

గమనిక :
1. ఎన్నికల అధికారిచే ప్రకటించబడిన ఓటర్ల జాబితాలోని సభ్యులు మాత్రమే ఓటింగ్‌లో పాల్గొనుటకు అర్హులు
2. సభ్యులు అందరు తప్పనిసరిగా బ్యాంకు వారు జారీ చేసిన గుర్తింపు కార్డు లేక భారత ఎన్నికల సంఘంచే గుర్తించబడిన ఏదో ఒక గుర్తింపు కార్డు పోలింగ్ కేంద్రములో చూపి ఓటు హక్కు వినియోగించుకోగలరు.
3. ఇతర వివరములకు ఎన్నికల అధికారి, ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి. నెం.హెచ్.948, ప్రధాన కార్యాలయం, మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ-2 నందు సంప్రదించవలయును. లేదా గాంధీ బ్యాంకు వారి వెబ్‌సైట్ www.gandhicub.com నుండి పొందగలరు.

మనోబలంతోనే ఆరోగ్యకర జీవనం

- మానసిక ఒత్తిళ్లతో శారీరక సమస్యలు
- హార్మోన్స్‌పై తీవ్ర ప్రభావం
- అదుపులో ఉండని బీపీ, షుగర్
- గుండెజబ్బులు, పక్షవాతానికి దారి తీసే ప్రమాదం



లబ్బీపేట(విజయవాడతూర్పు): మానసికంగా బలంగా ఉన్నప్పుడే ఆరోగ్యకరంగా జీవించగలం... మనసు, ఆలోచనలు అదుపులో ఉంచుకోవడం ద్వారానే ఎవరైనా ప్రశాంతంగా జీవించేందుకు వీలుంటుంది. కానీ నేటి పోటీ ప్రపంచంలో ఉరుకులు, పరుగుల జీవన విధానంలో యంత్రాల్లా మారిన జీవితంలో ప్రతి ఒక్కరూ ఎంతో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. విధి నిర్వహణ, వ్యాపారం, ఉద్యోగరీత్యా ఇలా రకరకాల ఒత్తిళ్లు సహజంగానే ఉంటున్నాయి. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు సైతం ఎక్కువగానే వస్తున్నాయి. తీవ్రమైన ఒత్తిళ్లు చుట్టుముడుతూ మానసికంగా కుంగుబాటుకు గురవుతున్నారు. ఆ ఫలితంగా శారీరక సమస్యలు చుట్టు ముడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. కరోనా సెకండ్‌వేవ్ సమయంలో భయం, ఆందోళన, ఒత్తిడితోనే ఎక్కువ మంది శ్వాస ఇబ్బందులతో మృతి చెందినట్లు వైద్యులు అంటున్నారు.

హార్మోన్స్‌పై ప్రభావం.....

మానసికంగా తీవ్రమైన ఒత్తిళ్లు ఎదుర్కొనే వారిలో డొపమైన్, కార్టిసోల్ అనే హార్మోన్స్ ఉత్పత్తి అవుతాయి. ఇవి మిగతా హార్మోన్స్‌పై ప్రభావం చూపుతాయని వైద్యులు అంటున్నారు. ఆ ఫలితంగా శరీరంలో చక్కెర స్థాయిలు విపరీతంగా పెరిగిపోవడం, అధిక రక్తపోటు వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈటింగ్ డిజార్డర్స్‌తో కొందరు అసలు ఆహారం తీసుకోకపోవడం, మరికొందరు అధిక ఆహారం తీసుకోవడం చేస్తారు. దీంతో కొందరు రక్తహీనత సమస్యలు ఎదుర్కొంటారని, మరికొందరు ఊబకాయులుగా మారుతున్నారు. అంతేకాదు తీవ్రమైన ఒత్తిళ్లు ఎదుర్కొనే వారిలో గ్యాస్ట్రిక్ ప్రాబ్లమ్స్ కూడా వస్తాయి.

గుండె లయ తప్పుతుంది....

తీవ్రమైన ఒత్తిళ్లు ఎదుర్కొనే వారిలో హార్ట్‌బీట్‌లో తేడా వస్తుంది. ఒత్తిడి, ఆందోళన ఎక్కువైన వారిలో ఒక్కోసారి హార్ట్‌రేట్ పెరిగి సడన్ హార్ట్ ఎటాక్‌కు గురయ్యే ప్రమాదమూ లేకపోలేదు. ఒత్తిళ్లతో రక్తపోటు అదుపులో లేని వారిలో హెమరైజ్డ్ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే అవకాశం ఉంది. ఈ తరహా బ్రెయిన్ స్ట్రోక్ ఒక్కోసారి ప్రాణాంతకంగా కూడా మారవచ్చు.

రిలాక్సేషన్ అవసరం....

ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఒత్తిడికి గురికాకుండా, దాని పరిష్కారంపై దృష్టి పెట్టాలి. ఒత్తిళ్లను అధిగమించేందుకు వ్యాయామం, యోగా, మెడిటేషన్ ఉపయోగకరంగా ఉంటాయి. వాటి ద్వారా మన ఆలోచనలను మళ్లించి మనసు రిలాక్సేషన్ కలిగేలా దోహదపడతాయి. ఏదైనా పనిలో ఒత్తిడిని ఎదుర్కొన్నప్పుడు దానికి ఉపశమనం కలిగే మార్గాన్ని అన్వేషించాలి.

మానసిక ప్రశాంతత అవసరం



ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత చాలా అవసరం. ఒత్తిళ్లకు గురైనప్పుడు వ్యాయామం, యోగా, మెడిటేషన్ వంటివి చేయడం ద్వారా ప్రశాంతత లభిస్తుంది. సమస్య ఎదురైనప్పుడు పరిష్కారంపై దృష్టి పెట్టాలి. మానసిక ఒత్తిళ్లు శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. హార్మోన్స్‌పై ఎఫెక్ట్ చూపి షుగర్ లెవల్స్ పెరగడం, రక్తపోటు, హార్ట్‌రేట్‌లో తేడాలు వంటివి చోటుచేసుకుంటాయి. మానసికంగా పటిష్టంగా ఉన్నప్పుడే శారీరకంగా బలంగా ఉంటారు. మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటూ ఆరోగ్యంగా జీవించగలుగుతారు.

– డాక్టర్ వెంకటకృష్ణ,
జనరల్ మెడిసిన్ విభాగాధిపతి జీజీహెచ్

ఏకాగ్రత తగ్గుతుంది



మానసికంగా తీవ్రమైన ఒత్తిళ్లు ఎదుర్కొనే వారిలో ఏకాగ్రత తగ్గుతుంది. ఉద్యోగులైతే పనిమీద, విద్యార్థులైతే చదువుపై దృష్టి పెట్టలేరు. పనిని తర్వాత చేయవచ్చులే అని వాయిదా వేస్తూ ఉండటంతో సోమరితనం పెరిగిపోతుంది. ఇలాంటి వారు ఈటింగ్ డిజార్డర్‌కు గురవుతారు. అసలు ఆహారం తీసుకోకపోవడం, లేకుండా ఎక్కువ ఆహారం తీసుకోవడం చేస్తారు. దీంతో జీర్ణకోశ ఇబ్బందులు తలెత్తుతాయి. మనసు, ఆలోచనలు అదుపులో ఉంచుకోవడం ద్వారా మానసికంగా ఆరోగ్యంగా ఉండొచ్చు.

– డాక్టర్ గర్రే శంకర్రావు,
మానసిక నిపుణులు, విజయవాడ

పిల్లల మానసిక వికాసానికి కృషి చేయాలి

ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

కృష్ణలంక(విజయవాడ తూర్పు): పిల్లల మనో వికాసానికి అడ్డగోడలు లేని సమాజం అవసరమని.. అందు కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం అన్నారు. గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో బాలోత్సవ్ భవన్ ప్రారంభోత్సవం సందర్భంగా అమరావతి బాలోత్సవ్ కార్యదర్శి ఆర్. కొండలరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పిల్లల కోణం నుంచి ప్రపంచాన్ని చూస్తే కలిగే ఆనందం అనిర్వచనీయమని తెలిపారు. వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి భావితరాల సర్వతోముఖాభివృద్ధికి చేస్తున్న కృషి విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులను అర్థం చేసుకునే ప్రయత్నం అత్యవసరమని తెలిపారు. అనుకూలమైన విద్యావిధానం ఉండాలని పేర్కొన్నారు. అమరావతి బాలోత్సవ్ ఆధ్వర్యంలో చిన్నారుల్లో సాంస్కృతిక వికాసానికి చేస్తున్న యత్నం అభినందనీయమని చెప్పారు. ఎంబీ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా ఐదేళ్లుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న అమరావతి బాలోత్సవ్ నూతన భవనం కేంద్రంగా రాష్ట్ర వ్యాప్తంగా కార్యకలాపాలు విస్తరించే ప్రయత్నం చేస్తామన్నారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ కల్పించే రీతిలో సంస్కృతి, సామాజిక, దేశభక్తి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. తొలుత బాలోత్సవ్ గౌరవాధ్యక్షుడు చలువాది మల్లికార్జునరావు నూతన భవనాన్ని ప్రారంభించారు. కొత్తగూడెం బాలోత్సవ్ నిర్వాహకుడు డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు, కాకినాడ క్రియా పిల్లల పండుగ నిర్వాహకుడు జగన్నాథరావు, ఆలపాటి నాగేశ్వరరావు, రమాదేవి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలోనే చెన్నుపాటి గాంధీపై దాడి

- ఇనుప చువ్వలు, రాడ్లతో కొట్టారనేది అవాస్తవం
- చేతులతో కొట్టడంతోనే చెన్నుపాటి కంటిపై గాయం
- నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులోనే ఉన్నాయి
- పోలీస్ కమిషనర్ టీకే రాణా



మాట్లాడుతున్న కమిషనర్ టీకే రాణా

విజయవాడ స్పోర్ట్స్: క్షణికావేశంలోనే చెన్నుపాటి గాంధీపై దాడి జరిగిందని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి వేగంగా దర్యాప్తు చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా స్పష్టం చేశారు. పటమట హైస్కూల్ సమీపంలో శనివారం సాయంత్రం ఈ ఘటన జరిగినట్లు చెప్పారు. దీనిపై సంబంధిత పటమట పోలీస్ స్టేషన్‌లో 326, 506 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేయడమే కాకుండా కొందరు నిందితులను ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసు వివరాలను స్థానిక పోలీస్ కమిషనరేట్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ రాణా వెల్లడించారు. ఘటన జరిగిన వెంటనే ఆ స్థలాన్ని నేర పరిశోధనా బృందాలు హుటాహుటిన వెళ్లి పరిశీలించాయని పేర్కొన్నారు. బాధితుడు చెన్నుపాటి గాంధీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రత్యేక పోలీస్ బృందాలతో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను పరిశీలించామని, అన్ని సాంకేతిక కోణాల్లో పారదర్శకంగా దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. నిందితులు, బాధితులు అనుకోకుండా ఘటనా స్థలంలో ఎదురెదురు పడినట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. ఈ బృందాల మధ్య తొలుత వాగ్వావాదం జరిగినట్లు, ఆ తరువాతనే దాడి జరిగినట్లు ఇప్పటి వరకు తాము చేసిన విచారణలో వెల్లడైందన్నారు. ఇనుప చువ్వలు, రాడ్లతో బాధితుడుపై దాడి జరిగినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు. ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి నుంచి వచ్చిన రిపోర్టు ప్రకారం చేతులతో కొట్టడం వల్లే బాధితుడు కంటికి గాయమైందని తెలిపారు. ఇప్పటి వరకు లభించిన ఆధారాల ప్రకారం ఘటనలో పాల్గొన్న కొందరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేవలం క్షణికావేశంలో జరిగిన ఘటనను కొందరు రాద్ధాంతం చేస్తూ నగర ప్రజలను భయాందోళనకు గుర్తి చేస్తున్నారని చెప్పారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

నగరంలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని, నేరాలు పెరుగుతున్నాయని కొందరు అవాస్తవ ప్రచారం చేయడం తగదన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గడిచిన ఆరు నెలల్లో ఈ ఒక్క ఘటన మాత్రమే జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంటర్ సెప్టీ వాహనాలు 24 గంటలు గస్తీ నిర్వహిస్తున్నాయన్నారు. తాను పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఇప్పటి వరకు 14 మంది రౌడీ షీటర్లను నగర బహిష్కరణ చేశామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో 800 మందికి జైలు శిక్ష పడిందన్నారు.

దుర్గగుడిపై రద్దీ సాధారణం



క్యూలైన్లో వస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం రద్దీ సాధారణంగా ఉంది. వినాయక చవితి ఉత్సవాలకు ఆదివారం కీలకమైన 5వ రోజు కావడంతో భక్తులందరూ స్వామి వారి నిమజ్జనం వేడుకల్లో పాల్గొనడంతో రద్దీ తగ్గినట్లు ఆలయ సిబ్బంది పేర్కొన్నారు. మరో వైపున అమ్మవారి దర్శనం కేవలం పావుగంటలోనే కావడం విశేషం. గడిచిన 8 వారాల్లో ఆదివారం నాడు ఇంత తక్కువ సమయంలో అమ్మవారి దర్శనం పూర్తి కావడం ఇదే ప్రథమం. మరో వైపున ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రద్దీ ఓ మోస్తరుగా కనిపించింది. సర్వ దర్శనం, రూ. 100, రూ. 300 టికెట్లు క్యూలైన్లు చిన్న గాలి గోపురం వరకు కొంచం రద్దీ కనిపించింది. ఇక సాయంత్రం వినాయక విగ్రహాల నిమజ్జనం నిమిత్తం కృష్ణానది తీరానికి విచ్చేసిన భక్తులు నిమజ్జనం అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు గురుపూజోత్సవం

లబ్బీపేట(విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా స్థాయిలో గురుపూజోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలిపారు. బృందావనకాలనీలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే ఈ వేడుకల్లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావుతో పాటు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 24 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేయనున్నట్లు డీఈఓ పేర్కొన్నారు.

పురస్కారాలు వీరికే..

ఉపాధ్యాయుల పేరు	హోదా	పనిచేస్తున్న స్కూల్
నశ్రీన్ జెహాన్	హెచ్ఎం	ఎస్ఎస్ఎంసీ ఉర్దూ స్కూల్, వించిపేట
టి. నాగమల్లేశ్వరి	హెచ్ఎం	కాచవరం ఎంపీపీ స్కూల్
ఎస్‌కే యూసఫ్	హెచ్ఎం	జక్కంపూడి ఎంపీపీ స్కూల్
బి. అమర్ నాయక్	హెచ్ఎం	దొనబండ ఎంపీపీ స్కూల్
ఎస్‌కే సైరున్నీసాబేగం	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్ఎస్, రామవరప్పాడు
ఇంటిరాజు	స్కూల్ అసిస్టెంట్	సీవీఆర్ స్కూల్, గవర్నర్‌పేట
డీవీ మురళీప్రసాద్	స్కూల్ అసిస్టెంట్	డీఎస్ఏ స్కూల్, విజయవాడ
ఏవీబీఎల్ సురేఖ	స్కూల్ అసిస్టెంట్	ఎంసీహెచ్ స్కూల్, అలీపురం
కోనేరు శ్రీదేవి	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్ఎస్, నిడమానూరు
టీవీ సుబ్రహ్మణ్యం	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్ఎస్, తోటరావులపాడు
వై. వెంకట నారాయణ	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్ఎస్, జిజ్జూరు
ఐ. రామయ్య	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్ఎస్, కట్టుబడిపాలెం
జె. ఆనందకుమార్	స్కూల్ అసిస్టెంట్	ఎస్‌కేపీవీవీ స్కూల్, కొత్తపేట
టి. శ్రీదేవి	స్కూల్ అసిస్టెంట్	ఎంపీయూపీ స్కూల్, చిలుకూరు
ఎస్. రాఘవరాజులు	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్ఎస్, చెవుటూరు
ఎస్‌కే మదర్ సాహెబ్	స్కూల్ అసిస్టెంట్	ఎంపీయూపీ స్కూల్, సూరాయపాలెం
బి. బ్రహ్మేశ్వరరావు	డ్రాయింగ్ టీచర్	ఎస్‌కేపీవీవీ స్కూల్, కొత్తపేట
ఎం. లక్ష్మణబాబు	డ్రాయింగ్ టీచర్	నిడమానూరు, జెడ్పీహెచ్ఎస్
ఎస్. కుసుమ	ఎస్జీటీ	జీడీఈటీ ఎంఎస్ స్కూల్
టి. విజయలక్ష్మి	ఎస్జీటీ	ఎంపీయూపీఎస్ వెస్ట్
పి. సుధాకర్	ఎస్జీటీ	కేర్ అండ్ షేర్ విజయవాడ
కె. వెంకటేశ్వరరావు	ఎస్జీటీ	ఎంపీపీ స్కూల్, కీసర
షేక్ సైదా సాహెబ్	ఎస్జీటీ	ఎంకే బేగ్‌స్కూల్ సింగ్‌నగర్
సీహెచ్ శ్రీనివాసరావు	పీఈటీ	మూలపాడు జెడ్పీ స్కూల్

ఆనందాల పింఛను..



విజయవాడ భవానీపురం ప్రాంతంలోని 41వ డివిజన్ , 120వ సచివాలయం పరిధిలో మల్లేశ్వరి అనే మహిళకు పింఛను అందిస్తున్న వలంటీరు బేబీ అరవింద చిత్రమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మామ్మ.. మనువడికి..



విజయవాడ 58వ డివిజన్ 252వ సచివాలయం పరిధి అజిత్‌సింగ్ నగర్‌లో ఒకే ఇంట్లో ఇద్దరు లబ్ధిదారులకు ఆదివారం వలంటీర్ పింఛన్లు పంపిణీ చేశారు. కేవలం ప్రతి నెలా ప్రభుత్వం అందించే పింఛను నగదే ఆధారంగా వీరిద్దరూ బతుకునీడుస్తున్నారు. వృద్ధురాలు కమలమ్మకు, దివ్యాంగుడైన ఆమె మనువడు జోషిబాబుకు వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు అందిస్తున్న చిత్రమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

లారీ ఢీకొని బీటెక్ విద్యార్థి దుర్మరణం



ఘటన స్థలంలో సాయికృష్ణ మృతదేహం

జి.కొండూరు: గుర్తు తెలియని లారీ ఢీకొని బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందిన ఘటన జి.కొండూరు శివారులోని బైపాస్‌రోడ్డుపై ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కొండపల్లి గ్రామానికి చెందిన సాని సాయి కృష్ణ (19) మైలవరం లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితుడు దేవరాజుతో కలిసి ఆదివారం ద్విచక్రవాహనంపై కొండపల్లి బయలుదేరాడు. జి.కొండూరు శివారు బైపాస్‌రోడ్డుపై ఆత్కూరు క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయికృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన స్నేహితుడు దేవరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థిని 108 అంబులెన్స్‌లో విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సాయికృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గాయాలపాలైన దేవరాజు గుంటూరు జిల్లా, క్రోసూరు మండల పరిధిలోని అందకూరు గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి కారణమైన లారీ ఆపకుండా వెళ్లిపోవడంతో ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎస్ఐ ధర్మరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని పాస్టర్ మృతి

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): బైక్ ఢీకొని పాస్టర్ మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... కానూరుకు చెందిన వీరపనేని స్టీవెన్ (66) వెలగలేరులోని ఓ ప్రార్థన మందిరంలో ట్రైనింగ్ సెంటర్ నిర్వహిస్తుంటారు. అక్కడి నుంచి బైక్‌పై ఆదివారం ఇంటికి బయలుదేరారు. స్టీవెన్‌తో పాటు ధనరాజు అనే వ్యక్తి బండిపై ఉన్నాడు. జక్కంపూడి ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్దకు వచ్చే సరికి ఓ బైక్‌పై బాలుడు వేగంగా వచ్చి వీరి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో స్టీవెన్‌కు తీవ్రగాయాలు కాగా అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిపారు. ఘటనపై స్టీవెన్ కుమారుడు పూర్ణ ప్రశాంత్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వరుస విజయాలతో సౌత్ జోన్ దూకుడు



88 రన్స్ చేసిన సౌత్ జోన్ బ్యాట్స్‌మెన్ అభిషేక్‌రెడ్డి

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అంతర్ జోన్(రాష్ట్ర స్థాయి) సీనియర్ పురుషుల వన్డే లీగ్ క్రికెట్ మ్యాచ్‌లలో సౌత్ జోన్ జట్టు వరుస విజయాలను సాధిస్తోంది. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని ఏసీఏ మైదానంలో ఆదివారం సెంట్రల్ జోన్ జట్టుతో తలపడి ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ నెల 3వ తేదీ శనివారం నార్త్ జోన్ జట్టుపై ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే.

ఎనిమిది వికెట్ల తేడాతో సౌత్ జోన్ విజయం..

సౌత్ జోన్, సెంట్రల్ జోన్ జట్ల మధ్య ఆసక్తికరమైన పోరు కొనసాగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సెంట్రల్ జోన్ నిర్ణీత 50 ఓవర్లకు ఏడు వికెట్లు నష్టపోయి 202 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్‌లు షేక్ రషీద్ (105 బాల్స్, 69 రన్స్, 4ఫోర్లు, 2సిక్స్‌లు), వై సందీప్ (72 బాల్స్, 52రన్స్, 2ఫోర్లు, 1సిక్స్) అర్థ సెంచరీలు సాధించారు. సౌత్ జోన్ బౌలర్ సోయబ్ రెండు కీలకమైన వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టు స్కోరును కట్టడి చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో సౌత్ జోన్ జట్టు 33.4 ఓవర్లకు కేవలం రెండు వికెట్లు నష్టపోయి 205 పరుగులు చేసి ఎనిమిది వికెట్ల తేడాతో భారీ విజయం సాధించింది. బ్యాట్స్‌మెన్‌లు అభిషేక్‌రెడ్డి 89 బంతులకు 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 88 పరుగులు, కరణ్‌షిండే 56 బంతులకు 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 52(నాటౌట్) పరుగులు చేయడంతో ఎనిమిది వికెట్ల తేడాతో జట్టు సునాయాసంగా విజయం సాధించింది.

క్లుప్తంగా

మహిళా సాధికారతకు కృషి

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడ పశ్చిమ): మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అన్నిరంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పశ్చిమ సిటీ ద్వితీయ మహాసభ ఆదివారం విద్యాధరపురం లేబర్‌కాలనీలోని రాయల్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జరిగింది. ఆమె మాట్లాడుతూ మహిళలు లేనిదే సమాజం మనుగడ లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మహిళలను చైతన్యవంతులు చేశారని తెలిపారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, సంగ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు విక్రం లక్ష్మి, స్వప్న, పద్మ, అంగన్‌వాడీల నాయకురాలు సుప్రజ, పలువురు మహిళలు పాల్గొన్నారు. తొలుత ఐద్వా జండాను ఐద్వా పశ్చిమ సిటీ గౌరవాధ్యక్షురాలు కుండనాల శేషమణి ఆవిష్కరించారు. సంఘ పశ్చిమ సిటీ నూతన కమిటీని నియమించారు. నూతన అధ్యక్షురాలిగా కుండనాల శేషమణి, కార్యదర్శిగా గాదే ఆదిలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా స్వప్న, వరలక్ష్మి, వెంకటరత్నం, జయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా విక్రం లక్ష్మితోపాటు మరో ఎనిమిది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

అరాచకాలను సృష్టించడమే జనసేన లక్ష్యం

– వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): అరాచకాలను సృష్టించడమే జనసేన నేతల లక్ష్యమని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. 53వ డివిజన్‌లో జనసేన నాయకులు చేసిన చర్యలను ఖండిస్తూ స్థానిక కార్పొరేటర్ మహాదేవ అప్పాజీరావు కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాను గతంలో ప్రజారాజ్యంలో ఉన్నప్పుడు రాయల్‌హోటల్ సెంటర్‌లో జెండా ఏర్పాటు చేశానన్నారు. వైఎస్సార్ సీపీలోకి వచ్చిన తర్వాత దాన్ని పట్టించుకోలేదన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఆ దిమ్మెపై జాతీయ జెండా ఎగరేశానని తెలిపారు. ఈ నెల రెండో తేదీన జనసేన నేతలు ఆ జెండా దిమ్మె మాది అంటూ రంగులు వేసి అరాచకం సృష్టించారన్నారు. జెండా వైపు చూస్తే ఇంటికి వచ్చి కొడతామంటూ మీడియా సమావేశంలో బెదిరించారని, రౌడీయిజం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో శ్రీశైలం దేవస్థానం డైరెక్టర్ గురు మహంతు మహేష్, పార్టీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షులు రియాజ్, రహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

17న విశ్వబ్రాహ్మణ సంఘం స్కాలర్‌షిప్‌లు



దరఖాస్తులను అందిస్తున్న తోలేటి శ్రీకాంత్

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ) : విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 17వ తేదీన విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లను అందించనున్నామని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం బ్రహ్మశ్రీ టేకీ నరసింహాచార్యులు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా స్కాలర్‌షిప్‌లను అందిస్తామన్నారు. అందులో భాగంగా ఆదివారం సంఘ కార్యాలయంలో దరఖాస్తుల పంపిణీని ప్రారంభించారు. టేకీ నరసింహాచార్యులకు నివాళులర్పించారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ విద్యార్థినీ విద్యార్థినులకు ఏటా విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమాన్ని సంఘ అధ్యక్షులు గొర్తి శ్రీనివాస చక్రవర్తి నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో నాగాచారి, జవ్వాది సుధీర్, చిట్టూరి హరీష్, వెంకటేశ్వరరావు, సున్నపు భ్రమరాంబ, వేముల రేణుక, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): వెంకటేశ్వరనగర్ భక్తబృందం ఆధ్వర్యాన వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. చిన్నారి కూనపురెడ్డి శ్వేత చేసిన కూచిపూడి నృత్యాలు వీక్షకులను భక్తితన్మయత్వంలో ముంచెత్తాయి. కార్యక్రమాలను భక్తబృందం సభ్యులు నాగరాజు, సాయి తదితరులు పర్యవేక్షించారు.

ప్రత్యేకపూజలు

మధురానగర్ హనుమంతరావు వీధి, అయోధ్యనగర్ ఇందిరా ఎన్‌క్లేవ్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు మహిళలు చేసిన కోలాట ప్రదర్శన చూపరులను ఆకట్టుకున్నాయి.

దశాబ్దాలుగా గణపతి ఉత్సవాలు


60 ఏళ్లుగా పలు సంస్థల ఆధ్వర్యాన పాతబస్తీలో ఉత్సవాలు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ) : నగరంలోని పాతబస్తీలో సుమారు 60 ఏళ్లుగా వివిధ సంఘాల ఆధ్వర్యాన వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పాతబస్తీ అంటే ఇరుకు వీధులు, వేలాది వ్యాపార సంస్థలు కనిపిస్తుంటాయి. చవితి వేడుకలకు మాత్రం పాతబస్తీలో ఎటు చూసినా గణపతి ఉత్సవాలే దర్శనమిస్తాయి. కొత్త రాష్ట్రంలో భారీగా గణపతి ఉత్సవాలను విజయవాడ పాతబస్తీలోనే నిర్వహించడం విశేషం. ఏటా వినాయక చవితి వేడుకల్లో భాగంగా పండుగ నుంచి 11 రోజుల పాటు పాతబస్తీలోని ప్రముఖ కూడళ్లు పండుగ వాతావరణంతో కళకళలాడుతూ ఉంటాయి. 'పశ్చిమ'లో సుమారు వందకుపైగా హోల్‌సేల్ సంఘాలు కొనసాగుతున్నాయి. ఇవి కాకుండా స్థానిక వ్యాపార, మిత్ర బృందాలు సైతం దశాబ్దాలుగా చవితి వేడుకలను భారీ ఉత్సవంగా నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ తర్వాత ఆ స్థాయిలో విజయవాడలోనే వినాయకచవితి వేడుకలు భారీగా జరుగుతుంటాయి.

సుమారు ఆరు దశాబ్దాలుగా

పాతబస్తీలో సుమారు ఆరు దశాబ్దాలుగా గణపతి ఉత్సవాలను క్రమంతప్పకుండా పలు సంస్థలు కొనసాగిస్తున్నాయి. వస్త్ర వ్యాపారానికే కేంద్రమైన పాతబస్తీలో 55 ఏళ్ల పైనుంచి గణపతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అయితే కరోనా సమయంలో మాత్రం ఉత్సవాలను ఆపారు.

ఇక్కడ 60వ దశకం నుంచి ఉత్సవాలను క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నిర్వహిస్తోంది. పాతబస్తీలో మరో ప్రముఖ ఉత్సవ కమిటీ పూలబావి వీధిలోని పాలకవర్గం. ఇక్కడ 56 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ రెండు తరాలకు చెందిన పెద్దలు ఉత్సవ బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు స్థానికంగా ఉంటున్న మూడో తరం నిర్వాహకులుగా మారారు. అక్కడే వ్యాపార కేంద్రాలైన మెయిన్‌బజార్, శివాలయంవీధి, గుడివాడవారివీధి తదితర ప్రాంతాల్లోని వివిధ సంఘాలు సైతం నాలుగున్నర దశాబ్దాలుగా ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి. కందులవారి వీధిలోని గణేష్ ఉత్సవ సమితి (మార్వాడీ సంఘం), కొత్తగుళ్ల సమీపంలోని బాలగణపతి సేవా సమితి తదితర సంఘాలు సైతం సుమారుగా మూడున్నర దశాబ్దాలుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నాయి. సమ్మెటవారి వీధిలోని శ్రీ బాలవిఘ్నేశ్వర భక్త బృందం పాతికేళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



వస్త్రలత ప్రాంగణంలో గణపతి



మార్వాడీ సంఘం ఆధ్వర్యంలో విఘ్నాధిపతి

పోటాపోటీగా నిర్వహణ

గణపతి ఉత్సవాల నిర్వాహకులు పోటాపోటీగా ఏర్పాట్లు చేస్తూ అందరినీ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏటా ఏదొక కొత్త అంశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది పూలబావి వీధిలో కూల్‌డ్రింక్స్‌తో ప్రత్యేకంగా వినాయకుడిని ఏర్పాటు చేశారు. సమ్మెటవారి వీధిలో అమరనాథ్ సెట్ వేశారు. వస్త్రలతలో ప్రత్యేకంగా పుష్పాలతో గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కొత్తగుళ్ల సమీపంలో కైలాసంలో శివపార్వతులకు ప్రదక్షిణ చేస్తున్న గణపతిని ఏర్పాటు చేశారు.

పాతబస్తీలో ఉత్సవాలు ఆనవాయితీ



పాతబస్తీలో ఉత్సవాలను ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. గొప్ప ఆనవాయితీని మా తరం కొనసాగించటం ఆనందంగా ఉంది. దీంతో ఆధ్యాత్మిక చింతన, ప్రజల మధ్య స్నేహబంధాలు బలపడతాయి.

మరుపిళ్ల రాజేష్, ఉత్సవ నిర్వాహకుడు

వస్త్రలతలో ఏటా మాకు గొప్ప పండుగ



వస్త్రలత ప్రాంగణంలో ఏటా గణపతి ఉత్సవాలు నిర్వహించటం గొప్ప అదృష్టంగా భావిస్తాం. మా పూర్వీకులు మంచి సంప్రదాయాన్ని ఏర్పాటు చేసి వెళ్లారు. దాన్ని 55 సంవత్సరాలుగా కొనసాగిస్తున్నాం. పాతబస్తీలో ప్రధాన కూడలి కావటంతో భారీగా ప్రజలు వస్తుంటారు.

– పోకూరి రమేష్, వస్త్ర వ్యాపారి

వన్‌టౌన్‌లో 'చవితి' కోలాహలం



కొత్తపేటలో విగ్రహ ఊరేగింపులు



క్రేన్ ద్వారా విగ్రహాలను నీటిలో విడిచిపెడుతున్న సిబ్బంది,



విగ్రహాలతో నది వద్దకు వస్తున్న నగరవాసులు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): చవితి వేడుకల్లో భాగంగా ఆదివారం వినాయక నిమజ్జనాలు కోలాహలంగా జరిగాయి. గణనాథుల భారీ ఊరేగింపులు నిర్వహించారు. మేళతాళాలు, చిత్ర విచిత్ర వేషధారణలు గణపతి నిమజ్జన ఊరేగింపులు వన్‌టౌన్‌వాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కొత్తపేట, బ్రాహ్మణవీధి, కొండ ప్రాంతాలు, ఇస్లాంపేట, తారాపేట తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పందిళ్ల నిర్వాహకులు గణపతి ఉత్సవాలను ఆదివారం ముగించారు. అనంతరం గణపతి విగ్రహాలను కృష్ణానదికి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కేటీరోడ్డు, బ్రాహ్మణవీధి, మెయిన్‌బజార్, నెహ్రూబొమ్మ సెంటర్, రథం సెంటర్, కెనాల్‌రోడ్డు తదితర ప్రాంతాలు భక్తజనంతో కిటకిటలాడాయి. ఊరేగింపులను ముందుకు కొనసాగిస్తూ నదివద్ద ఉన్న సిబ్బందితో సమన్వయం చేశారు.

అంతటా నిమజ్జన హుషారు

చవిత వేడుకల్లో భాగంగా నగరంలో ఆదివారం విగ్రహ నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. చవితి పందిళ్ల నుంచి వినాయక విగ్రహాలను ఊరేగింపులుగా కృష్ణమ్మ చెంతకు చేర్చారు. విగ్రహాలను క్రేన్లలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వేడకల్లో జన జాతరై మెరిసింది.. భక్తిభావం మురిసింది.. ఉత్సాహం ఉరకలెత్తింది.. డప్పువాయిద్యాలు, నృత్యాల జోరు నడుమ ఆధ్యాత్మిక కొలువైంది. జైజై గణేశా.. బైబై గణేశా అంటూ భక్తజనం గౌరీపుత్రుడికి వీడ్కోలు పలికారు.

–సాక్షిఫొటోగ్రాఫర్, విజయవాడ











పార్కు ఆహ్లాదానికి మార్కు

నగరంలోని రాఘవయ్య పార్కుకు అదనపు హంగులు సమకూర్చడంతో సందర్శకులతో కళకళలాడుతోంది. ఆదివారం పార్కుకు పెద్ద సంఖ్యలో సందర్శకులు వచ్చారు. పిన్న, పెద్దల ఆట పాటలు.. ఉత్సాహం ఉరకలేయడంతో.. పార్కు ఆహ్లాదానికి బాటైంది. ఆట పరికరాల వద్ద పిల్లలు సందడి చేశారు.



–సాక్షిఫొటోగ్రాఫర్, విజయవాడ







ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు, పైనుంచి కృష్ణమ్మకు వరదనీరు వస్తోంది. వరదనీటితో పాటు కొట్టుకొచ్చిన గుర్రపుడెక్క పున్నమిఘాట్ వద్ద పేరుకుపోయింది. దీంతో వీఎంసీ సిబ్బంది ఆదివారం గుర్రపుడెక్క తొలగిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

తోటివారికి సాయపడటం సామాజిక బాధ్యత

మధురానగర్(విజయవాడ సెంట్రల్): తోటివారికి సాయపడటం సామాజిక బాధ్యతని లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు సూచించారు. మాచవరంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ అంజలి, అండ్ దుర్గా తేజ క్లబ్‌ల ఇన్‌స్టలేషన్ కొల్లూరి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో కొత్తగా చేరిన సభ్యులను అభినందించారు. అనంతరం సామాజిక బాధ్యతగా స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి వీల్‌చైర్ అందజేశారు. కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ కె.మల్లీశ్వరి, నాయకులు వీరంకి గోకర్ణేశ్వరరావు, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, మండా రాము, కె.రాము, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆస్పత్రికెళ్లి పింఛన్ అందజేత

మధురానగర్(విజయవాడ సెంట్రల్): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజనాల నాంచారమ్మకు ఆదివారం 200వ సచివాలయం వలంటీర్ భాగ్యలక్ష్మి పింఛన్ అందజేశారు. వలంటీర్ భాగ్యలక్ష్మిని 27వ డివిజన్ కార్పొరేటర్ కె.మల్లీశ్వరి అభినందించారు.

విశ్వరూప గణపతిగా బాలగణపతి



కృష్ణానది నుంచి పవిత్ర జలాలను తీసుకొస్తున్న 108 మంది మహిళలు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): పాతబస్తీలోని బాలగణపతి విశ్వరూప గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఆదివారం పవిత్ర కృష్ణాజలాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. వన్‌టౌన్ పూజారివారి వీధిలోని బాలగణపతిస్వామి దేవస్థానంలో జరుగుతున్న నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 108 మంది మహిళలు కలశాలను తీసుకొని కృష్ణానది నుంచి పవిత్ర జలాలను మేళతాళాలతో తీసుకొని వచ్చారు. అనంతరం స్వామి వారిని అభిషేకించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారు ఆదివారం విశ్వరూప గణపతి (మహాగణపతి) అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

■ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణ ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో భగవద్గీత 18 అధ్యాయాల పారాయణం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు గ్రంధి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మామిడి వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



విశ్వరూప గణపతిగా బాలగణపతి దర్శనం

మిథిలానగర్‌లో లక్ష్మీగణపతి, చండీ హోమాలు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యాధరపురం సితార సెంటర్‌లో మిథిలానగర్ అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం లక్ష్మీ గణపతి, చండీ హోమం, లక్ష కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. పిళ్లా విజయ్ లోకేష్ (చిన్ని),కుమార్, నవీన్ దంపతులతోపాటు 60 మంది కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఉదయం 10గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 5 గంటలకు స్వామివారి ఊరేగింపు ప్రారంభమై ప్రధాన వీధుల్లో సాగి కృష్ణానదిలో స్వామి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

భవానీపురం శివాలయం రోడ్డులో

స్థానిక టీచర్స్ కాలనీలోని శివాలయం రోడ్డులో గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శేఖర్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన వినాయకచవితి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం 5 గంటలకు నిమజ్జనోత్సవం సాగింది.



మిథిలానగర్‌లో జరుగుతున్న హోమం



శివాలయం రోడ్డులో అన్నదానం

వెండితెర వెలుగులు అక్కినేని, ఎన్టీఆర్



సుధారాణి, భార్గవ్‌ను సత్కరిస్తున్న విజయలక్ష్మి, రమాసత్యనారాయణ

విజయవాడ కల్చరల్: వెండితెర వెలుగులు అక్కినేని నాగేశ్వరరావు, ఎన్టీ రామారావు అని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య- సాంస్కృతిక కళాపీఠం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలుగు చిత్రసీమ వెలుగులు ఎన్టీఆర్, ఏన్నార్ శతజయంతి వేడుకల ప్రారంభ సభ, సినీ సంగీత విభావరి, వివిధ రంగాల వారికి ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని ఆదివారం గాంధీనగర్ హనుమంతరాయా గ్రంథాలయంలో నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లా పోరాటల పురిటిగడ్డ అని కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఎందరో మహనీయులు మనకు కనిపిస్తారన్నారు. శాతవాహన కళాశాల కరస్పాండెట్ నిడుమోలు రమా సత్యనారాయణ మాట్లాడుతూ మహానటుల శత జయంతి వేడుకలను కళా సంస్థలు కలసి నిర్వహించాలని సూచించారు. గాయని సుధా శ్రీనివాస్, సంఘ సేవకుడు వై.భార్గవ్‌ను నిర్వాహకులు సత్కరించారు. డాక్టర్ భాగ్యశ్రీ,విష్ణుప్రియ, ఎం.కృష్ణకుమారి, వడ్డాది కామేశ్వరి, డేవిడ్ రాజు దేశ భక్తి గీతాలు, అక్కినేని, రామారావు నటించిన పలు చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్‌రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభల శ్రీనివాస్, మట్టాశేషు, నారాయణ, పైడిపాటి వెంకన్న పాల్గొన్నారు.

ఏఎంసీ సేవలు అమూల్యం

– ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



తోపుడు బండిని అందజేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, కార్పొరేటర్ షాహీనా సుల్తానా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): పేద ముస్లింల అభ్యున్నతికి, ముస్లిం మైనార్టీల హక్కుల సాధనకు ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. ఏఎంసీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్‌కు చెందిన నిరుపేద ముస్లిం కుటుంబానికి చెందిన మస్తాన్ షరీఫ్ జీవనాధారం కోసం ఆదివారం ఎమ్మెల్సీ రుహుల్లా తోపుడు బండిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల నిజమైన అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మాత్రమే సాధ్యమైందన్నారు. ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్‌మీరా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల పక్షపాతిగా ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలుస్తామన్నారు. 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, ఏఎంసీ నాయకులు షేక్ సాజిద్ అలీ, హిమావలి, కాలేషా, మౌలాలి, జిలాని తదితరులు పాల్గొన్నారు.

5 నెలల్లో పేదలకు రూ.3,400 కోట్ల ఉపాధి

గ్రామాల్లో వలసల్లేకుండా పేదలకు పనుల కల్పనలో ఏపీది రెండోస్థానం

- ఏప్రిల్–ఆగస్టు మధ్య 40.36 లక్షల కుటుంబాలకు 16.56 కోట్ల పనిదినాలు
- ఒక్కొక్క కుటుంబానికి సరాసరి రూ.8,425 లబ్ధి
- 33 శాతం మేర ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకే ప్రయోజనం

సాక్షి, అమరావతి: ఈ ఏడాది ఏప్రిల్–ఆగస్టు నెలల మధ్య ఐదునెలల్లో రాష్ట్రమంతటా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పనుల కల్పన ద్వారా ప్రభుత్వం పేదలకు రూ.3,400.46 కోట్ల లబ్ధి కలిగించింది. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని రోజు సైతం పనుల కోసం ఎవరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా ఆ గ్రామంలోనే అడిగిన వారికల్లా పనులు కల్పించింది. రాష్ట్రంలో దాదాపు 98 లక్షల కుటుంబాలున్నాయి. వీటిలో 40.36 లక్షల కుటుంబాలు ఈ ఐదునెలల్లో సొంత ఊళ్లోనే ఉపాధిహామీ పథకంలో పనులు చేసుకున్నాయి. ఒక్కో కుటుంబం సరాసరి రూ.8,425 చొప్పున ప్రయోజనం పొందింది. 40.36 లక్షల కుటుంబాలకు చెందిన 65.74 లక్షలమంది కూలీలు 16.02 కోట్ల పనిదినాలపాటు ఈ పథకంలో పనిచేసుకుని లబ్ధిపొందారు. అందులో అత్యధికంగా 23.71 శాతం మేర ఎస్సీ కుటుంబాల వారున్నారు. ఈ పనులతో 9.44 శాతం ఎస్టీ కుటుంబాలు లబ్ధిపొందాయి. ఉపాధిహామీ పథకం ద్వారా పేదలకు పనుల కల్పనలో దేశంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. మన రాష్ట్రంతో పోలిస్తే మూడురెట్ల కన్నా ఎక్కువ ఉండే ఉత్తరప్రదేశ్ దేశంలోనే అత్యధికంగా ఈ ఏడాది ఏప్రిల్–ఆగస్టు మధ్య 17.73 కోట్ల పనిదినాలు కల్పించి రూ.3,818 కోట్ల మేర పేదలకు లబ్ధికలిగించింది. ఇదే కాలంలో మన రాష్ట్రం 16.56 కోట్ల పనిదినాలపాటు పేదలకు పనులు కల్పించి రూ.3,400.46 కోట్ల ప్రయోజనం చేకూర్చి రెండోస్థానంలో ఉంది.

ఏప్రిల్–ఆగస్టు మధ్య పేదలకు అత్యధికంగా ఉపాధి పనులు కల్పించిన పది రాష్ట్రాలు



రాష్ట్రం	ఉపాధి కల్పించిన పనిదినాలు
ఉత్తరప్రదేశ్	17,73,68,042
ఆంధ్రప్రదేశ్	16,56,94,417
రాజస్థాన్	16,41,92,685
బిహార్	14,86,18,130
తమిళనాడు	14,02,93,504
మధ్యప్రదేశ్	12,12,79,162
తెలంగాణ	9,63,93,698
ఒడిశా	8,98,55,066
కర్ణాటక	6,91,96,626
మహారాష్ట్ర	4,43,55,181

చంద్రగిరిలో వైభవంగా గురు పూజోత్సవం



టీచర్లను సన్మానిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, ప్రశాంతిరెడ్డి



పెద్ద ఎత్తున హాజరైన ఉపాధ్యాయులు

- 1,150 మంది ఉపాధ్యాయులకు సన్మానం
- ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ

తిరుపతి రూరల్ : తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో ఒక రోజు ముందుగానే గురుపూజోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో ఆదివారం ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని 1,150 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను జ్ఞాపిక, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి పాల్గొన్నారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ఆరంభించి.. రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు. వేలాది కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మానవీయ విలువలతో కూడిన బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. చెవిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లోనే చదివి ఈ స్థాయికి చేరుకున్నామని, తమ ఉన్నతికి బాట వేసిన బడులకు సేవ చేయాలనే.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు మీద గత 12 ఏళ్లుగా గోల్డ్ మెడల్స్, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లను అందించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జేసీ బాలాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● తెలంగాణ

అంతా కలిసి బీజేపీ, మోదీని గద్దె దించాలి

సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభల్లో డి.రాజా

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మతోన్మాద, నియంతృత్వ బీజేపీని, ప్రధాని నరేంద్ర మోదీని వచ్చే ఎన్నికల్లో గద్దె దించడమే భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న లౌకిక, ప్రజాస్వామ్య శక్తులతో పాటు బీజేపీ వ్యతిరేక ప్రాంతీయ పార్టీలు ఇందుకు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. భారత దేశ ప్రజల ఉజ్వల భవిష్యత్తు ఎర్రజెండాతోనే సాధ్యమని చెప్పారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభలు ఆదివారం శంషాబాద్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఎనిమిదేళ్ల మోదీ పాలనలో దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని రాజా చెప్పారు. ప్రభుత్వ సంస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని, ఉపాధి అవకాశాలు కోల్పోయి కార్మికులు, యువత పెద్దెత్తున రోడ్డున పడాల్సి వచ్చిందని అన్నారు. ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ద్రవ్యోల్బణం మండిపోతోందని, రూపాయి విలువ పతనమై, అన్ని రంగాలు సంక్షోభంలో కూరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అంతరాలు విపరీతంగా పెరిగిపోయాయని, ఒకవైపు అదానీ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద సంపన్నుడిగా ఎదిగిపోయాడని, మరోవైపు ప్రజలు ఆకలి పోరాటం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నష్టాల పేరుతో రూ.వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ సంస్థలను అంబానీ, అదానీ సంస్థలకు చౌకగా కట్టబెట్టారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన సంస్థలను మోదీ నిర్వీర్యం చేస్తున్నారని, ప్రతిపక్ష పార్టీలపై ఐటీ, ఈడీ సంస్థలను ఉసిగొల్పుతున్నారని పేర్కొన్నారు.

ఈ లిక్కర్ బ్రాండ్లు టీడీపీవి కావా..!

▶ మొదటి పేజీ తరువాయి

ఏ పార్టీలో ఉన్నారు? ఆయన టీడీపీ నాయకుడు కాదా?

- ▲ విశాఖ డిస్టిలరీకి 2019 ఫిబ్రవరి 25న అనుమతి ఇచ్చారు. అది టీడీపీ నేతఅయ్యన్నపాత్రుడికి చెందిన కంపెనీ. దాన్ని గత ఏడాది అమ్మేశానని ఆయన చెబుతున్నారు. అంటే ఏడాది క్రితం వరకు అది అయ్యన్నదే కదా? ఎన్నికల ముందు ఆ కంపెనీకి చంద్రబాబు అనుమతి ఇచ్చారా? లేదా?
- ▲ పీఎంకే డిస్టిలరీ యనమల రామకృష్ణుడి వియ్యంకుడిది కాదా? శ్రీకృష్ణా డిస్టిలరీ ఆది కేశవులునాయుడిది కాదా? లైసెన్సులు ఇచ్చింది చంద్రబాబు.. బ్రాండ్లకు అనుమతి ఇచ్చినది ఆయన హయాంలోనే. లిక్కర్ విక్రయాలను ఆకాశానికి పెంచింది చంద్రబాబే. ఈ అనుమతులన్నీ బీ–3 వల్లే వచ్చాయి. టీడీపీ నేతలు ఈ అనుమతుల కోసం లంచాలు ఎవరికి ఇస్తారు?

మద్యం వినియోగం తగ్గింది..

- ▲ లిక్కర్ సేల్స్ పెంచితే కమీషన్లు వస్తాయి గానీ తగ్గిస్తే ఎవరైనా ఇస్తారా? బెల్ట్ షాపుల్ని రద్దు చేసి, బార్ లైసెన్సుల్ని 33 శాతం తగ్గించి, పర్మిట్ రూముల్ని మూసి వేయించి, ప్రభుత్వ దుకాణాల ద్వారా ఇప్పుడు పరిమితంగా లిక్కర్ అమ్ముతున్నారు. ఇలా విక్రయాలు గణనీయంగా తగ్గిపోయిన పరిస్థితుల్లో ఎవరైనా కమీషన్లు ఇస్తారా?
- ▲ రాష్ట్రంలో మద్యం వినియోగం ఎంతగా తగ్గిందో అందరికీ తెలుసు. 2018–19లో లిక్కర్ అమ్మకాలు 384.31 లక్షల కేసులు ఉంటే 2021–22లో ఏకంగా 278.5 లక్షల కేసులకు తగ్గాయి. ఇదే సమయంలో బీరు అమ్మకాలు 277.10 లక్షల కేసుల నుంచి గణనీయంగా 82.6 లక్షల కేసులకు తగ్గిపోయాయి.
- ▲ 2018–19లో మద్యం విక్రయాల ఆదాయం రూ.20,128 కోట్లు కాగా 2021–22లో ఆదాయం రూ. 25,023 కోట్లు ఉంది.
- ▲ 43 వేలకు పైగా బెల్టుషాపులను రద్దు చేశాం. పర్మిట్ రూమ్‌లన్నీ రద్దు చేశాం. 4,380 నుంచి 2,934కి వైన్ షాప్‌లను తగ్గించాం.
- ▲ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో షాపులుంటే విచ్చలవిడిగా మద్యం విక్రయించి బెల్టుషాపులు కూడా ఏర్పాటు చేస్తారు కాబట్టి ప్రభుత్వమే పరిమితంగా నిర్ణీత వేళల్లో విక్రయాలు చేపట్టింది.
- ▲ నాటు సారా తయారీ, అమ్మకాలపై గట్టి నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశాం. ఎస్ఈబీ ద్వారా ఎక్కడికక్కడ దాడులు చేస్తూ కఠినంగా వ్యవహరిస్తున్నాం.

ఆ దోపిడీ.. బీ–3 కుంభకోణాలే

- ▲ ఇసుక అమ్మకాల్లో ఇప్పుడు రూ.4,000 కోట్లు వస్తుంటే... గత ప్రభుత్వంలో ఈ డబ్బంతా ఏమయిందన్న ప్రశ్నకు సమాధానం బీ–3 కుంభకోణం.
- ▲ మైనింగ్ దోపిడీ ఎలా జరిగిందన్న ప్రశ్నకు సమాధానం బీ–3 కుంభకోణాలు.
- ▲ దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ) అన్నదే టీడీపీ విధానం. దుష్ట చతుష్టయంలోని ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5, దత్త పుత్రుడికి ఎప్పటికప్పుడు వాటాలు.
- ▲ టీడీపీ అంటేనే డీపీటీ. లంచాలకు ప్రతిఫలంగానే అనుకూల పత్రికలు, టీవీల్లో ఎల్లో ప్రచారాలు. ఈ కుంభకోణంపై న్యాయ విచారణ చేయాలి.

డిస్టిలరీల ఓనర్లు పచ్చబాబులే

- ▲ భవిష్యత్తులో ఏర్పడే మద్యం డిమాండ్‌కు అనుగుణంగా అంటూ చంద్రబాబు హయాంలో విచ్చలవిడిగా లైసెన్స్‌లు ఇచ్చారు. అదీ దిగిపోయే ముందు! లిక్కర్ తయారీదార్లు, డిస్టిలరీ ఓనర్లు పచ్చబాబులే.
- ▲ 2019 తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్క డిస్టిలరీకి కానీ, ఒక్క బ్రూవరీకి కానీ అనుమతి ఇచ్చిందే లేదు.
- ▲ రాష్ట్రంలో 20 డిస్టిలరీలు ఉండగా వాటికి అనుమతులు ఎప్పుడు వచ్చాయో గమనిస్తే ఆశ్చర్యం కలిగించే విషయాలు తెలుస్తాయి. 1982కి ముందు ఉన్నవి కేవలం ఐదు డిస్టిలరీలే. ఆ తర్వాతే మిగిలినవన్నీ వచ్చాయి. యాజమాన్యం మారిన రెండు కంపెనీలతో కలిపి చంద్రబాబు హయాంలో అనుమతి ఇచ్చినవి మొత్తం 14. చంద్రబాబు 2014 నుంచి 2019 మధ్యలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏకంగా 7 డిస్టిలరీలకు కు అనుమతి ఇచ్చారు. ఐదేళ్లలో 254 బ్రాండ్లు, ఏడు డిస్టిల్లరీలకు అనుమతి ఇచ్చి లిక్కర్ విక్రయాలను ప్రోత్సహించారు.
- ▲ సొంత మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ఎన్నికలు రాగానే మళ్లీ దండలు వేస్తుంటారు. అలాగే గతంలో తాను అనుమతి ఇచ్చిన బ్రాండ్లు, డిస్టిలరీలపై మళ్లీ ఆయనే ఇవెక్కడివంటూ విమర్శలు చేస్తుంటారు.

ఇంటింటా ఆనందం

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతి ఇంటివద్ద ప్రజలు ఆనందంతో స్వాగతం చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే తామంతా నడుస్తామని ప్రజాప్రతినిధులతో ప్రజలు చెప్పారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను తప్పకుండా నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.



ఒంగోలులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



తిరుపతి జిల్లా కోట సిద్ధమ్మకండ్రిగలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



తూర్పు గోదావరి జిల్లా కొత్త వెలుగుబందలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

థాంక్యూ సీఎం సార్



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో విధులు నిర్వర్తిస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను (ఎంఎల్‌హెచ్‌పీ)కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా (సీహెచ్‌ఓ) నియమించింది. దీంతో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని సీహెచ్‌ఓలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బూచవరం (పేటరూరల్), పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో విధులు నిర్వర్తిస్తున్న 42 మంది సీహెచ్‌ఓలు ఆదివారం థాంక్యూ సీఎం సార్ అనే ప్లకార్డులతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసానికి ప్రదర్శనగా వచ్చి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏ అనారోగ్య సమస్య తలెత్తినా పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 10,032 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.









ముమ్మరంగా క్యూలైను పనులు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే దసరా ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తులు త్వరగా అమ్మవారిని దర్శించుకునేలా క్యూలైన్ల ఏర్పాటు పనులు చకచకా సాగుతున్నాయి. కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి కొండపైకి క్యూలైన్లను కూలీలు సిద్ధం చేస్తున్న చిత్రాలు ఇవీ.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

బతుకులు చెదిరాయి

- ■ నాపరాయి లోడు లారీ బోల్తా
- ■ ముగ్గురు కూలీల దుర్మరణం
- ■ అందరూ కుటుంబ పెద్దలే
- ■ మూడు కుటుంబాల్లో తీరని విషాదం
- ■ అనాథలైన ఇద్దరు పిల్లలు

రాజుపాలెం(నకరికల్లు): అతివేగం, నిద్రమత్తు ముగ్గురి ప్రాణాలను బలిగొంది. మూడు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. ఓ కుటుంబంలో ఇద్దరు పిల్లలను అనాథలను చేసింది. ఈ హృదయవిదారక ఘటన నకరికల్లు మండలం శాంతి నగర్ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం మాచర్ల నుంచి విజయవాడకు నాపరాయి లోడుతో లారీ బయలుదేరింది. రెంటచింతల మండలం పసర్లపాడుకు చెందిన నాపరాళ్లు దించే కూలీలు అమరేసు శ్రీను (46), దొడ్డా భాస్కర్ (40), రమావతు మునీ నాయక్ (35) లారీ వెనుక భాగం బండరాళ్లపై కూర్చున్నారు. రాత్రి రెండు గంటలకు నకరికల్లు మండలం శాంతి నగర్ వద్దకు వచ్చే సరికి డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కందకంలోకి బోల్తా కొట్టింది. ప్రమాదంలో బండరాళ్ల కింద పడి అమరేసు శ్రీను, దొడ్డా భాస్కర్, రమావతు మునీ నాయక్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. నకరికల్లు ఎస్ఐ సురేష్ సిబ్బంది సహా ఘటన స్థలానికి చేరుకున్నారు. క్రేన్ సాయంతో రాళ్లను తొలగించి మృతదేహాలను వెలికి తీశారు. లారీ డ్రైవర్ సైదులు, క్లీనర్ ఏసు ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. మృతులంతా పసర్లపాడు వాసులు కావడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పిల్లలకు దిక్కెవరు!




అమరేసు శ్రీను భార్య 15 ఏళ్ల క్రితం మరణించింది. దీంతో శ్రీను ఇద్దరు మగ పిల్లలను గారాబంగా పెంచుకుంటున్నాడు. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో శ్రీను కూడా మరణించడంతో ఇద్దరు మగపిల్లలు అనాథలయ్యారు.

పెద్ద దిక్కు పోయింది



దొడ్డా భాస్కర్(సుభాష్ చంద్రబోస్)కు భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భాస్కర్ కూలి చేసి తెచ్చే డబ్బే ఈ కుటుంబానికి ఆధారం. ఇప్పుడు భాస్కర్ మృతితో పెద్ద దిక్కు పోయిందంటూ భార్య లక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం



రమావతు మునీనాయక్‌కు భార్య లక్ష్మీభాయి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమావతు మునీనాయక్ కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. నాయక్ రెక్కాడితేగానీ కుటుంబం మొత్తం డొక్కాడదు. దీంతో భార్యాపిల్లలు భోరున విలపిస్తున్నారు.

ముగిసిన ఈఎన్‌టీ వైద్యుల రాష్ట్ర సదస్సు

గన్నవరం రూరల్: కృష్ణా జిల్లా గన్నవరం మండలంలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో మూడు రోజులపాటు జరిగిన ఈఎన్‌టీ వైద్యుల రాష్ట్ర సదస్సు ఆదివారం ముగిసింది. 40వ సదస్సును నేషనల్ మెడికల్ కమిషన్ అధ్యక్షుడు డాక్టర్ అచల్ గులాటీ ప్రారంభించారు. ఈ సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా 360 మంది ఈఎన్‌టీ వైద్యులు, పీజీలు హాజరయ్యారు. నిపుణులు మాట్లాడుతూ.. క్లిష్టతరమైన వ్యాధులపై వైద్యులు దృష్టి సారించాలని సూచించారు. గురక, చెవిలో చీము, థైరాయిడ్ సమస్యలపై సదస్సు చర్చించింది. రానున్న కాలంలో మెడికల్ ఎడ్యుకేషన్ బోధన విధానంపై నిపుణులు పలు సూచనలు చేశారు. డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎస్.ఎన్.మూర్తికి సదస్సులో లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డును సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు, మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ఏఓఎల్ జాతీయ అధ్యక్షుడు అచల్ గులాటీ, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ శ్యాం ప్రసాద్, ఏఓఎల్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనాథ్, సెక్రటరీ ఎంఏ రెహ్మాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుధాకర్, డాక్టర్ భారతీ అందజేశారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈఎన్‌టీ వైద్యంలో ఆధునిక పద్ధతులను వివరించారు. డాక్టర్ విశ్వ రైనో ప్లాస్టిక్ సర్జరీపై అవగాహన కల్పించారు.



డాక్టర్ పి.ఎస్.ఎన్.మూర్తికి లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేస్తున్న డాక్టర్ అచల్ గులాటీ, డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు

రాష్ట్ర అధ్యక్షుడిగా కుమార్ చౌదరి ఎన్నిక



ఈఎన్‌టీ వైద్యుల రాష్ట్ర సదస్సులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ కె.వి.ఎస్.కుమార్ చౌదరి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎం.సుధాకర్, డాక్టర్ రవికుమార్ రాజ్, సెక్రటరీగా ఎంఏ రెహ్మాన్, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ పాల్ సతీష్, డాక్టర్ రమేష్, మరో నలుగురు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్లు ఇప్పటి వరకూ అధ్యక్షుడిగా పని చేసిన డాక్టర్ ఎం.త్రినాథ్ తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కుమార్ చౌదరి మంగళగిరి ఎన్ఆర్ఐ అకాడమీలో డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు. ఆయనకు, కార్యవర్గానికి సదస్సుకు హాజరైన ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు సూర్యభగవానుడి చిత్రపటానికి పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ జరిపించారు. లోక సంరక్షణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రతి ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ నిర్వహిస్తున్నట్లు అర్చకులు పేర్కొన్నారు.

98 శాతం పెన్షన్లు పంపిణీ

చిలకలపూడి (మచిలీపట్నం): వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం ద్వారా జిల్లాలో ఆదివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా 2,34,313 మంది లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 2,29,627 మందికి పెన్షన్లు పంపిణీ చేశారు. ఇంకా కేవలం 4,686 మంది లబ్ధిదారులకు మాత్రమే పంపిణీ చేయాల్సి ఉంది. నాలుగు రోజుల్లో 98 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు డీఆర్డీఏ పీడీ దుర్గాప్రసాద్ తెలిపారు.


ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్ష

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): నగరంలోని పలు కేంద్రాల్లో యూపీఎస్సీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావెల్ అకాడమీలకు సంబంధించిన ప్రవేశ పరీక్షను యూపీఎస్సీ ఆదివారం నిర్వహించింది. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, కేబీఎన్ కళాశాల, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల, ఆంధ్ర లయోల కళాశాల, శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల కేంద్రాలుగా ఈ పరీక్ష జరిగింది. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు, తిరిగి రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించారు. రెండు పరీక్షలకు అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంది. ఆంధ్ర లయోల కళాశాలకు 384 మందిని కేటాయించగా 181 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో 307 మందికి 145 మంది, కేబీఎన్ కళాశాలలో 384 మందికి 170 మంది, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో 467 మందికి 178 మంది, సిద్ధార్థ మహిళా కళాశాలలో 393 మందికి గానూ 147 మంది పరీక్ష రాశారు. రెవెన్యూ, పోలీసు అధికారులు ఆయా కేంద్రాల వద్ద ప్రత్యేక విధులు నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ మోహన్‌కుమార్ పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.



కేబీఎన్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను పరిశీలించి పరీక్షకు అనుమతిస్తున్న సిబ్బంది

గురుపూజోత్సవం



భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంతో విశిష్టమైనది. సమున్నతమైనది, గౌరవప్రదమైనది. తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుది. ఒక వ్యక్తి, సమాజ, జాతి నడకకు, నడతకు, పురోగతికి, శ్రేయస్సుకు గురువు మార్గదర్శనం తప్పనిసరి. వ్యక్తి వికాసానికైనా, దేశ వికాసానికైనా ఉత్తమ గురువు ప్రోత్సాహం, అనుగ్రహం, ఆశీర్వాదం అనివార్యం.

గురువంటే... వెలిగే దీపం

ఉత్తమ గ్రంథాలన్నీ ఆచార్యుని ప్రాధాన్యతను ప్రస్తుతించాయి. ఒక జాతి ఉత్తమజాతిగా రూపొందటంలో ప్రజల గుణగణాలు ఎంతో కీలకపాత్ర వహిస్తాయి. ప్రజలు శీలవంతులుగా ఉండాలంటే ప్రప్రథమంగా వారు చక్కని సంస్కార వంతులు కావాలి. ఈ గొప్ప సంస్కారం మన మనస్సుల్లో ఉద్దీపింప చేసే మహోన్నతుడే గురువు. మనకు విద్యను బోధిస్తూనే మన హృదయ సంస్కారాన్ని పెంచే యత్నం చేస్తాడు. ఆ క్రమంలో ఒకసారి మృదువుగా, మరొకసారి కఠినంగా వ్యవహరిస్తుంటాడు. ఆపై తల్లిగా లాలిస్తాడు. ప్రేమను కురిపిస్తాడు. అక్కున చేర్చుకుంటాడు. అందుకే తల్లి ప్రేమ, ఆత్మీయత; అవసరమైన వేళలో తండ్రిలా దండన, సంరక్షణల మేళవింపే గురువు.

ఉత్తమగురువు తన విద్యార్థులతో ఒక స్నేహితుడిగా, వేదాంతిగా, మార్గదర్శకుడిగా ఉంటూ వారి వ్యక్తిత్వ వికాసానికి, ఎదుగుదలకు ఎంతో సహాయం చేస్తాడు. చదువు ద్వారా జ్ఞానాన్ని పెంచుతూనే హృదయ సంస్కారాన్ని పెంచుతాడు. విద్యను చెప్పేవాడికే బుద్ధులు చెప్పే విశేష అధికారం, అవకాశం ఉంటాయి. ఉత్తమ గురువెన్నడూ తన ఈ గురుతర బాధ్యతను విస్మరించడు. తన ఆధిక్యతను ఎక్కడా ప్రదర్శించడు. చక్కని విద్యతోపాటు హృదయ సంస్కారం అలవడి వృద్ధి చెందే గొప్ప వాతావరణం, జ్ఞానం గురువు నుండి శిష్యుడికి, శిష్యుడి నుంచి గురువుకు ప్రసరిస్తుంది. గ్రీకు తత్త్వవేత్త, వేదాంతి, విద్యావేత్త ప్లేటో ఏథెన్స్ నగరంలో బోధనా పద్ధతిలో ఒక గొప్ప పద్ధతిని ప్రవేశపెట్టాడు.

- మనకు తెలుసు అని అనుకున్నప్పుడు మనం నేర్చుకోవటం మానేస్తాం.
- విద్య అంతిమ లక్ష్యం ఒక స్వేచ్ఛా సృజనశీలిగా రూపొందటం. అపుడే చారిత్రక పరిస్థితులు, ప్రకృతి విపత్తులతో పోరాడగలడు.
- దేశంలో అందరికన్నా ఉపాధ్యాయుల మనస్సులు ఉత్తమమైనవిగా ఉండాలి. మన స్వీయ ఆలోచనాశక్తిని పెంపొందించటానికి సహాయపడే వాడే ఉపాధ్యాయుడు.
- విద్యావ్యవస్థకు ఉపాధ్యాయుడు వెన్నెముక.
  - దా. సర్వేపల్లి రాధాకృష్ణన్
- ఏది చూడాలో చెప్పక ఎక్కడా చూడాలో మాత్రమే చెప్పేవాడు అధ్యాపకుడు.
  - అలెగ్జాండర్ ట్రెన్నర్
- అగ్ర సింహాసనం మీదఎవరినైనా కూర్చోపెట్టదలచుకుంటే అతడు అధ్యాపకుడే.
  - గై కవాసోకి
- వెయ్యి రోజులు పరిశ్రమించి నేర్చుకున్న విద్యకన్నా ఒక గొప్ప అధ్యాపకుడితో ఒక రోజు గడపటం విలువైనది.- జపాన్ సామెత బోధించటమంటే మరోసారి నేర్చుకోవటం.
  - జోసెఫ్ జాబర్ట్
- నేను అధ్యాపకుణ్ణి కాదు. కాని వైతాళికుణ్ణి
  - రాబర్ట్ ఫ్రాస్ట్

ఆయన కూడ తన విధానంలో విద్యార్థులకు పెద్ద పీట వేసాడు. అక్కడ ప్రతి లౌకిక, అలౌకిక విషయాలను, జ్ఞానం, దాని లోతుపాతులు, అది లభ్యమయ్యే మార్గాలు.. ఇలా ఎన్నో విషయాలను గురుశిష్యులు చర్చించేవారు. ఎవరి భావాలు ఉన్నతంగా ఉంటే వాటినే తీసుకునే వారు. ఇక్కడ విద్యంటే ఆలోచనల మార్పిడి. అలాగే ఈ గురుకులంలో ఎవరు ఎవరికి బోధిస్తున్నారో చెప్పటం కష్టం. ఎవరిది గొప్ప ఆలోచనైతే దాన్నే మిగిలినవారు స్వీకరించే వారు. ఈ దేశాలలో కూడ ఒకరు ఎక్కువ, రెండవవారు తక్కువన్న ప్రసక్తే లేదు. ఎంత ఉన్నతమైన భావనో గమనించండి. ప్రాచ్య దేశాలైనా, పాశ్చాత్య దేశాలైనా గురువు విలువను, ఆయన ఆవశ్యకతను గుర్తెరిగి వర్తిస్తాయని ఆయనకు ఉన్నత స్థానాన్నిస్తాయని చెప్పటానికే ఈ ఉదాహరణ.

గురువులో రవ్వంత గర్వమైనా ఉండకూడదు. అసలు పొడచూపకూడదు. మనస్సు నిర్మలమైన తటాకం కావాలి. ఇలా కావటానికి అతడు పక్షపాత రహితుడు కావాలి. అపుడే తన జ్ఞానాన్ని శిష్యులకు అందచేస్తాడు. ఆ జ్ఞానాన్ని పొందిన శిష్యుడు దాన్ని జీర్ణించుకుని తన మేధతో మరింతగా ప్రకాశింపచేసి తరువాత తరాలవారికి అందచేస్తాడు. అలా తన శిష్యులు తన జ్ఞానవాహికలు కావటం ఏ గురువుకైనా ఎంతో ఆనందాన్నిస్తుంది. ఎంతో ఉప్పొంగిపోతాడు. జ్ఞానపరంపరకు వారధి కనుక అతనంటే అవ్యాజమైన ప్రేమ. ఎంతో గౌరవం. జ్ఞానమనే అనంత ప్రవాహంలో గురుశిష్యులు జ్ఞానపాయలు.

ఉత్తమ గురువు కోసం శిష్యుడు ఎలా తపిస్తూ, అన్వేషిస్తాడో, గురువు కూడ అంతే. గురువు క్షేత్రమైతే శిష్యుడు విత్తు లాంటివాడు. రెండిటి మేలు కలయిక వల్లే జ్ఞానమనే బంగరు పంట పండుతుంది. గురువు ఎవరినైనా శిష్యుడి తీసుకునే ముందు అతడి జ్ఞానంతో పాటు, అతడి జ్ఞానతృష్ణనూ పరీక్షిస్తాడు. అవి తృప్తికరంగా ఉన్నప్పుడే అతనికి విద్య గరిపేవాడు. గురువు జ్ఞానధారను ఒడిసిపట్టుకున్న శిష్యుడు తన ప్రతిభతో, అనుభవంతో దానిని మరింతగా విస్తరించి భావితరాలకు అందిస్తాడు.

నేటి విద్యావ్యవస్థలో ఆనాటి ప్రమాణాలు, అంతటి ఉత్తమ గురుశిష్యులు, విలువలు లేవని కొందరి గట్టి నమ్మకం. ఆరోపణ. కొంత వాస్తవం లేకపోలేదు. నేటి కాలంలోనూ బోధనావృత్తిని ఎంతో పవిత్రంగా భావించి దానిని చేపట్టి ఎంతో సమర్థంగా నిర్వహించేవారు ఉన్నారు. దానికి మరిన్ని సొబగులద్ది, మరింత గౌరవాన్ని, హుందాతనాన్ని పెంచిన వారు, పెంచుతున్న వారు ఉన్నారు. పొందవలసిన గౌరవాన్ని పొందుతూనే ఉన్నారు.

సాంకేతికాభివృద్ధి విశేషంగా పెరిగి మనకు ఎంతగానో చేరువైంది. నేటి గురువులు ఈ సాంకేతికతని అందిపుచ్చుకుని మరీ పాఠాలు చెప్పేటందుకు సంసిద్ధులవుతున్నారు. వీరి లాగానే, ఉత్తమ శిష్యులు కూడ గురువుల మాదిరిగానే తయారవుతున్నారు. కనుక నేటి అధ్యాపకులకు చాలా అప్రమత్తత ఉండాలి. తమ జ్ఞానాన్ని, బోధనానైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలి. అప్రమత్తులుగా ఉంటేనే కదా ఈ పోటీ ప్రపంచంలో నిలదొక్కుకుని, నాలుగు కాలాలపాటు నిలువగలిగేది.

ఉత్తమ గురువు మన ఆలోచనలకు నడకలు నేర్పుతాడు. మన ఊహలకు రెక్కలనిచ్చి మనం అద్భుత ప్రపంచాలలో విహరించే శక్తినిస్తాడు. ఉత్తమ గురువు మనలోని సృజనాత్మకతను మనం గుర్తించేటట్టు చేస్తాడు. ఉత్తమ గురువు చేసే, చేయగలిగే మహత్తర కార్యమిదే. దీనివల్ల మనకు ప్రశ్నించే అలవాటు, శోధించే తత్వం అలవడుతుంది. అందుకే ఈ గురుశిష్యుల పాత్రను జాతిని సముద్ధరింపచేసే అత్యంత కీలకమైన అంశాలలో ఒకటిగా భావిస్తారు. వారి పాత్ర ఎంతో అమూల్యమైనది. అపురూపమైనది.

– బొడ్డపాటి చంద్రశేఖర్, ఆంగ్లోపన్యాసకులు

గురువాణి

చెలియలికట్ట



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



మనిషి జీవితంలో తనకున్న వాటిలో ముఖ్యంగా మూడు విషయాల్లో ఎప్పుడూ అసంతృప్తి పొందకూడదని పెద్దలు చెబుతారు. సంతోషస్త్రిషు కర్తవ్యో కళత్రే భోజనే ధనే... వాటిలో మొదటిది కళత్రం. అంటే తనకు జీవిత భాగస్వామిగా లభించినవారు. అంటే వివాహం తరువాత తాను తాళి కట్టి తెచ్చుకున్న భార్య. ఏడడుగులు వేసి సహధర్మచారిణిగా ఉంటానని భర్తగా అంగీకరించి అతని వెంట నడిచి వచ్చిన స్త్రీ. ధర్మం, అర్థం, కామం... ఈ మూడూ వారికే పరిమితం. పరస్పరం దాటి వెళ్ళడానికి వీలు లేదు.

సముద్రుడు చాలా శక్తిమంతుడు. తలచుకుంటే భూమినంతటినీ ముంచెత్తగలడు. అయినా తనకు తాను ఒక నియమం పెట్టుకున్నాడు. నేను చెలియలికట్ట దాటను... అన్నాడు. అందువల్ల కెరటాలు ఒడ్డువరకు వచ్చి వెనక్కి వెళ్లిపోతాయి. అలా కాకుండా ఏ రోజయినా సునామీలాంటివి వచ్చి చెలియలికట్ట దాటితే అది చరిత్రలో భయంకరమైన రోజవుతుంది. అంటే తమలో వచ్చిన భావావేశాన్ని భార్యాభర్తలలో ఏ ఒక్కరయినా నియంత్రించుకోలేకపోతే ... అది చెలియలికట్ట దాటిన పరిస్థితి. అందుకే ఎప్పుడూ వారిరువురూ పరస్పరం పూర్తి సంతృప్తి పొంది ఉండాలి. ఏకారణం చేతనయినా వారిలో ఏ ఒక్కరికయినా అసంతృప్తి పొడసూపిందనుకోండి. అప్పుడెలా ఉండాలి... అంగవైకల్యంతో తమ కడుపున పుట్టిన బిడ్డను తల్లిగా కానీ, తండ్రిగా కానీ ఎంత ఎక్కువ శ్రద్ధతో, అధిక ప్రేమానురాగాలతో, అన్నిటికీ మించి అత్యధిక ఓర్పుతో చూసుకుంటారో భార్యాభర్తలు కూడా తమలో పుట్టిన అసంతృప్తిని దిగమింగి తమ భాగస్వామిని అంత శ్రద్ధగా చూసుకోగలగాలి.

బంగారు పాత్రలో పోసుకు తాగినా పాయసమే, కడుక్కుని కుండలో పోసుకు తాగినా పాయసమే. పాత్రలు వేరయినా పాయసం మాత్రం ఒక్కటే. అందుకే జీవిత భాగస్వామిని దాటి ధర్మార్థకామములను పొందే ప్రయత్నం చేయవద్దు. అలా చేస్తే అధార్మికమైన కార్యాలపట్ల మనసు లగ్నం అవుతుంది. దానివలన ధర్మం పట్టుకోల్పోతుంది. అశాంతి కలుగుతుంది. ప్రశాంతంగా ఉండలేరు. కారణం... ఉన్నదానిలో తృప్తి లేదు. కోరుకున్నది అన్నివేళలా అందుబాటులో ఉండదు. పైగా చేయకూడనిది చేస్తున్నానేమో అన్న అపరాధ భావన వారి ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది, జీవితాలను పతనం చేస్తుంది. 'పరస్త్రీసంగ దోషేన బహవో మరణంగతా..' పరస్త్రీ (పరపురుషుడి) వ్యామోహం ... ఆ భావన, ఆ ఉద్వేగం, ఆ భయం... లోపల ఆ రహస్యాన్ని దాచుకోవడంలో ఉన్న ఉద్విగ్నత... అనారోగ్యానికి, అకాలమరణానికి కూడా దారితీస్తాయి. అందుకే జీవిత భాగస్వామి విషయంలో ఎప్పుడూ అసంతృప్తి అన్నమాట దరిచేరనీయవద్దు. భార్యలో భర్తకు కానీ, భర్తలో భార్యకు కానీ బలముంటే సంతోషించాలి, బలహీనతుంటే... భగవంతుడిచ్చిన పిల్లల విషయంలో చూపిన ఓర్పు, సానుభూతి, ప్రేమానురాగాలనే చూపాలి. అంతే తప్ప జీవితంలో జీవిత భాగస్వామి విషయంలో ఎప్పుడూ అసంతృప్తికి స్థానం ఇవ్వకూడదు.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎఫ్‌సీఐలో 5043 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న ఎఫ్‌సీఐ డిపోలు, కార్యాలయాల్లో జోన్ల వారీగా కేటగిరి-3 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 5043
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీర్(సివిల్ ఇంజనీరింగ్), జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్ మెకానికల్ ఇంజనీరింగ్), స్టెనోగ్రాఫర్ గ్రేడ్2, అసిస్టెంట్ గ్రేడ్-3(జనరల్), అసిస్టెంట్ గ్రేడ్-3(అకౌంట్స్), అసిస్టెంట్ గ్రేడ్-3(టెక్నికల్), అసిస్టెంట్ గ్రేడ్-3(డిపో), అసిస్టెంట్ గ్రేడ్-3(హిందీ).
» **జోన్ల వారీగా ఖాళీలు:** నార్త్ జోన్-2388, సౌత్ జోన్-989, ఈస్ట్ జోన్-768, వెస్ట్ జోన్-713, నార్త్ ఈస్ట్ జోన్-185.
» **అర్హత:** పోస్టును అనుసరించి డిగ్రీ, బీకాం, బీఎస్సీ(అగ్రికల్చర్/బోటనీ/జువాలజీ/బయోటెక్నాలజీ/బయోకెమిస్ట్రీ/మైక్రోబయాలజీ/ఫుడ్ సైన్స్), బీఈ/బీటెక్(ఫుడ్ సైన్స్/ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/బయోటెక్నాలజీ /సివిల్), డిప్లొమా(సివిల్/మెకానికల్)/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష(ఫేజ్-1, ఫేజ్-2 పరీక్షలు), స్కిల్/టైపింగ్ టెస్ట్(స్టెనో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఏపీ,తెలంగాణ రాష్ట్రాల్లో ఫేజ్-1 పరీక్షా కేంద్రాలు:** నెల్లూరు, విజయవాడ, కాకినాడ, కర్నూలు, తిరుపతి, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 06.09.2022
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.10.2022
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** జనవరి 2023.
» **వెబ్‌సైట్: https://fci.gov.in**

ఎస్‌బీఐలో 714 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ బ్రాంచిల్లో స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్(ఎస్‌సీఓ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 714
» **పోస్టుల వివరాలు:** మేనేజర్, రిలేషన్ మేనేజర్, ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్, సీనియర్ రిలేషన్ మేనేజర్,రీజనల్ హెడ్, అసిస్టెంట్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ తదితరాలు.
» **విభాగాలు:** డాట్‌నెట్ డెవలపర్, జావా డెవలపర్, బిజినెస్ ప్రాసెస్, ఆపరేషన్స్ టీమ్, బిజినెస్ డెవలప్‌మెంట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో డిగ్రీ /బీటెక్/బీఈ/ఎంటెక్/ఎంఈ/ఎంసీఏ/ఎంఎస్సీ(కంప్యూటర్‌సైన్స్/ఇంజనీరింగ్ /ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ /ఎలక్ట్రానిక్స్ -కమ్యూనికేషన్ ఇంజనీరింగ్)/ఎంబీఏ/పీజీ/పీజీడీఎం ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** పోస్టును అనుసరించి 01.04.2022 వరకు 20 నుంచి 50 ఏళ్లు ఉండాలి.
» **పని అనుభవం:** సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం రెండేళ్ల నుంచి 12ఏళ్ల పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. మేనేజర్, ఇంజనీర్ ఉద్యోగాలకు మాత్రం దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేసి అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలుస్తారు. ఇందులో ప్రతిభ ఆధారంగా నియామకాలు చేపడతారు.
» **పరీక్ష విధానం:** ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుంది. రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్, ఐటీ నాలెడ్జ్, రోల్ బేస్ట్ నాలెడ్జ్ సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 100 మార్కులకు గాను 70 మార్కులు ఆన్‌లైన్ పరీక్ష నుంచి మరో 30 మార్కులు ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.09.2022
» **వెబ్‌సైట్: sbi.co.in**

ఏఏఐ-చెన్నైలో 156 ఉద్యోగాలు

చెన్నైలోని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ).. జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 156
» **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్-142, సీనియర్ అసిస్టెంట్-14. » **విభాగాలు:** ఫైర్ సర్వీస్, అకౌంట్స్, అఫీషియల్ లాంగ్వేజ్.

అర్హతలు

» **జూనియర్ అసిస్టెంట్:** పదో తరగతి, డిప్లొమా (మెకానికల్/ఆటోమొబైల్/ఫైర్) కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. **జీతం:** నెలకు రూ.31,000 నుంచి రూ.92,000 చెల్లిస్తారు.
» **సీనియర్ అసిస్టెంట్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో గ్రాడ్యుయేషన్/మాస్టర్స్ డిగ్రీ(హిందీ/ఇంగ్లిష్) ఉత్తీర్ణులవ్వాలి. కనీసం రెండేళ్ల పని అనుభవం ఉండాలి.**జీతం:**నెలకు రూ.36,000 నుంచి రూ.1,10,000 వరకు చెల్లిస్తారు.
» **వయసు:** 18 నుంచి 30 ఏళ్ల ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, టైపింగ్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యురెన్స్ టెస్ట్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 01.09.2022
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.09.2022
» **వెబ్‌సైట్: www.aai.aero**

డీఆర్‌డీఓ.. కొలువుల పిలుపు

» పలు విభాగాల్లో 1901 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్
» సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్-బి, టెక్నిషియన్-ఎ పోస్టులు
» డీఆర్‌డీఓ-సెప్టెమ్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ
» ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ బీటెక్ అర్హతగా ఉద్యోగాలు
» రాత పరీక్ష, స్కిల్ టెస్ట్‌లలో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» సెప్టెంబర్ 3 నుంచి 23 వరకు దరఖాస్తు అవకాశం

ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులకు.. తీపి కబురు! ఈ అర్హతలతో కేంద్ర కొలువు సొంతం చేసుకోవాలనుకుంటున్న వారికి మంచి అవకాశం!! ప్రారంభంలోనే రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు వేతనం అందుకోవచ్చు. ఇందుకు మార్గం.. డీఆర్‌డీఓ తాజాగా ప్రకటించిన.. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్-బి, టెక్నిషియన్-ఎ నియామక ప్రకటనే!! ఈ కొలువు సొంతం చేసుకోవాలంటే.. డీఆర్‌డీఓకు చెందిన సెంటర్ ఫర్ పర్సనల్ ట్యాలెంట్ అండ్ మేనేజ్‌మెంట్ (సెప్ట్యామ్).. నిర్వహించే పరీక్షల్లో విజయం సాధించాల్సి ఉంటుంది! ఈ నేపథ్యంలో.. డీఆర్‌డీఓ కొలువులు, సెప్ట్యామ్ పరీక్ష వివరాలు, విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై విశ్లేషణ...

మొత్తం 1901 ఉద్యోగాలు

- డీఆర్‌డీఓ తాజా నియామక ప్రకటన ద్వారా సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్-బి, టెక్నిషియన్-ఎ హోదాల్లో మొత్తం 1901 ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టింది.
- **సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్-బి:** 1075 ఖాళీలు (వేతన శ్రేణి రూ. 35,400-1,12,400)
- **టెక్నిషియన్-ఎ హోదాలో 826 ఖాళీలు** (వేతన శ్రేణి: రూ. 19,900-రూ.63,200)

అర్హతలు

- **సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్-బి:** అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విభాగాలను అనుసరించి బీఎస్సీ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- **టెక్నిషియన్-ఎ:** దరఖాస్తు చేసుకున్న విభాగాల్లో ఐటీఐ ఉత్తీర్ణత ఉండాలి.
- విద్యార్హతలను సెప్టెంబర్ 23, 2022లోపు పొంది ఉండాలి.
- **వయసు:** 18ఏళ్ల నుంచి 28ఏళ్లు ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ వర్గాలకు నిబంధనల ప్రకారం సడలింపు లభిస్తుంది.

సెప్ట్యామ్ ఆధ్వర్యంలో ఎంపిక

డీఆర్‌డీఓలో పోస్టుల భర్తీ ప్రక్రియను ఈ సంస్థకు చెందిన సెంటర్ ఫర్ పర్సనల్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్(సెప్ట్యామ్) విభాగం నిర్వహిస్తుంది. డీఆర్‌డీఓలో నాన్ -గెజిటెడ్ హోదాలోని టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్, అనుబంధ విభాగాల్లో సిబ్బంది నియామకం, శిక్షణ కోసం ఈ విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

- సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్-బి, టెక్నిషియన్-ఎ పోస్టులకు సంబంధించి టైర్-1, టైర్-2 పేరుతో రెండు దశల రాత పరీక్ష నిర్వహిస్తారు.
- సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్-బి, టెక్నిషియన్-ఎ ఉద్యోగాలకు టైర్-1 పరీక్ష స్క్రీనింగ్ టెస్ట్‌గా ఉంటుంది.
- టైర్-1 పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులతో ఉత్తీర్ణత సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి.. 1:8 నిష్పత్తిలో తదుపరి దశలో టైర్-2 పేరుతో మరో రాత పరీక్ష నిర్వహిస్తారు.
- సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్-బి ఉద్యోగాలకు టైర్-2 పరీక్షను సెలక్షన్ టెస్ట్‌గా; టెక్నిషియన్-ఎ ఉద్యోగాలకు టైర్-2 పరీక్షను ట్రేడ్/స్కిల్ టెస్ట్‌గా పేర్కొన్నారు.

ఎస్‌టీఏ-బి రాత పరీక్షల వివరాలు

- ఎస్‌టీఏ-బి టైర్-1 పరీక్షలో.. క్వాంటిటేటివ్ ఎబిలిటీ/అప్టిట్యూడ్, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ సైన్స్ విభాగాల్లో ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 120 మార్కులకు -120 ప్రశ్నలు అడుగుతారు.
- టైర్-2 పరీక్షను అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విభాగానికి చెందిన సబ్జెక్ట్‌కు సంబంధించిన ప్రశ్నలతో నిర్వహిస్తారు. ఇందులో 100 మార్కులకు 100 ప్రశ్నలు అడుగుతారు.
- టైర్-1 పరీక్షకు అన్ని విభాగాల అభ్యర్థులకు ఉమ్మడిగా నిర్వహిస్తారు.
- రెండు పరీక్షలు కూడా ఆబ్జెక్టివ్ తరహాలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు.

టెక్నిషియన్-ఎ పరీక్షలు ఇలా

- టెక్నిషియన్-ఎ పోస్టులకు సంబంధించి.. టైర్-1 రాత పరీక్షను సెక్షన్-ఎ, సెక్షన్-బి పేరుతో రెండు విభాగాలుగా నిర్వహిస్తారు.
- సెక్షన్-ఎలో క్వాంటిటేటివ్ ఎబిలిటీ/ఆప్టిట్యూడ్, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ సైన్స్ విభాగాల నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు.
- సెక్షన్-బిలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న ట్రేడ్ లేదా పోస్ట్ కోడ్‌కు సంబంధించి సబ్జెక్ట్ ప్రశ్నలు మొత్తం 80 అడుగుతారు.
- ఇలా మొత్తం 120 ప్రశ్నలతో 120 మార్కులకు రెండు విభాగాల్లో టైర్-1 పరీక్ష నిర్వహిస్తారు.
- టైర్-2.. ట్రేడ్ టెస్ట్: టైర్-1 టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా 1:8 నిష్పత్తిలో అభ్యర్థులను టైర్-2 ట్రేడ్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. ఈ ట్రేడ్ టెస్ట్‌లో ఐటీఐ స్థాయిలో అభ్యర్థులు ఆయా ట్రేడ్‌లలో పొందిన నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రాక్టికల్‌గా ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఈ టెస్ట్ వ్యవధి కనిష్టంగా ఒక గంట, గరిష్టంగా రెండు గంటలుగా ఉంటుంది.

సర్టిఫికెట్ల పరిశీలన.. కొలువు ఖరారు

రెండు పోస్ట్‌లకు సంబంధించి రెండు దశల రాత పరీక్షల్లోనూ విజయం సాధించిన అభ్యర్థులు చివరగా సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలోనూ విజేతలుగా నిలిస్తే.. డీఆర్‌డీఓకు చెందిన లేబొరేటరీలు, అనుబంధ సంస్థలు, విభాగాల్లో నియామకాలు ఖరారు చేస్తూ.. ఆ అభ్యర్థుల జాబితాను డీఆర్‌డీఓ అధికారులకు సెప్ట్యామ్ విభాగం అందిస్తుంది.



విజయం సాధించాలంటే

క్వాంటిటేటివ్ ఎబిలిటీ/ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో రాణించేందుకు అభ్యర్థులు.. ఆల్జీబ్రా, ట్రిగనామెట్రీ, జామెట్రీ, మెన్సురేషన్ చాప్టర్లపై దృష్టి పెట్టాలి. అర్థమెటిక్‌లో రేషియో-ప్రపోర్షన్, ఇంట్రెస్ట్, ప్రాఫిట్-లాస్, డిస్కౌంట్, పార్టనర్‌షిప్ బిజినెస్, మిక్చర్ అండ్ అలిగేషన్, టైం అండ్ వర్క్,టైం అండ్ డిస్టెన్స్, పర్సంటేజెస్, డేటా ఇంటర్‌ప్రెటేషన్ తదితర అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ ఎబిలిటీ

ఈ విభాగంలో కొద్దిపాటి కసరత్తుతో మంచి మార్కులు పొందొచ్చు.వెర్బల్,నాన్ వెర్బల్ తరహా ప్రశ్నలు ఉంటాయి. అనాలజీస్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్; స్పేస్ విజువలైజేషన్, కోడింగ్-డీకోడింగ్, న్యూమరికల్ ఆపరేషన్స్, వెన్ డయాగ్రమ్స్ తదితర అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో మంచి మార్కులు సొంతం చేసుకోవడానికి హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, జనరల్ సైన్స్, స్టాండర్డ్ జీకే, కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. ముఖ్యంగా భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, ఆధునిక భారత దేశ చరిత్ర, భారత భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, పంటలు, వ్యవసాయం అంశాలపై దృష్టి పెట్టాలి. పాలిటీకి సంబంధించి రాజ్యాంగ పీఠిక మొదలు తాజా సవరణల వరకు అన్ని అంశాలు తెలుసుకోవాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు.. ముందుగా గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. మొదట గ్రామర్ రూల్స్ తెలుసుకోవడంతోపాటు వాటి అప్లికేషన్ ఆధారిత ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. పుస్తకాలతోపాటు నిత్యం ఇంగ్లిష్ పత్రికల్లో వచ్చే ఎడిటోరియల్స్ చదువుతూ కొత్త పదాలు నోట్ చేసుకోవాలి. రీడింగ్ కాంప్రెహెన్షన్‌లో వచ్చే ప్యాసేజీలను అటెంప్ట్ చేయడానికి ప్రయత్నించాలి. తద్వారా మంచి స్కోర్ చేసేందుకు అవకాశం ఉంటుంది.

జనరల్ సైన్స్

జనరల్ సైన్స్‌కు సంబంధించి బేసిక్ సైన్సెస్ తోపాటు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో ఇటీవలి పరిణామాలు.. ముఖ్యంగా డీఆర్‌డీఓ, ఇస్రో వంటి సంస్థల ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా హైస్కూల్ స్థాయిలోని సైన్స్ పుస్తకాల్లోని ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలి.

టైర్-2కు ఇలా

- అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న సబ్జెక్ట్‌లలో నిర్వహించే టైర్-2 విషయంలో.. ఎస్‌టీఏ-బి అభ్యర్థులు తమ సబ్జెక్టుకు సంబంధించి డిగ్రీ, డిప్లొమా, బీటెక్ స్థాయిలోని అకడమిక్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. వాటిలోని అంశాలను కాన్సెప్ట్యువల్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి.
- టెక్నిషియన్-ఎ అభ్యర్థులు టైర్-2లోని ట్రేడ్/స్కిల్ టెస్ట్‌లో రాణించేందుకు తాము దరఖాస్తు చేసుకున్న విభాగాలకు సంబంధించి ప్రాక్టికల్ నైపుణ్యాలు సొంతం చేసుకునేలా సిద్ధమవ్వాలి. సబ్జెక్ట్ అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయం చేస్తూ ప్రాక్టీస్ చేయడం, అదే విధంగా తమ కోర్సు సమయంలో చేసిన ప్రాక్టికల్స్‌ను పునరావలోకనం చేసుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది.

డీఆర్‌డీఓ జాబ్స్-ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** సెప్టెంబర్ 3- సెప్టెంబర్ 23
- **పరీక్ష తేదీలు:** డిసెంబర్‌లో నిర్వహించే అవకాశం
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్
- **పూర్తి వివరాలకు,ఆన్‌లైన్ దరఖాస్తులకు వెబ్‌సైట్: https://www.drdo.gov.in/ceptm-advertisement/1782 https://ceptam10.com/ceptamvpapr20**



దుబాయ్ ఓపెన్ చెస్ విజేత అరవింద్

భారత యువ గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం దుబాయ్ ఓపెన్ మాస్టర్స్ చెస్ టోర్నీలో విజేతగా నిలిచాడు. తమిళనాడుకు చెందిన 22 ఏళ్ల అరవింద్ 7.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో అరవింద్ ఆరు గేముల్లో నెగ్గి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచాడు. అరవింద్‌కు 13,000 డాలర్ల (రూ. 10 లక్షల 36 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. ఈ టోర్నీలో ఆడిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్ ఏడో ర్యాంక్‌లో, హర్ష భరతకోటి పదో ర్యాంక్‌లో, రాజా రిత్విక్ 21వ ర్యాంక్‌లో నిలిచారు.

అంతర్జాతీయ టి20 క్రికెట్‌కు గుడ్‌బై



టెస్టు, వన్డే ఫార్మాట్‌లపై మరింత దృష్టి సారించేందుకు బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీమ్ అంతర్జాతీయ టి20 క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అయితే టి20 ఫ్రాంచైజీ లీగ్ టోర్నీలలో మాత్రం ఆడతానని 35 ఏళ్ల ముష్ఫికర్ స్పష్టం చేశాడు. బంగ్లాదేశ్ తరఫున 102 టి20 మ్యాచ్‌లు ఆడిన ముష్ఫికర్ 1,500 పరుగులు సాధించాడు. ఇందులో ఆరు అర్ధ సెంచరీలు ఉన్నాయి.



వెల్‌డన్ వెర్‌స్టాపెన్

ఎఫ్1 సీజన్‌లో పదో విజయం

జాండ్‌వూర్ట్ (నెదర్లాండ్స్): ఆద్యంతం ఆధిపత్యం చలాయించిన రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఫార్ములావన్ (ఎఫ్1) 2022 సీజన్‌లో పదో విజయం నమోదు చేశాడు. సొంతగడ్డపై ఆదివారం జరిగిన డచ్ గ్రాండ్‌ప్రి ప్రధాన రేసులో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 72 ల్యాప్‌ల ఈ రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా గంటా 36 నిమిషాల 42.773 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. జార్జి రసెల్ (మెర్సిడెస్) రెండో స్థానంలో, చార్లెస్ లెక్లెర్క్ (ఫెరారీ) మూడో స్థానంలో నిలిచారు. ప్రపంచ మాజీ చాంపియన్ లూయిస్ హామిల్టన్ నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 22 రేసుల ఈ సీజన్‌లో ఇప్పటివరకు 15 రేసులు పూర్తయ్యాయి. వెర్‌స్టాపెన్ 319 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. తాజా గెలుపుతో వెర్‌స్టాపెన్ వరుసగా రెండో ఏడాదీ 10 విజయాలు సాధించాడు. ఒకే సీజన్‌లో అత్యధిక విజయాలు సాధించిన రికార్డు మైకేల్ షుమాకర్ (జర్మనీ; 2004లో 13), సెబాస్టియన్ వెటెల్ (జర్మనీ; 2013లో 13) పేరిట సంయుక్తంగా ఉంది. 201 పాయింట్లతో చార్లెస్ లెక్లెర్క్ (ఫెరారీ), సెర్గియో పెరెజ్ సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు. సీజన్‌లోని తదుపరి రేసు ఇటలీ గ్రాండ్‌ప్రి ఈనెల 11న జరుగుతుంది.

విజేత వెన్నెల-శ్రియాన్షి జోడీ

పుణే: ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్‌ప్రి బ్యాడ్మింటన్ టోర్నీలో కలగొట్ల వెన్నెల-శ్రియాన్షి వలిశెట్టి (భారత్) జోడీ అండర్-19 మహిళల డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో వెన్నెల-శ్రియాన్షి ద్వయం 21-19, 21-18తో నర్దన-రిధి కౌర్ (భారత్) జోడీపై విజయం సాధించింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో ఉన్నతి హుడా (భారత్) 25-23, 17-21, 10-21తో సరున్‌రక్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో దివ్యం అరోరా-రిధి కౌర్ (భారత్) జోడీ టైటిల్ దక్కించుకుంది.

మన పోరాటం సరిపోలేదు

టీమిండియా మంచి స్కోరే చేసింది. తన పనైపోయిందనుకున్న విమర్శకుల నోళ్లను కోహ్లి బ్యాట్‌తో, చిరుతను తలపించే పరుగుతో మూయించాడు. 182 పరుగుల లక్ష్యం పాక్‌కు కష్టమైందే. కానీ ప్రధాన బౌలర్లు భువనేశ్వర్, హార్దిక్ పాండ్యా, చహల్ ముగ్గురు 40 పైచిలుకు పరుగులు సమర్పించుకోవడం, 18వ ఓవర్లో, పట్టుబిగించే దశలో ఆసిఫ్ అలీ క్యాచ్‌ను అర్ష్‌దీప్ నేలపాలు చేయడం, రవి బిష్ణోయ్, భువనేశ్వర్ వైడ్లకు గేట్లు ఎత్తేయడంతో టీమిండియా మ్యాచ్‌నే మూల్యంగా చెల్లించుకుంది.

- బౌలింగ్ వైఫల్యంతో భారత్ ఓటమి
- ఐదు వికెట్లతో పాక్ గెలుపు
- రాణించిన రిజ్వాన్, నవాజ్
- కోహ్లి శ్రమ వృథా
- రేపు శ్రీలంకతో భారత్ మ్యాచ్





నవాజ్

దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నీలో భారత్ జోరుకు 'సూపర్-4'లో పాకిస్తాన్ కళ్లెం వేసింది. గెలిచేందుకు అవసరమైన లక్ష్యం నిర్దేశించినా... పసలేని బౌలింగ్, పేలవమైన ఫీల్డింగ్‌తో రోహిత్ శర్మ బృందం ఐదు వికెట్ల తేడాతో పాకిస్తాన్ చేతిలో ఓడింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. కోహ్లి (44 బంతుల్లో 60; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. తర్వాత పాకిస్తాన్ 19.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ రిజ్వాన్ (51 బంతుల్లో 71; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) జట్టును ఒడ్డున పడేసే ఇన్నింగ్స్ ఆడాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మొహమ్మద్ నవాజ్ (20 బంతుల్లో 42; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించాడు. భారత బౌలర్లలో ఏ ఒక్కరూ ప్రభావవంతమైన బౌలింగ్ చేయలేకపోయారు. నేడు విశ్రాంతి దినం. రేపు సూపర్-4 రెండో లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకతో భారత్ ఆడుతుంది. ఫైనల్ చేరే అవకాశాలు సజీవంగా ఉండాలంటే శ్రీలంకపై భారత్ గెలవాల్సి ఉంటుంది.



కోహ్లి

ధనాధన్‌గా మొదలై...

టి20 మెరుపులకు తగ్గట్లే దాటిగా భారత్ ఇన్నింగ్స్ మొదలైంది. తొలి ఓవర్లోనే కెప్టెన్ రోహిత్ శర్మ కవర్స్‌లో ఫోర్, మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ బాదాడు. ఇదే జోరుతో 'హిట్‌మ్యాన్' రెండో ఓవర్లో మరో బౌండరీని మిడాఫ్ దిశగా తరలించాడు. ఇక మూడో ఓవర్లో రాహుల్ ఆట మొదలైంది. తొలి బంతిని చక్కని డ్రైవ్‌తో లాంగాఫ్‌లో సిక్స్ కొట్టిన తను ఆఖరి బంతిని నేరుగా బౌలర్ ఎండ్‌లోని సైట్ స్క్రీన్‌కు ముద్దాడించాడు. 3 ఓవర్లలో 34/0 స్కోరు... వెంటనే రవూఫ్‌ను రంగంలోకి దించితే తొలి రెండు బంతుల్ని రోహిత్ 4, 6గా మళ్లీ బౌండరీ లైన్‌ను దాటించాడు. ఐదో ఓవర్ రెండో బంతిని రాహుల్ ఫోర్ కొట్టడంతో జట్టు స్కోరు 50 పరుగులకు చేరింది.

దెబ్బ మీద దెబ్బ

ఐదు ఓవర్ల దాకా 54/0 స్కోరుతో బాగానే ఉంది. పవర్ ప్లేకు ఇంకో ఓవర్ మిగిలుంది. ఇంకేం మన ఓపెనర్లు ఇంకో రెండు మూడైనా తగిలిస్తారనుకుంటే రవూఫ్ తన రెండో ఓవర్ (ఇన్నింగ్స్ 6వ)లో గట్టి దెబ్బే తీశాడు. రోహిత్ (16 బంతుల్లో 28; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారీషాట్ ఆడేందుకు ప్రయత్నించగా బంతికాస్తా బ్యాట్ అంచును తాకి అక్కడే గాల్లోకి లేచింది. ఫఖర్ జమాన్, ఖుష్‌దిల్‌ల మధ్య క్యాచ్ చేజారుతుందనుకుంటే... జమాన్ చేతులకి అందని బంతిని ఖుష్‌దిల్ చక్కగా ఒడిసి పట్టుకున్నాడు. తర్వాత షాదాబ్ బౌలింగ్‌కు దిగిన తొలిబంతికే రాహుల్ (20 బంతుల్లో 28; 1 ఫోర్, 2 సిక్స్‌లు)ను బోల్తా కొట్టించాడు. లాంగాన్‌లో నవాజ్ క్యాచ్ అందుకోవడంతో 62 పరుగుల వద్ద రెండో వికెట్ కూలింది. కోహ్లికి జతయిన సూర్యకుమార్ (13) కూడా ఎక్కువసేపు నిలువలేదు. దీంతో భారత్ సగం ఓవర్లు ముగిసేసరికి 93/3 స్కోరు చేసింది.

రాణించిన కోహ్లి

తర్వాత క్రీజులోకి హార్డ్ హిట్టర్ రిషభ్ పంత్ (14) వచ్చినప్పటికీ స్కోరు, జోరు రెండూ తగ్గాయి. 11వ ఓవర్లో టీమిండియా 100 పరుగులు దాటింది. తన వికెట్ ప్రాధాన్యం దృష్ట్యా కోహ్లి చూసుకొని ఆడగా, పంత్ కాస్త ఆలస్యంగా తానెదుర్కొన్న 8వ బంతికి ఫోర్ కొట్టాడు. మరుసటి ఓవర్లో మరో బౌండరీ కొట్టిన పంత్ అత్యుత్సాహానికి పోయి మూల్యం చెల్లించుకున్నాడు. షాదాబ్ గూగ్లీని రివర్స్‌స్వీప్ ఆడి బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో ఉన్న ఆసిఫ్ అలీ చేతుల్లో పెట్టాడు. ఆఖర్లో శివమెత్తే హార్దిక్ పాండ్యా (0) చెత్త షాట్ ఆడి డకౌటయ్యాడు. ఓ రకంగా స్లాగ్ ఓవర్లలో భారీషాట్లతో విరుచుకుపడే బ్యాటర్స్‌ను కోల్పోయిన భారత్‌ను కోహ్లి ఆదుకున్నాడు. దీపక్ హుడా (11 బంతుల్లో 16; 2 ఫోర్లు)తో కలిసి పటిష్టమైన స్కోరుకు బాటవేశాడు. కోహ్లి ఇన్నింగ్స్‌లో బౌండరీల రూపంలో వచ్చినవి 22 పరుగులే అయినా యువ ఆటగాళ్లకు కూడా సాధ్యంకానీ రీతిలో చకచకా సింగిల్స్, డబుల్స్ పిండుకున్నాడు. 36 బంతుల్లోనే (4ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ చేసిన కోహ్లి ఆఖరి ఓవర్లో రనౌటయ్యాడు. రవి బిష్ణోయ్ (2 బంతుల్లో 8 నాటౌట్;) చివరి 2 బంతుల్ని బౌండరీలకు తరలించాడు. పాక్ బౌలర్లు నసీమ్ షా, హస్‌నైన్, రవూఫ్, నవాజ్ తలా ఒక వికెట్ తీశారు.



రిజ్వాన్

గెలిపించిన రిజ్వాన్

భారీ లక్ష్యం ఛేదించే క్రమంలో పాక్ ఆరంభంలోనే కెప్టెన్ బాబర్ ఆజమ్ (14) వికెట్‌ను కోల్పోయింది. తర్వాత ఓపెనర్ రిజ్వాన్, ఫఖర్ జమాన్ (15)తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఏడో ఓవర్లలో పాక్ 50 పరుగులను చేరుకుంది. 9వ ఓవర్లో చహల్... ఫఖర్‌ను పెవిలియన్ చేర్చాడు. 10 ఓవర్లు ముగిసేసరికి పాక్ 76/2 స్కోరు చేసింది. గెలిచేందుకు ఇంకా వందకు పైగా పరుగులు చేయాల్సిన స్థితి! అయితే 11వ ఓవర్ నుంచి 15వ ఓవర్‌దాకా పాక్ బ్యాటింగ్‌లో వేగం పుంజుకుంది. ఇటు రిజ్వాన్, అటు నవాజ్ చెలరేగడంతో ఈ ఐదు ఓవర్లలో 10 పరుగులకు తక్కువ కాకుండా ఓవరాల్‌గా 59 పరుగులు రావడమే జట్టును గెలుపు మలుపు తిప్పింది. రిజ్వాన్ 37 బంతుల్లో (4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫిఫ్టీ కూడా పూర్తి చేశాడు. ఇక ఆఖరి 30 బంతుల్లో 47 పరుగుల సమీకరణం పాక్‌కే అనుకూలంగా మారింది. అయితే వరుస ఓవర్లలో దంచేస్తున్న నవాజ్‌ను భువీ, పాతుకుపోయిన రిజ్వాన్‌ను హార్దిక్ అవుట్ చేయడంతో ఆశలు రేగాయి. బిష్ణోయ్ 18వ ఓవర్లో ఏకంగా 3 వైడ్లు వేసి 8 పరుగులిచ్చాడు. అయినప్పటికీ 12 బంతుల్లో 26 పరుగుల సమీకరణం టీమిండియా విజయంపై ఆశల్ని పెంచింది. కానీ అనుభవజ్ఞుడైన భువీ కూడా 2 వైడ్లు వేసి సిక్స్, 2 బౌండరీలు సమర్పించుకోవడంతో ఏకంగా 19 పరుగులు వచ్చాయి. దీంతో ఆఖరి ఓవర్లో ఆసిఫ్ అలీ (8 బంతుల్లో 16; 2 ఫోర్లు, 1 సిక్స్) ఎల్బీగా వెనుదిరిగినా ఇంకో బంతి మిగిలుండగానే పాక్ గెలిచింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) నవాజ్ (బి) షాదాబ్ 28; రోహిత్ (సి) ఖుష్‌దిల్ (బి) రవూఫ్ 28; కోహ్లి (రనౌట్) 60; సూర్యకుమార్ (సి) ఆసిఫ్ అలీ (బి) నవాజ్ 13; పంత్ (సి) ఆసిఫ్ అలీ (బి) షాదాబ్ 14; పాండ్యా (సి) నవాజ్ (బి) హస్‌నైన్ 0; దీపక్ హుడా (సి) నవాజ్ (బి) నసీమ్ షా 16; భువనేశ్వర్ (నాటౌట్) 0; బిష్ణోయ్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 181. వికెట్ల పతనం:** 1-54, 2-62, 3-91, 4-126, 5-131, 6-168, 7-173. **బౌలింగ్:** నసీమ్ షా 4-0-45-1, హస్‌నైన్ 4-0-38-1, రవూఫ్ 4-0-38-1, నవాజ్ 4-0-25-1, షాదాబ్ 4-0-31-2.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: రిజ్వాన్ (సి) సూర్యకుమార్ (బి) పాండ్యా 71; బాబర్ ఆజమ్ (సి) రోహిత్ (బి) బిష్ణోయ్ 14; ఫఖర్ (సి) కోహ్లి (బి) చహల్ 15; నవాజ్ (సి) హుడా (బి) భువనేశ్వర్ 42; ఖుష్‌దిల్ (నాటౌట్) 14; ఆసిఫ్ అలీ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 16; ఇఫ్తికార్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (19.5 ఓవర్లలో 5 వికెట్లకు) 182. వికెట్ల పతనం:** 1-22, 2-63, 3-136, 4-147, 5-180. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-40-1; అర్ష్‌దీప్ 3.5-0-27-1, రవి బిష్ణోయ్ 4-0-26-1, పాండ్యా 4-0-44-1, చహల్ 4-0-43-1.

తిలక్ వర్మ సెంచరీ

న్యూజిలాండ్ 'ఎ'తో భారత్ 'ఎ' తొలి టెస్టు 'డ్రా'



బెంగళూరు: అందివచ్చిన అవకాశాన్ని హైదరాబాద్ యువ క్రికెటర్ నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ సద్వినియోగం చేసుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ (నాలుగు/ఐదు రోజుల మ్యాచ్) క్రికెట్ ఫార్మాట్‌లో తొలి సెంచరీ నమోదు చేసి ఆకట్టుకున్నాడు. న్యూజిలాండ్ 'ఎ' జట్టుతో 'డ్రా'గా ముగిసిన నాలుగు రోజుల తొలి అనధికారిక టెస్టులో భారత 'ఎ' జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 19 ఏళ్ల తిలక్ వర్మ (183 బంతుల్లో 121; 9 ఫోర్లు, 6 సిక్స్‌లు) అద్భుత శతకం సాధించాడు. మ్యాచ్ చివరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 492/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'ఎ' 143 ఓవర్లలో ఆరు వికెట్లకు 571 పరుగులవద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరు 82 పరుగులతో ఇన్నింగ్స్ కొనసాగించిన తిలక్ వర్మ అదే దూకుడుతో ఆడి తొలి సెంచరీ సాధించాడు. భారత్ 'ఎ' మరో బ్యాటర్ రజత్ పాటిదార్ (256 బంతుల్లో 176; 14 ఫోర్లు, 4 సిక్స్‌లు) తన ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరుకు ఆరు పరుగులు జోడించి పెవిలియన్ చేరుకున్నాడు. తిలక్ వర్మ అవుటైన వెంటనే భారత్ 'ఎ' తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. న్యూజిలాండ్ బౌలర్లలో రచిన్ రవీంద్ర రెండు వికెట్లు తీశాడు. 171 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ 'ఎ' 61 ఓవర్లలో నాలుగు వికెట్లకు 133 పరుగులు సాధించడంతో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. సిరీస్‌లోని రెండో అనధికారిక టెస్టు గురువారం నుంచి హుబ్లీలో జరుగుతుంది.



ఎదురులేని నాదల్

- ప్రిక్వార్టర్ ఫైనల్లోకి స్పెయిన్ స్టార్
- గాస్కేపై వరుసగా 18వ విజయం
- యూఎస్ ఓపెన్ టోర్నీ

న్యూయార్క్: తొలి రెండు రౌండ్‌లలో విజయం సాధించేందుకు చెమటోడ్చిన స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ మూడో రౌండ్‌లో మాత్రం రఫ్ఫాడించాడు. తన చిరకాల ప్రత్యర్థి రిచర్డ్ గాస్కే (ఫ్రాన్స్)పై మరోసారి సంపూర్ణ ఆధిపత్యం చలాయించి అతనిపై వరుసగా 18వ విజయం సాధించాడు. తద్వారా టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో నాదల్ 11వసారి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రపంచ 91వ ర్యాంకర్ రిచర్డ్ గాస్కేతో జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో ప్రపంచ మూడో ర్యాంకర్ నాదల్ 6-0, 6-1, 7-5తో అలవోకగా గెలుపొందాడు. 2 గంటల 17 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నాదల్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేశాడు. 35 విన్నర్స్ కొట్టిన నాదల్ 24 సార్లు నెట్ వద్దకు దూసుకొచ్చి 19 సార్లు పాయింట్లు గెలిచాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో అమెరికా ప్లేయర్ ఫ్రాన్సిస్కో టియాఫోతో ఆడతాడు. మూడో రౌండ్‌లో టియాఫో 7-6 (9/7), 6-4, 6-4తో 14వ సీడ్ డీగో ష్వార్ట్‌జ్‌మన్ (అర్జెంటీనా)పై విజయం సాధించాడు. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్) 6-3, 6-3, 6-3తో జెన్సన్ బ్రూక్స్‌బై (అమెరికా)పై, తొమ్మిదో సీడ్ రుబ్లెవ్ (రష్యా) 6-4, 2-6, 6-7 (3/7), 6-4, 7-6 (10/7)తో షపోవలోవ్ (కెనడా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.



స్వియాటెక్

స్వియాటెక్ ముందంజ

మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. మూడో రౌండ్‌లో స్వియాటెక్ 6-3, 6-4తో లౌరెన్ డేవిస్ (అమెరికా)పై నెగ్గింది. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో ఎనిమిదో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) 6-2, 6-7 (6/8), 6-0తో యు యువాన్ (చైనా)పై, డానియెలా కొలిన్స్ (అమెరికా) 6-4, 7-6 (11/9)తో అలైజ్ కార్నెట్ (ఫ్రాన్స్)పై, పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్) 5-7, 6-3, 7-6 (12/10)తో తొమ్మిదో సీడ్ ముగురుజా (స్పెయిన్)పై, అజరెంకా (బెలారస్) 6-3, 6-0తో పెట్రా మార్టిక్ (క్రొయేషియా)పై, కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) 5-7, 6-4, 6-3తో 13వ సీడ్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్)పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు.



ఖో-ఖో లీగ్ విజేత ఒడిశా జగర్‌నాట్స్

రన్నరప్ తెలుగు యోధాస్

పుణే: చివరి క్షణం వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో ఒడిశా జగర్‌నాట్స్ పైచేయి సాధించి అల్టిమేట్ ఖో-ఖో లీగ్ చాంపియన్‌గా అవతరించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఒడిశా జగర్‌నాట్స్ 46-45తో ఒక్క పాయింట్ తేడాతో తెలుగు యోధాస్ జట్టును ఓడించింది. మ్యాచ్ ముగియడానికి 14 సెకన్లు ఉన్నాయనగా తెలుగు యోధాస్ 45-43తో రెండు పాయింట్ల ఆధిక్యంలో ఉంది. ఈ దశలో ఒడిశా ప్లేయర్ సూరజ్ అద్భుతమైన డైవ్ చేసి తెలుగు యోధాస్ ప్లేయర్ అవధూత్ పాటిల్‌ను అవుట్ చేసి మూడు పాయింట్లు స్కోరు చేశాడు. దాంతో ఒడిశాకు చిరస్మరణీయ విజయం సొంతమైంది. విజేతగా నిలిచిన ఒడిశా జట్టుకు రూ. కోటి ప్రైజ్‌మనీ దక్కింది. రన్నరప్ తెలుగు యోధాస్‌కు రూ. 50 లక్షలు... మూడో స్థానంలో నిలిచిన గుజరాత్ జెయింట్స్‌కు రూ. 30 లక్షలు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు రామ్‌జీ కశ్యప్ (చెన్నై క్విక్‌గన్స్; రూ. 5 లక్షలు).. 'బెస్ట్ అటాకర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు అభినందన్ పాటిల్ (గుజరాత్; రూ. 2 లక్షలు)... 'బెస్ట్ డిఫెండర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు దీపక్ మాధవ్ (తెలుగు యోధాస్; రూ. 2 లక్షలు)... 'యంగ్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు మదన్ (చెన్నై క్విక్‌గన్స్; రూ. 2 లక్షలు) గెల్చుకున్నారు.



యూకీ సాకేత్

సాకేత్-యూకీ జోడీకి టైటిల్

మలోర్కా (స్పెయిన్): ఈ ఏడాది తన అద్భుత ఫామ్ కొనసాగిస్తూ ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ ప్లేయర్, భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు సాకేత్ మైనేని ఐదో చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. రాఫా నాదల్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నీలో సాకేత్-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ విజేతగా నిలిచింది. ఫైనల్లో సాకేత్-యూకీ ద్వయం 6-2, 6-2తో మారెక్ గెన్‌జెల్-లుకాస్ రొసోల్ (చెక్ రిపబ్లిక్) జోడీపై గెలిచింది. విజేతగా నిలిచిన సాకేత్-యూకీ జోడీకి 2,670 యూరోల (రూ. 2 లక్షల 11 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 80 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

సినిమా

షూటింగ్‌కి వేళాయె!



మహేశ్‌బాబు

'అతడు' (2005), 'ఖలేజా'(2010) చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ముచ్చటగా మూడోసారి ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెల రెండోవారం నుంచి ప్రారంభం కానుందనే టాక్ వినిపిస్తోంది. తొలుత ఓ యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేశారట చిత్రబృందం. 'మహర్షి' చిత్రం తర్వాత మహేశ్ బాబు, పూజాహెగ్డే జంటగా నటిస్తున్న సినిమా ఇది. చినబాబు (ఎస్.రాధాకృష్ణ) నిర్మిస్తున్న ఈ మూవీ 2023 ఏప్రిల్ 28న రిలీజ్ కానుంది.

శాసనసభలో...



ఐశ్వర్య

ఇంద్రసేన హీరోగా, రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'శాసనసభ'. 'వెంకటాపురం' ఫేమ్ వేణు మడికంటి దర్శకత్వం వహిస్తున్నారు. తులసి రామ్ సప్పని, షణ్ముగం సప్పని నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాలో హీరోయిన్‌గా ఐశ్వర్యారాజ్ భకునిను తీసుకున్నట్లుగా చిత్రబృందం ప్రకటించింది. ఆదివారం (సెప్టెంబరు 4) ఐశ్వర్య బర్త్ డే. ఈ సందర్భంగా 'శాసనసభ' చిత్రంలో భావన అనే పాత్రలో ఐశ్వర్య నటిస్తున్నారు''అని చిత్ర యూనిట్ వెల్లడించింది. పొలిటికల్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ మూవీలో సోనియా అగర్వాల్, పృథ్వీరాజ్ నటిస్తున్నారు.

ఆహ్లాదకరమైన ప్రేమకథ



జైద్‌ఖాన్, సోనాల్

కర్ణాటక ఎమ్మెల్యే జమీర్ అహ్మద్ కుమారుడు జైద్‌ఖాన్ 'బనారస్' చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. 'బెల్ బాటమ్' ఫేమ్ జయతీర్థ దర్శకుడు. సోనాల్ మోంటెరో కథానాయిక. ఎన్‌కె ప్రొడక్షన్స్‌పై తిలకరాజ్ బల్లాల్ నిర్మించారు. నవంబర్ 4న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ''బనారస్ సిటీ (వారణాసి) నేపథ్యంలో సాగే ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రమిది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి'' అని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: అద్వైత గురుమూర్తి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వైబి రెడ్డి.

గోవాలో వీకెండ్

చింతా పృథ్వీ చరణ్, చంద్రాదిత్య, భాస్కర శర్మ, హర్ష నల్లబెల్లి, యశస్విని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'హ్యాపీ వీకెండ్'. కారాడి వెంకటేశ్వర్లు దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాత రాధాకృష్ణతో కలిసి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ గోవాలో ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. 'హారర్ కామెడీ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతున్న సినిమా ఇది. రిలీజ్ డేట్‌ని త్వరలో వెల్లడిస్తాం'' అన్నారు దర్శక-నిర్మాతలు.



పృథ్వీ చరణ్, యశస్విని

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



ప్రణీత, ఉపేంద్ర, మీనాక్షి

ఉపేంద్ర హీరోగా నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం 'కంచర్ల'. రెడ్డెం యాద కుమార్ దర్శకుడు. మీనాక్షీ జైస్వాల్, ప్రణీత హీరోయిన్లు. కె.అచ్యుతరావు సమర్పణలో నిర్మిస్తున్న ఈ సినిమా వైజాగ్‌లో ప్రారంభమైంది. రెడ్డెం యాద కుమార్ మాట్లాడుతూ- ''యువకులు రాజకీయాల్లోకి రావాలి.. సేవా దృక్పథంతో ఉండాలి అనే కాన్సెప్ట్‌తో ఈ మూవీ ఉంటుంది తెరకెక్కిస్తున్నాం'' అన్నారు. ''లవ్ అండ్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు కె.అచ్యుతరావు.

భావోద్వేగాలు బాగున్నాయంటున్నారు

- గౌతమ్ కృష్ణ

''మంచి లవ్ స్టోరీ, ఫ్యామిలీ డ్రామాగా రూపొందిన చిత్రం 'ఆకాశ వీధుల్లో'. సినిమా చాలా బాగుందని, అన్ని భావోద్వేగాలు అద్భుతంగా పండాయని ప్రేక్షకులు చెబుతుండటం సంతోషంగా ఉంది'' అని గౌతమ్ కృష్ణ అన్నారు. గౌతమ్ కృష్ణ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'ఆకాశ వీధుల్లో'. పూజిత పొన్నాడ హీరోయిన్. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ మూవీ సక్సెస్ మీట్‌లో గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ-''ఆకాశ వీధుల్లో' ని తమిళ్, మలయాళం, కన్నడ, హిందీలో త్వరలో విడుదల చేయనున్నాం'' అన్నారు. ''మా సినిమా, ప్రత్యేకించి మా నటన బాగుందని మెసేజ్‌లు పెడుతున్నారు.. మీ ప్రేమకు థ్యాంక్స్'' అన్నారు పూజిత.



గౌతమ్, పూజిత

స్టాక్‌ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	37	58,803
నిఫ్టీ ▽	3	17,543

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	11,631	▽	154
డోజోన్స్	31,318	▽	338
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,281	▲	133
డాక్స్	13,050	▲	420
షాంఘై	3,186	▲	1
నికాయ్	27,651	▽	11

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

గౌరవం కోసం పోరాటం..

టాటా గ్రూప్‌ను కొత్త బాటలో నడిపే ప్రయత్నం • అత్యధిక వాటాలున్నా .. అర్ధాంతరంగా పదవుల నుంచి తొలగింపు • తుది వరకూ పోరాడిన సైరస్‌ మిస్త్రీ



ముంబై: పారిశ్రామిక దిగ్గజం, టాటా గ్రూప్‌ మాజీ చైర్మన్‌ సైరస్‌ మిస్త్రీ ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. దీనితో, కొన్నాళ్ల క్రితమే టాటా గ్రూప్‌ నుంచి అర్ధాంతరంగా ఉద్వాసనకు గురైన మిస్త్రీ తాజాగా జీవితం నుంచి కూడా అర్ధాంతరంగా నిష్క్రమించినట్లయింది. టాటా సన్స్‌లో అత్యధికంగా 18 శాతం పైగా వాటా ఉన్న షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్‌ తరఫున 2012లో టాటా గ్రూప్‌ చైర్మన్‌గా పగ్గాలు చేపట్టే వరకూ.. కుటుంబ వ్యాపార వర్గాల్లో తప్ప సైరస్‌ మిస్త్రీ పేరు పెద్దగా బైట వినిపించేది కాదు. 1991లో మిస్త్రీ తమ కుటుంబ వ్యాపార సంస్థ షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్‌లో (ఎస్‌పీ) డైరెక్టరుగా చేరారు. 1994లో ఎండీగా నియమితులయ్యారు. ఎస్‌పీ గ్రూప్‌ కార్యకలాపాలు మెరైన్, ఆయిల్, గ్యాస్, రైల్వే తదితర రంగాల్లోకి విస్తరించడంలో ప్రధాన పాత్ర పోషించారు. 2006లో కీలకమైన టాటా సన్స్‌ బోర్డులో చేరారు. అప్పటివరకూ ఆయన పలు టాటా కంపెనీల బోర్డుల్లో సభ్యుడిగా కొనసాగారు. సాధారణంగా నలుగురిలో ఎక్కువగా కలవకపోయినా.. తెలిసినంత వరకూ వ్యాపార దక్షత విషయంలో ఆయనకు మంచి పేరు ఉండేది. ఇదే టాటా గ్రూప్‌ చీఫ్‌ రతన్‌ టాటా తన వారసుడిగా మిస్త్రీని ఎంచుకునేలా చేసింది. వాస్తవానికి టాటా పగ్గాలు చేపట్టడానికి మిస్త్రీకి ఇష్టం లేకపోయినప్పటికీ రతన్‌ టాటా స్వయంగా నచ్చచెప్పడంతో ఆయన అంగీకరించినట్లు సన్నిహిత వర్గాలు చెబుతాయి. అలా 44 ఏళ్ల వయస్సులో, దేశంలోనే అతి పెద్ద దిగ్గజాల్లో ఒకటైన టాటా గ్రూప్‌ చీఫ్‌గా బాధ్యతలు తీసుకున్న మిస్త్రీ సంస్థను కొత్త బాటలో నడిపించే ప్రయత్నం చేశారు. టాటాల కుటుంబానికి చెందిన వారు కాకుండా వేరొకరు టాటా గ్రూప్‌నకు సారథ్యం వహించడం అదే ప్రథమం. కార్పొరేట్‌ గవర్నెన్స్‌ ప్రమాణాలను మెరుగుపర్చడంపై ఆయన దృష్టి పెట్టారు. నష్టాల్లో ఉన్న సంస్థలను, ఉత్పత్తులను నిలిపివేసి.. లాభదాయక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అప్పటివరకూ ఎక్కువగా బిజినెస్‌ టు బిజినెస్‌ (బీ2బీ)కి పరిమితంగా ఉంటున్న సంస్థ .. మరింతగా వినియోగదారులకు సంబంధించిన ఉత్పత్తులు, సేవలవైపు మళ్లే విధంగా ప్రణాళికలను రూపొందించేందుకు కృషి చేశారు. ఇందుకోసం తగు సిఫార్సులు చేసేందుకు టాటా గ్రూప్‌లోని సీనియర్‌ ఎగ్జిక్యూటివ్‌లు, పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తలతో ఒక గ్రూప్‌ ఎగ్జిక్యూటివ్‌ కౌన్సిల్‌ను (జీఈసీ) ఏర్పాటు చేశారు.

టాటాతో విభేదాలు.. ఉద్వాసన ..

అయితే, ఈ క్రమంలో వ్యాపార వ్యవహార శైలి విషయంలో మిస్త్రీ, రతన్‌ టాటాల మధ్య విభేదాలు తలెత్తాయి. చివరికి 2016 అక్టోబర్‌లో ఆయన అర్ధాంతరంగా చైర్మన్‌ పదవి నుంచి ఉద్వాసనకు గురయ్యారు. ఆ తర్వాత టాటా సన్స్‌ డైరెక్టరుగా కూడా ఆయన్ను తప్పించారు. మిస్త్రీ కుటుంబం అతి పెద్ద వాటాదారే అయినప్పటికీ సైరస్‌ తన పదవిని కాపాడుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాల్లో ఎన్‌ చంద్రశేఖర్‌ (టీసీఎస్‌ చీఫ్‌) .. గ్రూప్‌ పగ్గాలు అందుకున్నారు.

న్యాయస్థానాల్లో చుక్కెదురు..

అవమానకరంగా తనను పంపించిన తీరుపై మిస్త్రీ న్యాయపోరుకు దిగారు. స్వయంగా టాటాపైనే విమర్శలు ఎక్కుపెట్టారు. ''అహంభావంతో ఒక్కరు'' తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలతో గ్రూప్‌ వ్యాపారానికి నష్టం జరుగుతోందని, టాటా వాస్తవాలు మాట్లాడటం లేదని ఆరోపించారు. తనను తొలగించడంపై నేషనల్‌ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను (ఎన్‌సీఎల్‌టీ) ఆశ్రయించారు. అంతకు కొన్నాళ్ల క్రితమే తన పనితీరు అద్భుతమని ప్రశంసించి, అంతలోనే అలా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ఈ క్రమంలో బాంబే డయింగ్‌ చీఫ్‌ నుస్లీ వాడియా, ఆయన చిన్ననాటి స్నేహితురాలు.. ఎన్‌సీపీ చీఫ్‌ శరద్‌ పవార్‌ కుమార్తె సుప్రియా సూలే తదితరులు ఆయన పక్షాన నిల్చారు. అయితే, బోర్డు, మెజారిటీ వాటాదారులు ఆయనపై విశ్వాసం కోల్పోయారంటూ ఎన్‌సీఎల్‌టీ 2018లో మిస్త్రీ పిటీషన్‌ను తోసిపుచ్చింది. దీనిపై ఆయన నేషనల్‌ కంపెనీ లా అప్పిలేట్‌ ట్రిబ్యునల్‌ (ఎన్‌సీఎల్‌ఏటీ)ని ఆశ్రయించగా ఆయనకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయి. కానీ దీనిపై టాటాలు సుప్రీం కోర్టులో అప్పీలు చేయగా 2021 మార్చిలో ఇచ్చిన తుది తీర్పులో.. అత్యున్నత న్యాయస్థానం టాటాల పక్షం వహించింది. అయితే, అంతకు ముందు తీర్పులో ఆయనపై చేసిన కొన్ని ప్రతికూల వ్యాఖ్యలను తొలగించడం ద్వారా కొంత ఊరటనిచ్చింది.

ఐపీవోలు.. లాభాల తోట కాదు!

లిస్టింగ్‌లోనే 100 శాతం లాభం. మరొకటి లిస్టింగ్‌ రోజే 150 శాతం లాభం ఇచ్చింది. ఇనీషియల్‌ పబ్లిక్‌ ఆఫర్ల (ఐపీవో) గురించి ఈ తరహా వార్తలు వింటుంటే రిటైల్‌ ఇన్వెస్టర్లలో ఎక్కడలేని ఉత్సాహం వచ్చేస్తుంది. ఐపీవోలో షేర్లు అలాట్‌ అయితే లాభాల పంట పండినట్టే! అన్న వేలంవెర్రి కొన్ని సందర్భాల్లో మార్కెట్లో కనిపిస్తుంటుంది. కానీ, ఇది అన్ని వేళలా ఉండే ధోరణి కాదు. బుల్‌ మార్కెట్‌ యూటర్న్‌ తీసుకుంటే, అనూహ్య ఘటనలు చోటు చేసుకుంటే అంచనాలు తప్పుతాయి. నష్టాలు పలకరిస్తాయి. గతేడాది మార్కెట్ల ర్యాలీ సమయంలో ఐపీవోల పట్ల ఇన్వెస్టర్లలో విపరీతమైన యూఫోరియా నెలకొంది. 2022 వచ్చేసరికి పరిస్థితి తలకిందులైంది. స్టాక్స్‌ భారీ పతనంతో ఆ యూఫోరియా ఆవిరైపోయింది. మార్కెట్‌లో ఈ రకమైన అస్థిరతలు ఎప్పుడూ ఉంటాయి. అందుకే మార్కెట్లో నిలిచి గెలవాలంటే, పెట్టుబడులన్నవి లక్ష్యాలకు అనుగుణంగానే ఉండాలనేది నిపుణుల మాట. ఐపీవోల్లో పెట్టుబడి విషయంలో ఇన్వెస్టర్లు పరిశీలించాల్సిన ముఖ్యమైన విషయాలను తెలియజేసే కథనమిది...



రాబడుల పంట పండుతుందన్న గ్యారెంటీ లేదు

- నష్టాలకూ సిద్ధపడాల్సిందే...
- ధరలపై డిమాండ్‌–సప్లయ్‌ ప్రభావం
- ఫండమెంటల్స్‌ ఆధారంగా పెట్టుబడి
- దీర్ఘకాలానికైతే ఆందోళన అక్కర్లేదు
- 'ఫోమో' అస్సలు పనికిరాదు



జొమాటో షేరు ఐపీవో ఇష్యూ ధర రూ.76. లిస్టింగ్‌ ధర రూ.115. అక్కడి నుంచి రూ.169 వరకు వెళ్లింది. రూ.140 ధరలో ఉన్నప్పుడు బ్రోకరేజీ సంస్థ జెఫరీస్‌ రూ.175 వరకు పెరుగుతుందని లక్ష్యాన్ని ఇచ్చింది. కానీ, ఒక జొమాటో షేరుకు రూ.41 మించి పెట్టడం దండగని వ్యాల్యూయేషన్‌ గురువుగా ప్రసిద్ధి చెందిన అశ్వత్‌ దామోదరన్‌ ఐపీవో సమయంలోనే సూచించారు. సరిగ్గా ఆయన చెప్పినట్టు జొమాటో ఇటీవలే రూ.40.55కు పడిపోయి అక్కడి నుంచి కోలుకుంది. ఆ సందర్భంలో జొమాటో సహేతుక విలువ రూ.35 అంటూ దామోదరన్‌ సవరించారనుకోండి. ఒక్క జొమాటోనే అని కాదు. న్యూఏజ్‌ వ్యాపారాల్లో ఉన్న అన్ని ఐపీవోలు లిస్టింగ్‌ తర్వాత ఇన్వెస్టర్లకు చేదు ఫలితాలను ఇచ్చినవే. అందుకే లాభాల వెర్రితనం కాకుండా.. విలువలకు ప్రాధాన్యం ఇచ్చి ఇన్వెస్ట్‌ చేయడం ద్వారానే విలువైన క్యాపిటల్‌ను కాపాడుకోవచ్చని మార్కెట్‌ పండితుల సూచన.

•••

2021 జూలైలో జొమాటో ఐపీవోకు వచ్చింది. బ్లాక్‌ బస్టర్‌గా 38 రెట్లు అధిక స్పందన అందుకుంది. రూ.9,000 కోట్ల ఐపీవోకు ఈ స్థాయి స్పందన అంటే చిన్నదేమీ కాదు. లిస్టింగ్‌లోనే 64 శాతం లాభాన్ని పంచింది. నైకా అయితే లిస్టింగ్‌ రోజే 96 శాతం లాభాలను ఇచ్చింది. ''ఐపీవోలో ఒక కంపెనీ జారీ చేసే షేరు ధరను నిర్ణయించే విధానం ఈ ఏడాది మార్చి 31వరకు వేరుగా ఉంది. వ్యక్తిగత ఇన్వెస్టర్లకు సైతం నిధుల లభ్యత దండిగా ఉంది. దీంతో వారు రుణం తీసుకుని మరీ ఐపీవోలకు దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నో రెట్ల అధిక స్పందనతో రిస్క్‌ తీసుకునే ధోరణి పెరిగి ఆయా షేర్ల ధరల వృద్ధికి దారితీసింది. కానీ, ఈ ఏడాది ఏప్రిల్‌ 1 నుంచి ఐపీవో నిబంధనల్లో మార్పు చోటు చేసుకుంది. దీంతో ఆ తర్వాత నుంచి వచ్చిన ఐపీవోల్లో కేవలం ఒక్క ఇష్యూలోనే అధిక విలువ కలిగిన ఇన్వెస్టర్ల కోటా (హెచ్‌ఎన్‌ఐలు) డబుల్‌ డిజిట్‌లో సబ్‌స్క్రయిబ్‌ కావడం గమనించాలి''అని ఇన్వెస్ట్‌మెంట్‌ అడ్వైజరీ సంస్థ 'క్రిస్‌' డైరెక్టర్‌ అర్జున్‌ కేజ్రీవాల్‌ తెలిపారు. గతేడాది ఐపీవోకు వచ్చిన, కొత్తగా లిస్ట్‌ అయిన వాటిల్లో అధిక శాతం గరిష్ట స్థాయి నుంచి గణనీయంగా పడిపోవడాన్ని గమనించొచ్చు. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలతో ముఖ్యంగా గడిచిన ఆరు నెలల్లో ఇవి ఎక్కువ నష్టాలను చవిచూశాయి.

ప్రస్తుతం జొమాటో ధర (రూ.60)ను చూస్తే గరిష్ట స్థాయి (రూ.169) నుంచి 60 శాతానికి పైగా తగ్గినట్టు తెలుస్తుంది. పాలసీబజార్‌ (పీబీ ఫిన్‌టెక్‌) గరిష్ట ధర (రూ.1,470) నుంచి చూస్తే 65 శాతం తక్కువలో ట్రేడ్‌ అవుతోంది. నైకా (ఎఫ్‌ఎస్‌ఎన్‌ ఈకామర్స్‌) గరిష్ట ధర రూ.2,574 కాగా, 47 శాతం తక్కువలో ట్రేడ్‌ అవుతోంది. ఇక పేటీఎం అయితే ఇష్యూ ధర రూ.2,150 కాగా, 52 వారాల గరిష్ట స్థాయి రూ.1,961 మాత్రమే. ఈ ధర నుంచి చూస్తే 60 శాతం తక్కువలో ట్రేడ్‌ అవుతోంది. భారీ నష్టాల్లో ఉన్న న్యూఏజ్‌ కంపెనీలు, టెక్నాలజీ సంస్థలు ఐపీవోలకు వచ్చి పెద్ద మొత్తంలో నిధులు సమీకరించడాన్ని చూశాం. ఆన్‌లైన్‌ ఫార్మసీ సంస్థ ఫార్మ్‌ఈజీని ప్రమోట్‌ చేస్తున్న ఏపీఐ హోల్డింగ్స్‌ కూడా నష్టాల్లో నడుస్తున్నదే. ఈ సంస్థ కూడా ఐపీవోకు దరఖాస్తు పెట్టుకుంది. కానీ, న్యూఏజ్‌ వ్యాపార కంపెనీల షేర్లు పేకమేడల్లా కూలిపోతున్న తరుణంలో, ప్రతికూల మార్కెట్‌ పరిస్థితుల్లో ఐపీవోకు రావడం తగదని భావించి ఇటీవలే తన ప్రతిపాదనను ఉపసంహరించుకుంది. ఈ తరహా షేర్ల వ్యాల్యూయేషన్‌ నిర్ణయ విధానం సంప్రదాయానికి భిన్నమైనది. వ్యాపారంలో భారీ వృద్ధి, భవిష్యత్తులో వచ్చే లాభాల అంచనాల ఆధారంగా వీటి షేర్ల ధర నిర్ణయమవుతుంటుంది. సుదీర్ఘకాలం పాటు (5–10–15–20 ఏళ్లు) వేచి చూస్తేనే.. ఇవి నిలిచి గెలుస్తాయా? లాభాలు కురిపిస్తాయా? అన్నది తేలుతుంది. కానీ, వీటిపై పెద్దగా అవగాహన లేని, ప్రణాళిక లేని ఇన్వెస్టర్లు లిస్టింగ్‌ లాభాల కోసం, స్వల్పకాల లాభాల కోసం వీటికి దరఖాస్తు చేసుకుని నష్టపోయారు.

ఎన్నో ఉదాహరణలు...



అంతెందుకు ఎల్‌ఐసీ ఐపీవోనే తీసుకుందాం. దేశవ్యాప్తంగా అధిక శాతం ఇన్వెస్టర్లలో మంచి అంచనాలే ఉన్నాయి. రిటైల్‌ ఇన్వెస్టర్లకు, పాలసీదారులకు ఇష్యూ ధరలో డిస్కౌంట్‌ కూడా లభించింది. కానీ, లిస్టింగ్‌లో నిరాశపరిచింది. అంతేకాదు, ఆ తర్వాత నుంచి అది నష్టాల్లోనే ట్రేడ్‌ అవుతోంది. ఒక్కో షేరు జారీ ధర రూ.949 కాగా, బీఎస్‌ఈలో నమోదైన గరిష్ట ధర రూ.920. అక్కడి నుంచి 30 శాతం నష్టపోయి రూ.700కు దిగువన ట్రేడ్‌ అవుతోంది. ఎల్‌ఐసీ బీమా రంగంలో గొప్ప కంపెనీ. భారీ లాభాల్లో ఉన్న బ్లూచిప్‌ సంస్థ. ఆ రంగంలో లీడర్‌. అయినా కానీ లిస్టింగ్‌లో లాభాలు పంచలేకపోయింది. దీనికి కారణం ప్రతికూల మార్కెట్‌ పరిస్థితులకుతోడు, ఎల్‌ఐసీ అధిక వ్యాల్యూయేషన్‌పై ఐపీవో రావడాన్ని కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలం కోసం ఎల్‌ఐసీలో ఇన్వెస్ట్‌ చేసిన వారికి ఈ నష్టాల బెడద ఉండదు. ఎందుకంటే ఇప్పటికీ మన దేశంలో బీమా వ్యాప్తి 5 శాతం మించలేదు. కనుక భవిష్యత్తులో వ్యాపార వృద్ధి అవకాశాలు దండిగా ఉన్నాయి. అయినా కానీ, స్వల్పకాలంలో లాభాలకు ఇక్కడ హామీ ఉండదు.


ఎందుకంటే..?

ఇటీవలి ఐపీవోల్లో ఇన్వెస్టర్ల చేతులు కాలడం వెనుక నిపుణులు ప్రధానంగా.. ఆయా కంపెనీల ఫండమెంటల్స్‌కు తోడు, స్థూల ఆర్థిక వాతావరణం అనుకూలంగా లేకపోవడాన్ని ప్రస్తావిస్తున్నారు. ''గతేడాది వ్యవస్థలో నగదు లభ్యత పుష్కలంగా ఉంది. దీంతో కొత్త టెక్నాలజీ కంపెనీల ధరలను పరుగుపెట్టించింది. ఇప్పుడు నగదు లభ్యత కఠినతరంగా మారింది. వడ్డీ రేట్లు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో ఈ షేర్లపై ప్రభావం పడింది''అని హేమ్‌ సెక్యూరిటీస్‌ సీనియర్‌ రీసెర్చ్‌ అనలిస్ట్‌ ఆస్తాజైన్‌ పేర్కొన్నారు.



వీటి వైపు చూడొచ్చా..?

కంపెనీల ఆర్థిక మూలాల ఆధారంగా పెట్టుబడుల నిర్ణయాలు తీసుకోవడం రిటైల్‌ ఇన్వెస్టర్లకు రక్షణాత్మకం అని భావించొచ్చు. ''జొమాటో షేరును గతేడాది ఇష్టపడని వారు లేరు. కానీ, ఇప్పుడు దీనికి అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు చూస్తే నికరంగా నష్టాలనే ఇచ్చింది. బ్లింకిట్‌ కొనుగోలుతో లాభాల్లోకి రావడానికి మరింత సమయం పడుతుంది. యాజమాన్యం ఫుడ్‌ డెలివరీ వ్యాపారంలో బ్రేక్‌ ఈవెన్‌కు సంబంధించి అంచనాలను ప్రకటించింది. ఈ విషయంలో ఇన్వెస్టర్లకు కూడా సందేహం లేదు. దీర్ఘకాల ఇన్వెస్టర్లు కొనుగోలుకు ఇదొక మంచి ఉదాహరణ అవుతుంది'' అని జెఫరీస్‌ తన నివేదికలో ప్రస్తావించింది. కోటక్‌ ఇనిస్టిట్యూషనల్‌ ఈక్విటీస్‌ రీసెర్చ్‌ గత నెలలో నైకా షేరుకు బై రేటింగ్‌ ఇచ్చింది. మార్కెటింగ్‌పై అధిక వ్యయాలతో మార్జిన్లు తగ్గుతున్నందున ఇదే నైకా స్టాక్‌కు రెడ్యూస్‌ (తగ్గించుకోవడం) రేటింగ్‌ను ఐఐఎఫ్‌ఎల్‌ సెక్యూరిటీస్‌ ప్రకటించింది. పేటీఎం, ఎల్‌ఐసీకి మోతీలాల్‌ ఓస్వాల్‌ ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ బై రేటింగ్‌ ఇచ్చింది. పాలజీబజార్‌కు కోటక్‌ ఇనిస్టిట్యూషనల్‌ ఈక్విటీస్‌ బై రేటింగ్‌ ఇచ్చింది. తిరిగి ఈ కంపెనీలు పూర్వపు ఆదరణ సంపాదించుకోవడానికి కొంత సమయం పడుతుందని విశ్లేషకుల అభిప్రాయం. ''ఈ కంపెనీల మూలాలు మెరుగుపడాల్సి ఉంది. స్థూల ఆర్థిక వాతావరణం కూడా అనుకూలించాలి''అని ఆస్తాజైన్‌ పేర్కొన్నారు.



మిస్‌ అయిపోతామన్న భయం వద్దు

ఒక స్టాక్‌ను మిస్‌ అయిపోతామన్న ధోరణి (ఫోమో)కి దూరంగా ఉండాలన్నది స్టాక్‌ మార్కెట్ల నుంచి నేర్చుకోవాల్సిన ముఖ్యమైన పాఠంగా సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్‌ అడ్వైజర్‌ 'టీబీఎంజీ క్యాపిటల్‌' వ్యవస్థాపకుడు తరుణ్‌ బిరానీ తెలిపారు. ఈ విధమైన ధోరణిని అనుసరించకుండా, ఆర్థిక లక్ష్యాలకు కట్టుబడి ఉంటే అది ప్రయోజనాన్ని ఇస్తుందని చెప్పారు. ఇన్వెస్టర్లకు స్టాక్స్‌లో పెట్టుబడులకు ఆసక్తి, కావాల్సిన క్యాపిటల్‌ ఉంటే లాభాలను ఇవ్వదు. లక్ష్యాలు, కాల వ్యవధి పట్ల స్పష్టత ఉండాలి. అప్పుడు తమ కాలవ్యవధి, రాబడుల అంచనాలకు అనుకూలమైన స్టాక్స్‌లో పెట్టుబడి చేసుకోవచ్చు. ఐదేళ్ల లేదా పదేళ్ల కోసం, భవిష్యత్తులో మంచి పనితీరు చూపిస్తుందన్న అంచనాలతో ఐపీవోలో ఇన్వెస్ట్‌ చేస్తే, లిస్టింగ్‌ తర్వాత నష్టాల్లోకి వెళ్లిందని విక్రయించాల్సిన అవసరం ఉండదు. ఎప్పుడు లాభాల్లోకి వస్తామన్నది తమకు తెలియదని జొమాటో ఫౌండర్‌ గోయల్‌ ఐపీవో ముందు నుంచీ చెబుతూనే ఉన్నారు. దీర్ఘకాలం కోసమే తాము వ్యాపారాన్ని నిర్మిస్తున్నామనే అంటున్నారు. కనుక దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్‌ చేసిన వారు ఇప్పుడు అమ్ముకోవాల్సిన అవసరం ఉండదు.

•••

కొందరు లిస్టింగ్‌ రోజు లాభం వస్తే విక్రయించుకోవచ్చన్న ఒకే ఆలోచనతో డిమాండ్‌ ఉన్న ఐపీవోల్లో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తుంటారు. అటువంటి వారు లిస్టింగ్‌ రోజు లాభం వచ్చినా, నష్టం వచ్చినా సరే విక్రయించుకోవాల్సిందే. జొమాటో ఐదేళ్లలో లాభాల్లోకి వస్తుందని అంచనా వేసుకుని ఇన్వెస్ట్‌ చేశారనుకోండి. అప్పటి వరకు వేచి చూసి, కంపెనీ ఫండమెంటల్స్, భవిష్యత్తు ఆధారంగా నిర్ణయానికి రావాలి. స్టాక్స్‌ ఎప్పుడూ పడి లేచే కెరటాలే. కాకపోతే మంచి యాజమాన్యం, బలమైన వ్యాపార మూలాలు ఉన్న కంపెనీలకే ఇది అమలవుతుంది. ఇక అసలు నష్టాల్లో ఉన్న కంపెనీల జోలికి వెళ్లకపోవడం రిస్క్‌ వద్దనుకునే వారికి మెరుగైన మార్గం. వివిధ రంగాల్లో లీడర్లుగా ఉన్న బ్లూచిప్‌ కంపెనీల్లో రిస్క్‌ దాదాపుగా ఉండదు. రాబడులు మోస్తరుగా ఉంటాయి. అధిక రాబడి ఆశించే వారు, అధిక రిస్క్‌ తీసుకుంటున్నట్టే. అది కూడా తగినంత అధ్యయనం, నిపుణుల సూచనల ఆధారంగా కాలిక్యులేటెడ్‌ రిస్క్‌కే పరిమితం కావాలి.

ఎగుమతులు... 'మైనస్‌'

ఆగస్టులో వృద్ధిలేకపోగా 1.15% క్షీణత



న్యూఢిల్లీ: భారత్‌ ఎగుమతులు ఆగస్టులో అసలు వృద్ధిలేకపోగా 1.15 శాతం మేర క్షీణించాయి. విలువలో 33 బిలియన్‌ డాలర్లుగా నమోదయ్యాయి. ఎగుమతుల్లో క్షీణత నమోదుకావడం 20 నెలల్లో ఇదే తొలిసారి. ఇక దిగుమతులు 37 శాతం పెరిగి, 61.68 బిలియన్‌ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి ఎగుమతులు–దిగుమతుల విలువ మధ్య నికర వ్యత్యాసం–వాణిజ్యలోటు రెట్టింపునకు పైగా పెరిగి, 28.68 బిలియన్‌ డాలర్లుగా ఉంది. దిగుమతుల బిల్లు భారీగా పెరగడానికి క్రూడ్‌ ఆయిల్‌ దిగుమతులు ప్రధాన కారణం. ఇక ఏప్రిల్‌ నుంచి ఆగస్టు మధ్య ఎగుమతులు 17.12 శాతం పెరిగి 192.59 బిలియన్‌ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 45.64 శాతం పెరిగి 317.81 బిలియన్‌ డాలర్లుగా నమోదయ్యాయి.

ఎస్‌డబ్ల్యూపీ ఎలా పనిచేస్తుంది..?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్‌



నా సోదరుడు మ్యూచువల్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేసి ఉన్నాడు. దురదృష్టంకొద్దీ అతడు ఇటీవలే మరణించాడు. నామినీగా మా వదిన ఉండడంతో, ఆమె పేరు మీదకు ఫండ్స్‌ యూనిట్లు బదిలీ అయ్యాయి. ఇప్పుడు మా వదిన వాటిని విక్రయించాల్సి ఉంటుందా?

– వరుణ్‌

యూనిట్‌ హోల్డర్‌ మరణిస్తే, వారి పేరుమీద ఉన్న యూనిట్లను నామినీ క్లెయిమ్‌ చేసుకోవాలి. అప్పుడు ఆ యూనిట్లు నామినికి బదిలీ అవుతాయి. సాధారణంగా బ్యాంకు డిపాజిట్లు, బీమా ప్లాన్లలో ఆ మొత్తం నామినీ బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది. కానీ, మ్యూచువల్‌ ఫండ్స్‌లో అలా కాకుండా యూనిట్లను నామినీకి బదిలీ చేస్తారు. ఒకసారి ఇలా బదిలీ అయిన యూనిట్లకు నామినీయే యజమాని అవుతారు. కనుక వారు కోరుకున్నంత కాలం ఆ యూనిట్లను కొనసాగించుకోవచ్చు. విక్రయించడం తప్పనిసరి కాదు.

ఎస్‌డబ్ల్యూపీ (సిస్టమ్యాటిక్‌ విత్‌డ్రాయల్‌ ప్లాన్‌) అంటే ఏంటి? ఏక మొత్తంలో ఓ పథకంలో పెట్టుబడి పెట్టి, తదుపరి నెల నుంచి ఎస్‌డబ్ల్యూపీ ద్వారా ఆదాయం పొందొచ్చా? అలా అయితే అది నా పెట్టుబడిపై ప్రభావం చూపిస్తుందా?

– కృతిక

పెట్టుబడులను వెనక్కి తీసుకునే విషయమై ప్రణాళిక కలిగి ఉండడం కూడా ముఖ్యమే. మార్కెట్లలో అస్థిరతలను అధిగమించేందుకు క్రమానుగత పెట్టుబడులకు సిప్‌ ఎలా ఉపయోగపడుతుందో..? అదే మాదిరి.. సిస్టమ్యాటిక్‌ విత్‌డ్రాయల్‌ ప్లాన్‌ అన్నది పెట్టుబడిని క్రమానుగతంగా వెనక్కి తీసుకునేందుకు వీలు కల్పిస్తుంది. మార్కెట్లు కనిష్టాల్లో (తక్కువ విలువల వద్ద) ఉన్నప్పుడు పెట్టుబడినంతా వెనక్కి తీసుకోకుండా ఎస్‌డబ్ల్యూపీ సాయపడుతుంది. ఇది రిటైర్మెంట్‌ తీసుకున్న వారికి చాలా అనుకూలంగా ఉంటుంది. దీని ద్వారా వారు తమకు కావాల్సినంత స్థిరమైన ఆదాయం పొందే ఏర్పాటు చేసుకోవచ్చు. ఎన్ని రోజులకు ఒకసారి ఆదాయం రావాలన్నది నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉంటుంది. ఇన్వెస్టర్‌ ప్రతీ నెలా నిర్ణీత తేదీన, నిర్ణీత మొత్తాన్ని ఎస్‌డబ్ల్యూపీ ద్వారా రావాలని నిర్ణయించుకుంటే.. అదే రోజు ఆ మొత్తం బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది. ఆ మేరకు పెట్టుబడుల నుంచి యూనిట్లు తగ్గిపోతాయి. సిప్‌లో ప్రతీ నెలా నిర్ణీత మొత్తం బ్యాంకు ఖాతా నుంచి కోరుకున్న మ్యూచువల్‌ ఫండ్స్‌ పథకాల్లోకి జమ అవుతుంది. దీనికి పూర్తి వ్యతిరేకంగా పనిచేసేదే ఎస్‌డబ్ల్యూపీ.

కానీ, ఇక్కడ రెండు కీలక అంశాలను గుర్తు పెట్టుకోవాలి. మొత్తం పెట్టుబడుల్లో కనీసం మూడింట ఒక వంతు అయినా ఈక్విటీల్లో ఉంచుకోవాలి. ఉపసంహరించుకునే మొత్తం వార్షికంగా పెట్టుబడుల విలువలో 4–6 శాతం మించకూడదు. దీనివల్ల పెట్టుబడికి నష్టం లేకుండా ఉంటుంది. ఉదాహరణకు మీ పెట్టుబడులపై రాబడి వార్షికంగా 8–9 శాతంగా ఉండి, మీరు 5 శాతాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు అయితే.. అప్పుడు మిగిలిన 3–4 శాతం రాబడి పెట్టుబడి వృద్ధికి సాయపడుతుంది. దీనివల్ల ఎక్కువ కాలం పాటు పెట్టుబడి నిలిచి ఉంటుంది. ఎస్‌డబ్ల్యూపీ ద్వారా తీసుకునే మొత్తంలో కొంత పెట్టుబడి, కొంత లాభం ఉంటుంది. ఈ లాభంపైనే పన్ను పడుతుంది. డెట్‌లో అయితే మూడేళ్లకు మించిన లాభంపై 20 శాతం చెల్లించాలి. మూడేళ్లలోపు లాభం వ్యక్తిగత ఆదాయానికి కలుస్తుంది. ఈక్విటీల్లో అయితే ఏడాదిలోపు లాభంపై 15 శాతం చెల్లించాలి. ఏడాదికి మించిన లాభం మొదటి రూ.లక్షపై పన్ను లేదు. తదుపరి లాభంపై 10 శాతం పన్ను పడుతుంది.

ట్విన్ టవర్స్‌పై విమర్శల వర్షం



అద్దాలతో మెరిసిపోతున్న ట్విన్ టవర్స్‌ను చూశారు కదా! వీటిని మన రైల్వే మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమాల్లో ఆదివారం పోస్ట్ చేసింది. పునరుద్ధరణ తరువాత న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ (ఎన్‌డీఎల్‌ఎస్) ఇలా ఉండబోతోందని పేర్కొంది. ఆధునికంగా కనబడుతున్నా.. ఆ టవర్స్‌పై నెటిజన్స్ మాత్రం అసంతృప్తి వ్యక్తం చేశారు. 40 అంతస్తుల జంట భవనాల్లో మల్టీ లెవల్ పార్కింగ్, పికప్, డ్రాప్ జోన్స్, 91 బస్‌బేలు, 1,500 ఈసీఎస్ పార్కింగ్‌లు ఉంటాయని, షాపులు, ఆఫీసులు, ఓ పెద్ద హోటల్ నిర్వహణకు సరిపడా స్థలముంటుందని రైల్వే శాఖ పేర్కొంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ ఫొటోస్‌ను 5వేల మంది రీట్వీట్ చేశారు.

- రైల్వే స్టేషన్‌కు సంక్లిష్టమైన డిజైన్ అవసరమా?
- నిర్మాణానికి ఎక్కువ టైమ్ తీసుకోవడమే కాదు.. ఆ అద్దాల నుంచి వచ్చే ఉష్ణోగ్రత వేసవిలో ఢిల్లీ టెంపరేచర్‌ను మరింత పెంచుతుంది.
- డిజైన్ బాగానే ఉంది కానీ.. చూడ్డానికి 2025 ప్లాన్‌లా ఉంది. దానికోసం భూసేకరణ ఎలా చేస్తారు? బయట ఉన్న పహాడ్‌గంజ్ నివాసితులను ఏం చేస్తారు?
- హైప్డ్ డిజైన్‌తో అనవసరమైన ఖర్చు. సింపుల్‌గా ఎఫెక్టివ్‌గా కట్టలేమా? ఆధునికత పేరుతో ధరలు పెంచుతారు. ఆ భారం ప్రయాణికులపైనే పడుతుంది.
- ఇది ఎక్కడినుంచో కాపీ కొట్టినట్టు ఉంది.

..అంటూ విమర్శల వర్షం కురిపించారు.

అరుదైన గుడ్లగూబలు

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 12 రకాల జాతులు

నల్లమలలో చుక్కల పొట్ట గద్దాకారపు గుడ్లగూబ

- వేట, అడవులు తగ్గడంతో వాటి ఉనికికి ప్రమాదం.. మనుషుల అపనమ్మకాలు కూడా కారణమే
- ఎలుకల నియంత్రణ ద్వారా ఆహార భద్రత కల్పిస్తున్న గుడ్లగూబలు
- వాటి సంరక్షణ ముఖ్యమంటున్న నిపుణులు



గాదె గుడ్లగూబ (బార్న్ ఔల్)




గడ్డి గుడ్లగూబ (ఈస్టర్న్ గ్రాస్ ఔల్)

సాక్షి, అమరావతి: గుడ్లగూబలు మానవాళికి ఎంతో మేలు చేకూరుస్తున్నాయి. ఒక్క గాదె గుడ్లగూబ (బార్న్ ఔల్) తన జీవిత కాలంలో 11 వేల ఎలుకలను తింటుందని అంచనా. తద్వారా 13 టన్నుల ఆహార పంటలను కాపాడుతుందని ఒక పరిశోధనలో తేలింది. గుడ్లగూబలు ఎలుకలతోపాటు కీటకాలు, చిన్న పక్షులను వేటాడి తింటాయి. తద్వారా వాటితో మానవాళికి వ్యాధులు ప్రబలకుండా నివారిస్తాయి. ఇంత మేలు చేకూరుస్తున్న గుడ్లగూబలను అపోహలతో, అపనమ్మకాలతో మనుషులు దూరం చేసుకుంటున్నారు. అడవులు తగ్గిపోవడం, వేట వంటి కారణాలతో వీటి సంఖ్య తగ్గిపోతోందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఇటీవల రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అరుదైన గుడ్లగూబలు దర్శనమిస్తున్నాయని అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. అత్యంత అరుదైన చుక్కల పొట్ట గద్దాకారపు గుడ్లగూబ (స్పాట్ బెల్లీడ్ ఈగల్ ఔల్) కొద్ది రోజుల క్రితం నల్లమల అడవుల్లో కనిపించిందని అంటున్నారు. రాష్ట్రంలో ఈ జాతి గుడ్లగూబ కనిపించడం ఇదే తొలిసారి. అలాగే దట్టమైన అడవుల్లో మాత్రమే నివాసం ఏర్పరచుకునే గోధుమ రంగు అడవి గుడ్లగూబ (బ్రౌన్ వుడ్ ఔల్)లను పాపికొండలు, నల్లమల అడవుల్లో గుర్తించారు. శీతాకాలంలో రష్యా, యూరప్‌ల నుంచి మన దేశానికి వలస వచ్చే పొట్టి చెవుల గుడ్లగూబలు కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని గడ్డి మైదానాల్లో కనిపించాయి. అలాగే చిత్తూరు, వైఎస్సార్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లోని గడ్డి మైదానాల్లో వీటి ఉనికి ఉన్నట్లు నిర్ధారించారు. రాష్ట్రంలో అత్యంత అరుదుగా కనిపించే గుడ్లగూబల జాబితాలో ఉన్న గడ్డి గుడ్లగూబ (ఈస్టర్న్ గ్రాస్ ఔల్) ఇటీవల కాలంలో ఎక్కడా కనిపించలేదు.

సంరక్షణ అందరి బాధ్యత

దట్టమైన అడవులు, కొండలు, గడ్డినేలలు కనుమరుగు కావడం, వేట వల్ల గుడ్లగూబలు, వాటి పరిధి నెమ్మదిగా తగ్గుతోంది. తెలుగు రాష్ట్రాల్లో గుడ్లగూబల సంరక్షణను చాలా నిర్లక్ష్యం చేస్తున్నారు. వీటివల్ల మానవాళికి ఎంతో మేలు జరుగుతుంది. వాటిని సంరక్షించడం మనందరి బాధ్యత.

– రాజశేఖర్ బండి, సిటిజన్ సైంటిస్ట్, ఐఐఎస్ఈఆర్, తిరుపతి



చుక్కల పొట్ట గద్దాకారపు గుడ్లగూబ

మనదేశంలో 35 జాతులు

కాగా ప్రపంచవ్యాప్తంగా 220కిపైగా, మన దేశంలో 35, మన రాష్ట్రంలో 12 రకాల గుడ్లగూబ జాతుల్ని గుర్తించారు. మనదేశంలో 16 రకాల గుడ్లగూబ జాతులను అక్రమ వ్యాపారానికి వినియోగిస్తున్నట్లు తేలింది. కొందరు చేతబడి, క్షుద్రపూజలు వంటి వాటికి వీటిని ఉపయోగిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో గుడ్లగూబలు ఎత్తయిన భవనాలు, అపార్టుమెంట్లలో గూడు కట్టుకుంటున్నాయి. వాటిని ప్రజలు అపశకునంగా భావిస్తూ గూళ్లను నాశనం చేస్తున్నారు. దీంతో గుడ్లగూబల ఉనికికి ప్రమాదం ఏర్పడింది.

ఇతర పక్షులకు భిన్నంగా గుడ్లగూబలకు కళ్లు మనుషుల మాదిరిగా ముఖం ముందు ఉంటాయి. కానీ మనుషుల్లా కళ్లను కదిలించలేవు. అవి తలను 270 డిగ్రీల వరకు తిప్పి చూడగలుగుతాయి. ఈ సామర్థ్యంతోనే అవి రాత్రి వేళల్లో చురుగ్గా వేటాడతాయి. అవి మనుషుల మీద దాడిచేయవు. అపోహలు, అపనమ్మకాలు గుడ్లగూబలను మనుషుల నుంచి దూరం చేశాయి.

5 లక్షల ఏళ్ల నాటి ఏనుగు దంతం



ఇజ్రాయెల్‌లో తవ్వకాల్లో బయటపడ్డ 5 లక్షల ఏళ్ల నాటి ఏనుగు దంతం

ఏనుగు దంతం ఎంత పొడవుంటుంది? ప్రస్తుతం ఆఫ్రికాలోని అతి పెద్ద ఏనుగుల దంతం సగటున ఐదు నుంచి ఆరడుగులు ఉంటుంది. కానీ.. ఇజ్రాయెల్‌లో 5 లక్షల ఏళ్ల నాటి ఏనుగు దంతం ఒకటి తవ్వకాల్లో బయటపడింది. 4 లక్షల ఏళ్ల కిందటే అంతరించిపోయిన అరుదైన ఏనుగు దంతం ఎనిమిదన్నర అడుగుల పొడవు, 150 కిలోల బరువు ఉంది. దాని పక్కనే ఆ కాలంలో ఆదిమ మానవుడు జంతువులను, పెద్ద పెద్ద ఏనుగులను సైతం కోసేందుకు ఉపయోగించిన రాతి వస్తువు కూడా దొరికింది. దంతం సైజును బట్టి... ప్రస్తుతం ఆఫ్రికాలో ఉన్న ఏనుగుల కంటే ఆ ఏనుగులు చాలా పెద్దవై ఉంటాయని చరిత్రకారులు చెబుతున్నారు. సాధారణంగా తినడానికి, నిల్వ చేసుకోవడానికైనా చిన్నచిన్న జంతువులను వేటాడతారు. ఇంత పెద్ద ఏనుగును వేటాడి ఆ మాంసం నిల్వ చేయడం కష్టసాధ్యమైన పని. అదో పెద్ద సామూహిక ఉత్సవం కోసం జరిగిన వధ అయి ఉంటుందని భావిస్తున్నారు.

ఆస్పత్రి నుంచి మంత్రి విశ్వరూప్ డిశ్చార్జ్



అమలాపురం టౌన్: అస్వస్థతకు గురై హైదరాబాద్ సిటీ న్యూరో సెంటర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పూర్తిగా కోలుకుని ఆదివారం సాయంత్రం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అనంతరం హైదరాబాద్‌లోని తన నివాసానికి వెళ్లి మంత్రి విశ్రాంతి తీసుకుంటున్నట్టు ఆయన సతీమణి బేబీ మీనాక్షి చెప్పారు.

కౌంటర్ టికెట్లకూ ఆన్‌లైన్ రద్దు సదుపాయం

- రైల్వే టికెట్ రీఫండ్‌కు సరికొత్త అవకాశం.. వెయిటింగ్ లిస్టు ప్రయాణికులకు ఊరట

సాక్షి, హైదరాబాద్: వెయిటింగ్ లిస్టు ప్రయాణికులు టికెట్ రీఫండ్ కోసం ఇక రిజర్వేషన్ కౌంటర్లకు వెళ్లవలసిన అవసరం లేదు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ద్వారా టికెట్ రీఫండ్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. సాధారణంగా ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకొన్న ప్రయాణికులకు మాత్రమే తిరిగి ఆన్‌లైన్ ద్వారా రీఫండ్ చేసుకొనే సౌలభ్యం ఉంది. ఇటీవల ఆ సదుపాయాన్ని కౌంటర్ టికెట్లకు సైతం విస్తరించారు. రైల్వే రిజర్వేషన్ కేంద్రాల్లో టికెట్ తీసుకొన్నా తమ సీటు నిర్ధారణ కాక వెయిటింగ్ లిస్టులో ఉంటే ప్రయాణికులు రిజర్వేషన్ కార్యాలయాల్లోనే రీఫండ్‌కు దరఖాస్తు చేసుకోవలసి ఉండేది. కానీ 15 శాతం మంది అలా వెళ్లలేకపోతున్నట్లు అంచనా. సకాలంలో వెళ్లలేక చాలామంది టికెట్ డబ్బును నష్టపోవలసి వస్తోంది. దీన్ని నివారించేందుకు రైల్వేశాఖ కౌంటర్ టికెట్లకు సైతం ఆన్‌లైన్ రీఫండ్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది.

అరగంట ముందు చాలు...

ఐఆర్‌సీటీసీ ద్వారా రిజర్వేషన్ బుక్ చేసుకొనే వెయిటింగ్ లిస్టు ప్రయాణికులు తమ ప్రయాణం నిర్ధారణ కాని పక్షంలో రైలు బయలుదేరే సమయానికి అరగంట ముందు వరకు కూడా టికెట్లు రద్దు చేసుకోవచ్చు. డబ్బులు ఆటోమేటిక్‌గా వారి ఖాతాలో చేరిపోతాయి. కానీ కౌంటర్ టికెట్లకు ఆ అవకాశం లేదు. తాజా మార్పుతో కౌంటర్‌లో టికెట్లు తీసుకున్న వాళ్లూ ఆన్‌లైన్ రీఫండ్ చేసుకోవచ్చు. రైలు సమయానికి అరగంట ముందు కూడా రద్దు చేసుకోవచ్చు. కానీ టికెట్ డబ్బులు తీసుకొనేందుకు మాత్రం రైలు బయలుదేరిన నాలుగు గంటలలోపు రిజర్వేషన్ కౌంటర్‌కు వెళ్లవలసి ఉంటుంది. 'ఇది ప్రయాణికులకు ఎంతో ఊరట. రిజర్వేషన్ నిర్ధారణ అవుతుందని రైలు బయలుదేరే వరకూ ఎదురు చూసేవాళ్లు చివరి నిమిషంలో కౌంటర్లకు వెళ్లి టికెట్ రద్దు చేసుకోలేకపోతున్నారు. అలాంటి వారికిది చక్కటి అవకాశం' అని దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

30 శాతం కౌంటర్ టికెట్లు...

- ప్రతి ట్రైన్‌లో 30 శాతం వరకు వెయిటింగ్ లిస్టు టికెట్లను ఇవ్వొచ్చు.18 నుంచి 24 బోగీలు ఉన్న రైళ్లలో స్లీపర్, ఏసీ బోగీల సంఖ్య మేరకు 300 వరకు వెయిటింగ్ లిస్టు టికెట్లను ఇస్తారు. కానీ చాలా సందర్భాల్లో 400 వరకూ వెయిటింగ్ లిస్టు జాబితా పెరిగిపోతుంది.
- 70 శాతం మంది ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ద్వారానే టికెట్లు బుక్ చేసుకుంటున్నారు. 30 శాతం మంది మాత్రమే కౌంటర్ల వద్దకు వెళ్తున్నారు.

● తెలంగాణ

పల్లమెరుగు నీరు.. పైకెగురు..!

ఏమిటీ సుడిగాలి అనుకుంటున్నారా..? కానీ ఇది గాలి కాదు.. నీరు! ఆదివారం సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల పరిధిలోని నిర్జల్ల గ్రామ శివారులో ఉన్న సింగూరు జలాశయంలో ఆశ్చర్యకర ఘటన చోటుచేసుకుంది. జలాశయం నుంచి నీరు ఇలా వేగంగా సుడులు తిరుగుతూ మేఘాల్లోకి చేరింది. పంట పొలాల్లో ఉన్న రైతులు ఈ దృశ్యాన్ని ఆసక్తిగా తిలకించారు. ఓ రైతు తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. - వట్‌పల్లి (అందోల్)



ఆకాశంలో ఏర్పడిన అరుదైన దృశ్యం

తనికెళ్ల భరణికి 'లోక్‌నాయక్' పురస్కారం

- నేడు విశాఖ కళాభారతిలో ప్రదానం



ఏయూ క్యాంపస్: లోక్‌నాయక్ ఫౌండేషన్ వార్షిక సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు, రచయిత తనికెళ్ల భరణికి ప్రదానం చేయనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకుడు, ఏపీ అధికార భాషా సంఘం చైర్మన్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. విశాఖపట్నంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం సాయంత్రం కళాభారతిలో లోక్‌నాయక్ ఫౌండేషన్ వార్షిక సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవ సభ నిర్వహిస్తామని చెప్పారు. ఈ సభలో తనికెళ్ల భరణికి పురస్కారం, రూ.2లక్షలు నగదు బహుమతి అందిస్తామని వివరించారు. తెలుగు సంస్కృతి, భాష, సాహిత్య రంగాలకు విశేష సేవలు అందిస్తున్న వ్యక్తులకు 18 ఏళ్లుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా మాజీ సీఎం ఎన్టీ రామారావు శత జయంతి సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆయన సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి తుది వరకు వెన్నంటి ఉన్న వ్యక్తులను కూడా గౌరవిస్తూ సన్మానిస్తామని చెప్పారు. ఎన్టీఆర్‌కు ప్రత్యేక అధికారిగా పనిచేసిన జి.రామచంద్రరావు, వ్యక్తిగత సహాయకుడు మోహన్, భద్రతాధికారి కృష్ణారావు, కారు డ్రైవర్ లక్ష్మణ్‌ను సన్మానించి రూ.లక్ష చొప్పున నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు, అతిథులుగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, సినీనటుడు మోహన్‌బాబు, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ ఎన్.జయప్రకాష్ నారాయణ, విజ్ఞాన్ విద్యా సంస్థల కార్యదర్శి లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు హాజరవుతారని తెలిపారు.

నాలుగు తరాలు ఉపాధ్యాయ వృత్తిలోనే..

- తన ఏడుగురు కుమారులను టీచర్లుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు బంగారేశ్వర శర్మ
- ఇద్దరు కోడళ్లు కూడా..
- నాలుగు తరాలుగా ఆ కుటుంబం ఉపాధ్యాయ వృత్తిలోనే..
- తూర్పు గోదావరి జిల్లా తాళ్లరేవు మండలం ఇంజరం గ్రామంలోని 'ఓలేటి' కుటుంబం ప్రత్యేకత



ఉపాధ్యాయుడుగా తాను సాధించిన జ్ఞాపికలతో వెంకట బంగారేశ్వరశర్మ

తాళ్లరేవు: 'ఇంజరం.. విద్వత్ కుంజరం..' అన్నది అనాదిగా ఉన్న నానుడి. వేద పండితులు, విద్వాంసులు, సంగీత, సాహిత్య కళాకారులకు తూర్పు గోదావరి జిల్లా తాళ్లరేవు మండలంలోని ఇంజరం గ్రామం నెలవు. ఇదేకాదు.. ఈ గ్రామంలో ఓలేటి కుటుంబానికీ ఓ ప్రత్యేకత ఉంది. ఆ కుటుంబం నాలుగు తరాలుగా ఉపాధ్యాయ వృత్తిలోనే కొనసాగుతోంది. గ్రామానికి చెందిన ఓలేటి బంగారేశ్వరశర్మ పాఠశాల వ్యవస్థ లేని కాలంలోనే గురుకుల వ్యవస్థ పరంపరలో తన ఇంటి అరుగు మీదే విద్యార్థులకు సాహిత్యం, పాఠాలు బోధించేవారు. ఆయన కుమారుడు ఓలేటి సూర్యనారాయణశాస్త్రి గ్రేడ్‌-1 ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఈయన కుమారుడు ఓలేటి శ్రీనివాసశర్మ కూడా ఉపాధ్యాయుడే. ఈయన తన ఏడుగురు కుమారులను ప్రభుత్వ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దారు. తన తాత, తండ్రి స్ఫూర్తితో విద్య ద్వారా మాత్రమే సమాజాన్ని మార్చగలమని విశ్వసించి తన పిల్లలను ఉపాధ్యాయులను చేశారు. ఆయన ఇద్దరు కోడళ్లు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులే కావడం విశేషం.

ఏడుగురు కుమారులూ ఇలా..

ఇక శ్రీనివాసశర్మ పెద్ద కుమారుడు సూర్యనారాయణశాస్త్రి తెలుగు ఉపాధ్యాయుడిగా.. రెండో కుమారుడు వెంకటభాస్కరశర్మ సంస్కృత, సాహిత్య అధ్యాపకునిగా.. మూడో కుమారుడు వెంకట ఫణినాథశర్మ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా.. నాలుగో కుమారుడు వెంకట రమణశర్మ ఎస్‌జీటీగా పనిచేస్తున్నారు. అలాగే, ఐదో కుమారుడు సుబ్రహ్మణ్యేశ్వర శర్మ వ్యాకరణ అధ్యాపకుడిగా.. ఆరో కుమారుడు వెంకట బంగారేశ్వరశర్మ తెలుగు ఉపాధ్యాయుడిగా.. ఏడో కుమారుడు మృత్యుంజయ శర్మ గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మరోవైపు.. మూడో కుమారుడు వెంకటఫణినాథ శర్మ భార్య రాజేశ్వరి, ఆరో కుమారుడు బంగారేశ్వరశర్మ భార్య వీరేశ్వరి కూడా టీచర్లే. ఇలా మొత్తం ఆ కుటుంబంలో తొమ్మిది మంది ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్నారు. అలాగే, శ్రీనివాసశర్మ కుమార్తె సుబ్బలక్ష్మి కుమారుడు, అల్లుడు కూడా ఉపాధ్యాయులే. మొత్తం మీద ఓలేటి కుటుంబమంతా ఉపాధ్యాయులుగా పనిచేస్తూ నాలుగు తరాలుగా విద్యాభివృద్ధికి కృషిచేస్తోంది. తన కుమారులు ఏడుగురూ తండ్రి ప్రోత్సాహంతోనే ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారని శ్రీనివాసశర్మ సతీమణి ఓలేటి వెంకట సీతామహాలక్ష్మి 'సాక్షి'కి తెలిపారు.

భళా.. బాలకా..

చెన్నై-లేహ్ సైకిల్ యాత్ర చేసిన 15 ఏళ్ల తెలుగు బాలుడు



సాక్షి, న్యూఢిల్లీ: తల్లిదండ్రులు తమ కలల్ని పిల్లలపై రుద్దకుండా, పిల్లల ఇష్టాయిష్టాలను గౌరవించాలంటూ 10వ తరగతి పూర్తిచేసిన తెలుగు బాలుడు 15 ఏళ్ల ఆశిష్ చెన్నై నుంచి లద్దాఖ్ రాజధాని లేహ్ వరకు సైకిల్ మీద సాహసయాత్ర చేశాడు. కడప జిల్లా రాజంపేట ప్రాంతానికి చెందిన ఆశిష్ కుటుంబం వ్యాపార రీత్యా కొన్నేళ్ల కిందట చెన్నైలో స్థిరపడింది. సైక్లింగ్‌పై ఆసక్తి ఉన్న ఆశిష్ జూలైలో చెన్నై నుంచి సైకిల్‌పై బయలుదేరి 41 రోజుల్లోనే లేహ్‌కు చేరుకున్నాడు. సైకిల్‌యాత్రను పూర్తిచేసి తిరుగుప్రయాణంలో ఢిల్లీకి చేరుకున్న ఆశిష్ సహా అతడి కుటుంబసభ్యులు ఏపీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఆశిష్ మాట్లాడుతూ సైకిల్ యాత్రలో మైదాన ప్రాంతంలో రోజూ 120 నుంచి 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు చెప్పాడు. చండీఘడ్ నుంచి పర్వత ప్రాంత ప్రయాణం మొదలయ్యాక ప్రతికూల వాతావరణం, వర్షం కారణంగా తీవ్రంగా ఇబ్బందిపడినా యాత్రను కొనసాగించినట్లు తెలిపాడు. నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చేరాలన్నదే తన కల అని పేర్కొన్నాడు. తనపై తల్లిదండ్రులెప్పుడూ ఎలాంటి ఒత్తిడి చేయలేదని, మిగతా పిల్లల తల్లిదండ్రులు కూడా పిల్లల విషయంలో ఇలాగే ఉండాలని కోరుకుంటున్నానని తెలిపాడు. చెన్నై నుంచి లండన్‌కు సైకిల్‌యాత్ర చేయనున్నట్లు ఆశిష్ చెప్పాడు.

97.86% పింఛన్ల పంపిణీ



చికిత్స నిమిత్తం కర్ణాటక రాష్ట్రం బళ్లారి వెళ్లిన బసివి గిరెమ్మకు పింఛన్ అందజేస్తున్న కర్నూలు జిల్లా నెరణి గ్రామ వలంటీర్ కాళమ్మ

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం కూడా వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ల సొమ్మును పంపిణీ చేశారు. మొత్తంమ్మీద గత నాలుగు రోజులుగా 60,98,340 మంది లబ్ధిదారులకు రూ.1,550.59 కోట్లు పింఛన్ల రూపంలో పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 97.86 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తయిందని సెర్ప్ అధికారులు ఆదివారం తెలిపారు. మిగతా వారి కోసం సోమవారం కూడా పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని వారు పేర్కొన్నారు.

– సాక్షి, అమరావతి



గుంటూరులో చికిత్స పొందుతున్న బచ్చు లక్ష్మీదేవికి పింఛన్ ఇస్తున్న ప్రకాశం జిల్లా మార్కాపురం వలంటీర్ జ్యోతి



గుంటూరు చైతన్యనగర్‌కు చెందిన వెంకటేశ్వర్లుకు వృద్ధాప్య పింఛన్ ఇస్తున్న వార్డు వలంటీర్ ఉమాభాయ్

మానవ అక్రమ రవాణా తగ్గడం శుభపరిణామం

- ఏపీ ప్రభుత్వ చర్యలు ఫలిస్తున్నాయి
- జాతీయ నేర నివేదికపై హెల్ప్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి రామమోహన్ విశ్లేషణ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మానవ అక్రమ రవాణా తగ్గుముఖం పట్టడం శుభపరిణామం అని, గతేడాది కాలంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న కట్టుదిట్టమైన చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని అనేందుకు ఇదే సంకేతమని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కార్యదర్శి రామమోహన్ నిమ్మరాజు స్పష్టం చేశారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా స్వచ్ఛంద సంస్థ ద్వారా కొన్నేళ్లుగా కృషి చేస్తున్న రామమోహన్ జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ)–2021 నివేదికపై ఆదివారం స్పందించారు. ఇందుకు సంబంధించిన సమీక్షను 'సాక్షి'కి వెల్లడించారు. ప్రభుత్వం దిశ బిల్లుతో, ఇతర చర్యలతో రాష్ట్రంలో మహిళలు, బాలికల రక్షణకు భరోసా ఇచ్చినట్లు అయిందన్నారు. గతేడాది ప్రతి జిల్లాకు ఒక మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఏర్పాటు చేసి అక్రమ రవాణా నిరోధానికి కఠిన చర్యలు తీసుకోవడం మంచి ఫలితాలు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా మానవ అక్రమ రవాణా కేసుల్లో 2020లో మూడో స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ 2021లో ఐదో స్థానానికి తగ్గిందన్నారు. ఎన్‌సీఆర్‌బీ రిపోర్టు ప్రకారం మానవ అక్రమ రవాణాలో మొదటి స్థానంలో తెలంగాణ, రెండు, మూడు, నాలుగు స్థానాల్లో వరుసగా మహారాష్ట్ర, అస్సాం, కేరళ ఉన్నాయన్నారు. గతేడాది ఆంధ్రప్రదేశ్‌లో 99.3 శాతం కేసుల్లో పోలీసులు చార్జిషీట్ వేయడం, 757 మందిని అరెస్టు చేయడం ఒక రికార్డు అని రామమోహన్ వివరించారు.

అక్రమ రవాణాకు గురైన కారణాలు

లైంగిక వ్యాపారం కోసం	గృహహింసతో
223 మంది	3

ఇతర కారణాలతో 53 మంది

ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా కేసులు

2019	2020	2021
245	171	168

2021లో అక్రమ రవాణా బాధితులు

వయస్సు	పురుషులు	మహిళలు	మొత్తం
18 లోపు	29	29	58
18 పైన	1	279	280
మొత్తం	30	308	338

2021లో రక్షించబడినవారు

వయస్సు	పురుషులు	మహిళలు	మొత్తం
18 లోపు	0	11	11
18 పైన	1	267	268
మొత్తం	1	278	279

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.